UNIVERSAL
LIBRARY
OU_204321
UNIVERSAL
LIBRARY

OUP—556—13-7-71—4,000.


**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. TB 2 Accession No. T. G 219

Author NITK

Title నంజుండరావు కైఫీయతు
[illegible] 1335

This book should be returned on or before the date last marked below.



కవి పండితులును విప్రనారాయణనాటక

కర్త్యనేక గ్రంథకర్తయు నగు

రూపనగుడి నారాయణరావుగారి

పాదములకీ పుస్తకము

మతి భక్తి విశ్వాసములతో సమర్పింపఁబడినది.

# విన్నపము.

సాహిత్య చరిత్రమును దేశ చరిత్రమును నిత్య సంయోగములు. అందునను, నాటక సారస్వతమునకును జన జీవనమునకును గల సంబంధ మతి అన్యోన్యము. జీవన ప్రతిబింబమే నాటకము. శబ్దమునకును అర్థమునకును నుండు సాంగత్యమువలె నొకటి యొకటి యుండును. ప్రాచీన కాలమునందు వివిధ నాగరకతల పరస్పర సంఘర్షణములు తక్కువ. అందుచే నప్పటి కావ్యవస్తువులన్నియు చాలవఱకు, సాంసారిక వ్యవహారముల నావరించి యుండెను. సోదరుల పరస్పర క్రోధాసూయలు, భార్యాపహరణములు, తన్మూలమున నుద్భవిల్లు సంఘటనలు, మున్నవియే ముఖ్యకావ్య వస్తువులు. ఇప్పుడన్ననో, కాలచక్ర మతివేగముగ తిరుగుచున్నది. ప్రపంచము మానవుని జ్ఞానములో నతి విశాలమైనది. అయినను, రైళ్ళతోను, పొగ యోడలతోను, తంతీవార్త వాయువార్తల మూలముననను, వివిధ దేశములును గలుపఁబడి యున్నవి. వివిధనాగరకత లొండొంటిని సంఘర్షించు చున్నవి. ముఖ్యముగా పాశ్చాత్య నాగరకత ప్రపంచము నందెల్లెడల నొక తీవ్ర సంచలనమును గలుగ జేసినది. నూతనాభిప్రాయ

ములు, నూతనాశయములు, నూతనార్థిక సమస్యలు, జాతివర్ణభేదముల సంఘట్టనములు, నూతన సందేహ విమర్శనలు, నూతనతత్వ విజ్ఞాన పరిశోధనలు, వాని ఫలములైన యంత్ర నిర్మాణాదుల వలన బుట్టిన సంఘ వ్యవస్థావస్థలు, ఇవన్నియును మానవుని జీవనము నతి క్లిష్ట మొనరించినవి. ఎచ్చటఁ జూచినను సంస్కారణ జ్యోతి మార్గదర్శియై పొడఁగట్టు చున్నది. రాజకీయ వ్యవహారము లందేమి, మతవిచారము లందేమి, సంఘ వ్యవస్థల విషయములందేమి, క్రొత్త పోకడలను గాంచు చున్నాము. సర్వమానవ సమత్వము, ప్రజాపాలనము మున్నగునవి ముఖ్య సూత్రములై చెవుల మ్రోగు చున్నవి. సాహిత్య సామ్రాజ్యము నందుగూడ నీ సంరంభమును గాంచుట సహజమేకదా! సంఘ సమయ మునందు ప్రాచీన నవీన సంస్కారములకును, నాదర్శము లకును, సరియైన సమ్మేళన మొనరించుకొనుట తప్పని విధియై పరిణమించినది. పాశ్చాత్య నాగరకతలో నుత్తమ ప్ర[illegible] ని[illegible] [illegible] వ్యవహారములను భారతీయులుకూడ నవలంబించుటలోఁ దప్పేమియు లేదు కదా! అయిన బుద్ధిభీరుతనమును, దాస్యచిత్తవృత్తి యు నడ్డు వచ్చునేమో!

మన సంఘమునందు దేవదాసీల కులముండుట ఒక కళంకమని తెలిసినవా రందఱును నొప్పుకొను

చున్నారు. అయిన నిజమరయఁబోయిన చాల మంది ప్రాజ్ఞులు సహితము వారాంగనల వృత్తియొకటి యుండుట అవసరపు చెడుగులలో నొకటిగా భావించుటఁ గాంచు చున్నాము. ఇది కడు శోచనీయము. ఈ "కుబేరపతన"మను నాటకమునందు పడుపువృత్తి ఖండింపఁబడినది. స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్య విషయ మించుక సూచింపఁబడినది. కథ దేవలోకమునఁ బ్రారంభింపఁబడినను కథా భాగమంతయు భూలోకమున నడచును. ఈ నాటక మొక సాంఘిక నాటకముగఁ గైకొనవచ్చును. ఇతివృత్తము సూరయకవి విరచితమైన "సనాథరామము" అను ప్రబంధము నందలి కథను గొంతవఱకనుసరించు చున్నది. ఆ తత్ప్రబంధము నుండి కొన్ని పద్యములుకూడ సముచితములైన మార్పులతో నిందుద్ధరింపఁబడినవి. నాటకరచనలో నాకుఁ జాల ప్రోత్సాహము నొసంగిన నాచిరమిత్రులును, దేశసేవా నిరతులును నగు "సాధన" పత్రికా సంపాదకులైన శ్రీమాన్ పప్పూరు రామాచార్యులవారికిని, "విశ్వకర్ణాటక" పత్రికా సంపాదకులైన శ్రీమాన్ తిరుమల తాతాచార్య శర్మగారికిని నే నెంతయుఁ గృతజ్ఞుడను.

పను లుండినను దీనికిఁ దొలి పలుకును వ్రాసి యిచ్చి నన్ను గారవించిన రాజమహేంద్రవరము కళాశాలలో నాంగ్లభాషాధ్యాపకులగు బ్రహ్మశ్రీ యమ్. ఏ.

వెంకటేశం పంతులుగారికిఁ గృతజ్ఞతా పూర్వకమైన యనేక వందనము లర్పించు చున్నాను.

| | | |
|---|---|---|
| 12 ఈస్టు రోడ్<br>బసవనగుడి పోస్టు<br>బెంగళూరు. | } | ఇట్లు విన్నవించు,<br>విద్వజ్జన పాదధూళి,<br>హెచ్. నంజుండరావు, |

# FOREWORD.

The Romance of Love has always been an interesting and attractive topic in Literature, whether in the East or in the West. Divine Love, which is perfect and unsullied, becoming imperfect, like all other things in Creation, gives rise to many grades of love, ranging from the instinct of love in the lowest insect as in the highest human being to that highest flow of ecstatic love which associates the human being with God. Even in the display of the instinct of love among the human beings, there are several grades and shades. The love of man for woman is one of such grades of human love.

It is this love that is the mainstay of Dramatic Literature in general. The Dramatic works of Kalidasa, for example, teem with examples of the romance of love. The Dramatic works of Shakespeare are almost all of them based on love. If the romance of love ends in a happy union, the drama becomes a Comedy. Else it becomes a Tragedy. The extreme point of such a tragic end to love is seen in Othello.

While in the West, the romance of love plays a prominent part in literature and life, in India, the romance of love is, to a great extent, regulated by distinct laws. Music and Dance, noble and divine arts, which are the concomitants of love, unfortunately came to be associated in India, until recently, with a section of people whose private lives were of questionable rectitude. A new awakening has now come over the

country and several of the men and the women of that class have revolted against such an association of life with art. The finest example of such a character is seen in the heroine of this play, Sugunavati. She is a good musician, a fine dancer and an educated and cultured woman. Kubera, the God of Wealth, and Manmatha, the God of Beauty and romantic love, try to win the favour of the heroine, and the heroine chooses the God of Beauty and Love, poor as He is, in prefernce to the God of Wealth. It is the love of wealth that makes this class of women associate the divine arts of music and dancing with low life. Sugunavati shuns wealth and weds pure beauty and love.

Apart from this aspect of the paly, which is very interesting and is written in easy and chaste Telugu, without being too classical or too colloquial, the point stressed by the author is the great fact that Culture, which is associated with Beauty and Love, or Sweetness and Light, as Matthew Arnold puts it, is more valuable for the happiness of life than wealth. The ills of modern civilisation have been summarised by the great critic of life and hater of shams, Thomas Carlyle, in two terms, Dilettantism and Mammonism, Idleness and Adharmic quest for wealth. Kubera fails and learns the lesson in the presence of God Bhimalingesvara of that great Kshetra, Draksharam, near Rajahmundry, the great centre of Andhra Culture.

Other lessons are also imparted in the play, which go to show that the contact of Indian Literature with

English Literature, which has brought a Renaissance in our Literature, is attempting to create a new angle of vision in our outlook on life, which we do need very sorely at the present time, when, with the basic Vedic Civilisation of our Motherland, we have to combine harmoniously, the cultural aspects of Western civilisation and literature, so as to evolve a New India in the near future, worthy of playing a noble part in the world civilisation of the future, when the whole world is rapidly undergoing a process of reconstruction on a spiritual basis, after the debacle of the Great War, in Europe, even as a reconstruction of Indian life and culture followed the Great War on the battlefield of Kurukshetra.

The play "Kubera Pathanam" is worth perusal both as a work of art and as an exposition of the true ideals of life. The author has told me that he had Shakespeare's Cymbeline in his mind, when he constructed the plot of this play. Manohara and Sugunavati do remind us forcibly of Posthumus and Imogen. The ideal of life exhibited by Chandravadana, the mother of Sugunavati, does look like that of Cymbeline, regarding the marriage of Imogen. But the structure and the basic idea of the two plots differ, as they necessarily must, because of the fundamental difference in the conditions of social life displayed in Cymbeline and in this play. Imogen belongs to high society, with deep culture, while Sugunavati belongs by birth to a low society, but by reason of her culture, she revolts against the evil custom of prostitution, and follows a high ideal

of life, not ordinarilly associated with her birth and social rank. So the parallel cannot be pressed too far. However, the ideal of married life and of the status of the woman in society set forth in this play is on a par with the ideal set forth in Cymbeline. In these days when our women are showing a keen desire to rise to the height of their true womanhood, the play must indeed afford very interesting reading. Equality and Freedom have been the assets of the Hindu woman from the Vedic Age to the present day, though, owing to wrong notions of life and culture, many Hindu women have unfortunately come to feel that today their status is low and unworthy of their glorious past. And rightly so; the apparent fall in status of the Hindu woman today is not due to the loss of Dharma in the woman, for she is happily still the custodian of our Vedic Dharma, but it is due to the fall in the Dharma of man, in the present age, as the result of the economic, social and political misfortunes to which he has been subjected for several centuries. When our men regain a knowledge of Vedic Dharma and practise it in life, our women ought to regain their glorious status of the past. It will not be then a case of revolt against the tyranny of custom, as in the case of Sugunavati, but a loving return to the ancient path of Dharma, as displayed in the Veda,

**Rajahmundry,**
**10—1—1935.**

**N. K. VENKATESAM PANTULU, M. A., L. T.**
Professor of English.
*Government (Arts) College,*

# పీఠిక.

[విద్యార్థుల కుపకరించునను తలంపుతో నాటక సారస్వతమును గుఱించిన కొన్ని విషయము లిందు గూర్పఁబడినవి.]

కావ్యములు శ్రవ్య కావ్యములనియు దృశ్య కావ్యములనియు నిరు తెఱంగులు. నాటకములు రెండవ వర్గములోఁ జేరినవి. ఒకానొకప్పుడు నాటకములు కూడ శ్రవ్య కావ్యములుగ నుండు నుద్దేశముతో రచియింపఁబడ వచ్చును. అయిన నట్టివి చాల యఱుదు. నాటకములలో రచయితకు నితర కావ్యము లందువలెఁ దన యాత్మీయానుభవముల నంతగాఁ జూపవలను పడదు. చాలమట్టున కతఁడు బాహ్య ప్రపంచమును నటకుల మూలమునఁ బ్రతిబింబింపఁ జేయును. కావ్యములలోనెల్ల సామాన్య జనాదరణీయమైనది నాటకమే యౌటచే నాటకకర్త వారిజీవన వికాసమున కెంతేనిఁ దోడ్పడఁ గలఁడు. అతఁడు నాటకరంగమున వాస్తవిక జీవనమును బ్రతిబింబించుటయేగాక యాదర్శజీవనమును గూడఁ బ్రకటించును. అయిన నీయాదర్శము వాస్తవిక జీవనపు మేర మీఱ కూడదు. అనఁగా స్వాభావికముగ నుండవలయును. ఇట్టి యాదర్శప్రాయములైనను స్వాభావికముగ నుండు సన్నివేశములను నాటకరచయిత కైకొని తన కళాప్రతిభచే సరియైన పాత్రపోషణతోను

ముద్రిత భాషలోను నాటక రూపమున జనుల ముందిడును. అప్పుడవి వారికి యానందదాయకములుగ నుండుటయే గాక నీతి బోధకములుగఁగూడ నుండును. మన సంఘమునందు దేవదాసీల కులమొక కళంక ప్రాయమైన దని తెలిసిన వారందఱును ఒప్పుకొనుచున్నారు. అయిన నిజమరయఁబోయిన చాలమంది తెలిసినవారు సహితము వారాంగనలవృత్తి యుండుట యవసరపుఁ జెడుగులలో నొకటిగాఁ దలంచుట కనుఁగొనుచున్నాము. ఇది కడు శోచనీయము. పడుపువృత్తి మంచిదికాదని బోధించుటకై యీ "కుబేరపతనము" అను నాటకము వ్రాయఁబడినది.

ప్రపంచము నందలి నాగరకతఁ జెందిన వివిధ దేశముల సారస్వతములలో నాటక సారస్వత మతి ముఖ్యాంగముగ నుండెనని తెలియవచ్చుచున్నది. పాశ్చాత్య దేశములలో మొట్టమొదలు నాగరకతఁ జెందిన దేశము గ్రీస్ దేశము. అందు సుమారు 2400 సంవత్సరముల క్రిందట నాటక సారస్వతము చాల వృద్ధి నంది యుండెను. నాటక ప్రదర్శనము గ్రీకుల మతమునకు సంబంధించిన ఒక యాచారముగ నుండెను. అందుచే వారు నాటక ప్రదర్శనముల నతిభక్తితో దేవుని పూజవలె నిర్వహించు చుండిరి. మనలోఁగూడ నాట్య శాస్త్రమును నాట్యవేదమనియు నయ్యది బ్రహ్మ నోటి

నుండి యుత్పన్న మయినదనియు నొక ప్రతీతి గలదు. సంస్కృత భాషలో నత్యుత్తమమైన కావ్య గ్రంథములు నాటకములే. ఇందునకు కాళిదాసు శాకుంతల నాటకము ప్రబల నిదర్శనము. ఆ కాలమున భావముల ముఖ్య కర్తవ్యమైన రసప్రకటనము నాటకముల మూలముననే యగునని తలంచుచుండిరి. ఏమి విచిత్రమో కాని మన యాంధ్రులలో మాత్రము నాటక సారస్వతము ప్రాచీనమైనది కాదని తోచుచున్నది. ఆంధ్ర వాఙ్మయమున నాటక సారస్వతవృద్ధి విషయమైన చరిత్ర నించుక దెలిసి కొందము.

(1) మొట్ట మొదలు, విషయ ప్రధానములైనను నాటక బీజములతోఁ గూడిన పురాణములు వచ్చెను. ఇందు పౌరాణికుఁడు విషయముపై గమనముంచుకొని వాక్చాతుర్యాదులతోను శ్రావ్యమైన కంఠముతోను పురాణము జెప్పును.

(2) ఆవల, సంగీత ప్రధానములైనగొల్లసుద్దులు వీర గీతములు, హరికథలు మున్నగునవి వచ్చెను. వీనిలో విషయమున కెంత ప్రాముఖ్యత యుండునో రస ప్రకటనమునకుఁగూడ నంత ప్రాముఖ్యత యుండును

(3) వీని పిదప, అలంకారాంగ విక్షేప ప్రధానములైన తోలు బొమ్మలాట, భాగవతములు, వీధినాటకములు వచ్చెను. ఇవే మొన్న మొన్నటి వఱకు మన

యాంధ్రులలో నాటకమును జేరc బరగుచుండినవి.

(4) హాస్యరస ప్రధానములైన దృశ్యములలోc బగటివేషగాండ్రు, హాస్యగాండ్రు చూపు ప్రదర్శనములు ముఖ్యమైనవి. వీరు వేయు పఠాను, పంతుల వేషములు శ్లాఘనీయములు.

నాటక సారస్వతమునకుc జాల సంబంధముగల అలంకారాంగ విక్షేప ప్రధానములైన (1) తోలు బొమ్మలాట, (2) భాగవతములు (3) వీధి నాటకములను గుఱించి యించుక ముచ్చటింతము.

## తోలుబొమ్మలాట.

ఇది యన్నిటి కంటెc జాల ప్రాచీనమైనదని తెలియ వచ్చుచున్నది. ఇందు సాధారణముగ బురాణ కథలు ప్రకటింపబడును. ప్రదర్శించువారు — ఒకరో లేక యిద్దరో — తెర వెనుకనుండి తమ హస్తనైపుణ్యముతో బొమ్మల నాడించి, తమ మాటలు పాటలచే వానిని పాత్రములుగ వెలయించెదరు. వీనిలో హాస్య ప్రకటితమగు బొమ్మలుగూడ నుండును.

## భాగవతములు.

పిదప భాగవతములు వచ్చును. ఇవి సాధారణముగ శ్రీకృష్ణుని కథలను బ్రకటించును. శృంగార రస మెక్కువగా నుండును. వీనిలో స్త్రీ పాత్రము

ముఖ్యస్థానము వహించును. పతివ్రతా లక్షణములను
బోధించుచు సత్యభామా మున్నగు స్త్రీల వగలాడి తన
మును ప్రకటించును. పురుష పాత్రము హాస్యరస
భూయిష్ఠమై యుండును. స్త్రీ పాత్రములలో నాట్య
మును, ఆంగికాభినయమును ఎక్కువ. ప్రధాన పాత్ర
ముతో నొకఁడు తోడుగాఁ బాడువాఁ డుండును. పురు
షులే స్త్రీ పాత్రమునుగూడ ధరింతురు. కఱ్ఱసాముల్లు
రంగుల పూతలు ఎక్కువ. దివిటీల దీపముల కాంతు
లతో రేయిపూట నీ దృశ్యములను ప్రకటించు చుండిరి.
వీనిలోఁ జాలమట్టున నొకచే రస ప్రకటన ముండి నం
దున కాఁబోలు ఇవి జన సామాన్యమునకు విసుగు
బుట్టించెను. అందుచే వీధి నాటకములను బహు రస
కలితములైన ప్రదర్శనములు జన సామాన్యమున కాదర
ణీయము లయ్యెను.

## వీధి నాటకములు.

వీధియందు ప్రదర్శింపఁబడు నాటకము లౌటచే
వీని కీనామము వచ్చెను. ఇందొకకథ — చాలమట్టునకు
పురాణకథ — ప్రకటింపఁ బడును. భాగవతము లందు
వలెనే నాట్యముతోను, ఆంగికాభినయముతోను, భుజ
కీర్తులు మున్నగు కఱ్ఱ సాముల్లతోను, మిక్కుటముగ
పూయఁబడిన రంగులతోను గూడిన పాత్రముల మూల
మునఁ బ్రదర్శింపఁబడు చుండెను. పాత్ర ప్రవేశ సమ

యముగ రెండు మూఁడు దివిటీల నొకటిగాఁ జేర్చి బొళ్ళను, పొడిని వానిపైఁ జల్లి ప్రజ్వలత్ కాంతులఁ గలుగఁజేయుచుండిరి. చిత్రములతోఁ గూడిన తెరలుగాని దృశ్యప్రతిసీరముల మార్పులుగాని యేవియును లేక యూరక పాత్రములు వచ్చుచు వెనుకకుఁ బోవుచు నుండును. పురుషులే స్త్రీ పాత్రమునుగూడ ధరింతురు. ఇటీవల పాశ్చాత్య నాగరకత సంపర్కముచేఁ బ్రస్తుతము ప్రదర్శింపబడు నాటకము లాచరణలోనికి వచ్చెను. ఇప్పటికిని పల్లెలందును పట్టణములందును వీధి నాటకములు నప్పుడప్పు డాడుదురు.

పాశ్చాత్య లాక్షణికులు నియమించిన నాటక సూత్రముల నించుక తెలిసి కొందము. రెండువేల సంవత్సరముల క్రిందట గ్రీస్ దేశము చాల నాగరకత స్థితిలో నుండెననియు నాటక సారస్వత మా దేశము నందు చాల వృద్ధి నొంది యుండెననియు చెప్పఁబడెను. ఈ దేశమునం దప్పుడుండిన "అరిస్టాటల్" (Aristotle) అను గొప్ప విమర్శకుఁడు అలంకార శాస్త్రమును (Poetics) వ్రాసి పాశ్చాత్యులలో నెల్ల ప్రథమ లాక్షణిక గ్రంథకర్తయని పేరు వడసెను. ఈతని ప్రకారము విషాదాంత లేక రుద్రనాటకము యొక్క (ఇవే యుత్తమ గ్రంథములని యాతని భావన) ముఖ్య కర్తవ్యము ప్రేక్షకుల మనస్సులో రసముల నుద్రేకింపఁ

జేయుట ; ముఖ్యముగా బశ్చాత్తాపమును భయమును (Pity and Fear) రగులుగొల్పి తన్మూలమున వారిలో నడఁగి యుండిన నారసముల నీవలకు దెచ్చి మనశ్శుద్ధి నొనరించుట. ఇందుకొరకై నాటకమొక గొప్ప వ్యక్తిని గుఱించినదై యుండెను. ఈ వ్యక్తి తన యప్రతిమ సాహస సుగుణములకుఁ దోడుగ నేదో యొక చిన్న లోపముతోఁ గూడి విధికి విరుద్ధముగ బోవుచు, తన సాహసమును, పట్టుదలయును జూపుచుఁ దుదకు విధి చక్రములోఁ దగుల్కొని, చిన్న లోపమునకై చాల క్రూరమైన, అనర్హమైన, శిక్ష ననుభవించును. ఒకో కప్పుడు, దేవుని సహితము కంటకునిగాను అసూయాగ్రస్తునిగాను చిత్రించు మనోవైఖరి ఈ నాటక కర్తలలో గాన నగును. వీరిలోఁ జాల బ్రసిద్ధినందినవారు ఈస్కిలస్ (Aeschylus) సాఫాక్లీస్ (Sophocles) మరియు యురిపిడీస్ (Euripides) అను మహాకవులు. వీరు ప్రతిపాదించిన మతము ప్రస్తుత ముందు పాశ్చాత్య విజ్ఞానమతమైన పౌరుష ప్రకాశవాదము ; దీనినే బుద్ధి పరిశ్రమవాదమనికాని మానవప్రయత్నవాదమనికాని పిలువ వచ్చును. ఇప్పుడు మన భారతీయులలో నీ వివేచన బుద్ధి యత్యావశ్యకము. సుప్రసిద్ధ కర్ణాటక విమర్శకు లొకరు నుడివినట్లు "వెనుకటి కాలపు మన కావ్యములలోనెల్ల జాలవఱకు రాజకుమారుని విరహము

సైన్యముల జయాపజయములు, అచ్చటచ్చట గుడి గోపురముల వర్ణనలు, నడుమ నడుమ ధర్మోపదేశములు ప్రాసంగికముగ నేకాదశి వ్రతకథ, కాశీ మాహాత్మ్యము మున్నగు వానిని నింపుచుండిరి. సామాన్య జన జీవనమునకును వీనికని సెట్టి సంబంధమును నుండదు." కాఁబట్టి యీ గ్రీకు కవుల విమర్శన బుద్ధితో సామాన్య జనోప యుక్తములైన గ్రంథ రచనకుఁ బూనుకొనుట ఆధునిక విద్యాధికుల కర్తవ్యమని వేరుగఁ జెప్ప వలయునా?

పై నుడివిన గ్రీకు కవుల నాటకముల నాధారము జేసికొని అరిస్టాటల్ మహాశయుఁడు కొన్ని నియమముల నేర్పఱచి యున్నాఁడు. వానిలోఁ జాల ముఖ్యమైన వేవనగ నాటకము (1) సంపూర్ణత్వమును (2) సంభవత్వమును గలిగి యుండవలెను. ఇవిగాక నాటకములు (3) కాలమునందును, (4) స్థళమునందును, (5) కథావస్తువులోను, నేకత్వమును లేక ఐక్యమును బాటింపవలయును. వీనిలో సంపూర్ణ సంభవత్వములు నాటకముల కెట్లత్యవశ్యకములో సులభముగ గ్రహింప వచ్చును. సంపూర్ణత్వ మనగా నసందిగ్ధమైన, ప్రారంభము, మధ్య భాగము పర్యవసానమును గలిగియుండ వలయును. వస్తువునకును పాత్రముల నడవడి నడతలకును నెలస్పు సంబంధము గలిగి, నాటక సంభావ్యతకు సాంగత్య

మనుకూలించు నట్లుండవలెను. ఒక విధమున జూచిన నీ సంభావ్యతా తత్వ మన్నికళా వస్తువులకును జెల్లును.

ఇంక కాల స్థానిక, కథావస్తువుల ఏకత్వము విషయమై కొంచెము విచారింపవలసి యున్నది. కాలము సం దేకత్వమనగా (Unity of time) కథ ఒక దినము నందు (One Revolution of the sun) నడచినదిగా నుండవలయును. స్థానపు ఏకత్వమనగా (unity of place) స్థలము మార్పుఁ జెందకుండ నుండ వలయును; అనగా కథయంతయు నొక్క చోటున నడచియుండ వలయును. వస్త్వైక్యమనగా (Unity of action) కథలో సన్నివేశము లన్నియు నొక్క కథకే యనుసంధించి యుండవలయును. రుద్ర నాటకములలో హాస్య సంతోష రసములు రాకూడదు. అట్లే సంతోష సంఘటనతో సంతమొందు నాటకములలో విషాదము జేర్ప కూడదు. గ్రీకు నాటకములలో నెల్లప్పుడును రంగముపై నుండి, ప్రేక్షకుల మనంబులం దుండు భావములను బ్రకటించుచు, కథానాయకునికి సహానుభూతి మాటల నుచ్చరించుచు పాత్రముల ప్రవేశ నిష్క్రమణములను దెలియజేయుచు నుండిన మేళము (Chorus) అను పాత్రము లుండి నందునకై స్థానికైక్య మవసరముగా నుండెను. అయిన నవీన నాటకములలో నీ మేళమను పాత్రములు లుప్తించినవి. అందుచే స్థానికేకత్వ

మనవసరమాయెను. అట్లు, కాలైక్యముకూడ బాటించుట కష్టమగుచు వచ్చెను. ఏలయన, నాటకములోని కథ యంతయు నొక్క దిన మావరింప వలసినచో ముక్కాలు మువ్వీసము కథయే యుండదు. ఒక కథలోని అత్యంతభాగమును మాత్రము గైకొని నాటక రచయిత నాటకరూపమున ప్రతిపాదింపవలసి యుండును; అట్లగుచోఁ గథను స్వేచ్ఛగ పెంచి రక్తి కొలుపునట్లు చేయుటకు, నాటక కర్తల కవకాశముండదని విశదమగుచున్నది. తన్మూలమున, ఆవల వ్రాసిన నాటక కర్తలందఱు కాలస్థాని కైకత్వములను విసర్జించి, విచ్చలవిడిగ గథలను పెంచి, జన సామాన్యమునకు రక్తి కొలుపునట్లు వ్రాసిరి. వస్త్వైక్యమునుగూడ కొంతవఱకు వీరు పాటింపలేదు. శోక సంతోష హాస్యరస సమ్మేళనములను వీరు నాటకములందు జూపిరి. ప్రపంచమునం దప్పుడప్పుడు విషాద సంతోషము లొకటిప్రక్క నొకటి కానవచ్చు చున్నదని వీరివాదము. వీనిలోఁ జాల సత్యమున్నది. క్రీ. శ. పదునారవ శతాబ్దమున షేక్స్పియర్ (Shakespeare)అను గొప్ప ఆంగ్లకవి పైనుడివిన నాటక రచనా నియమము లందలి మార్పులతోఁ దన యమోఘమైన ప్రజ్ఞా ప్రతిభల నుపయోగించి జగత్ప్రసిద్ధములైన కింగ్ లియర్ (King Lear) మెక్ బెత్ (Macbeth) హ్యాంలెట్ (Hamlet) మరియు

ఒథెల్లొ (Othello) మున్నగు నాటకములను వ్రాసెను.

సామాన్యముగ నాటకము లందలి ఇతి వృత్తము పరస్పర విరుద్ధభావముల పోరాటముమీఁద నాధారపడి యుండును. పుణ్య పాపముల పోరాటమే యిందుఁ బ్రాముఖ్యత వహించును. కథా వస్తువు నారు భాగములుగ విభజింప వచ్చును. అవేవన (1) కథ కంకురార్పణము (Introduction or Exposition) (2) కథా బీజము (Initial Incident) (3) కథయొక్క వృద్ధి లేక కథోద్ధరణము (Growing Action) (4) ఔన్నత్యము లేక అత్యుచ్ఛ్రయము (Crisis) (5) పతనము (Falling Action or Resolution) పర్యవసానము లేక ముగింపు (Catastrophe or Conclusion). ఈ "కుబేరపతనము" అను నాటకములో నొకవైపు ధనమును మరొకవైపు రూపమును నిలచి పోరాడును. ధనప్రదర్శన మిందు పాపకార్యమొకటిని సాధించుటకై వినియోగింపఁబడును. రూపము సుగుణయుక్తమై యున్నది. కుబేరుని పంతమే కథాబీజము. ఈకథాబీజము ప్రథమాంక ప్రథమరంగమునందు గాన నగును. అనఁగ కథోద్ధరణము ప్రారంభమై చతుర్థాంక ద్వితీయ రంగమువఱకుఁ బోవును. ఈ భాగమునందు పతనారంభము (విషమస్థితి) గాన నగును. మన్మథుఁడు సుగుణవతియను వేశ్యాకన్య ప్రేమకు బాత్రుఁడై సుఖముగ నుండును. అప్పుడు పంతము ప్రకారము

కుబేరుఁడరుదెంచి తన ధన ప్రదర్శనముచే మన్మథుని
ప్రియసిని జయింప సమకట్టును. అయిన నా సార్థక
నామధేయురాలైన సుగుణవతి కుబేరుని యైశ్వర్యము
వంక విముఖతఁ జూపును. ఇదియే పతనారంభము
(Crisis or Turning Point). ఈ భాగమునుండి కుబే
రుని పతనము నిశ్చయమని ప్రేక్షకులకు గోచరమగును.
ఆవల, కుబేరుని బారినుండి సుగుణవతి తప్పించుకొని
పోయి తన ప్రియుని భీమేశ్వర దేవాలయములోఁ గలిసి
కొనును. అప్పుడు భీమేశ్వరుఁడు వారి నిశ్చలపవిత్ర
ప్రేమనుజూచి ప్రత్యక్షమై వారిని బరిణయమాడి
సుఖముగ వర్ధిల్లుఁడని దీవించి యంతర్ధాన మగును. ఇట్టి
ముగింపులకు పాశ్చాత్యుల ప్రకారము "పై నుండి దిగి
వచ్చిన దేవుని సాహాయ్యముతో ముగిసిన కథ" (God
out of the machine) అని పేరు. మన భారతీయుల
కథలలో నిట్టి ముగింపులే మెండు. ఇందునకు సారంగ
ధర చరిత్ర నిదర్శనము. కీ॥ శే॥ బళ్ళారి కృష్ణమాచార్యులు
సాహసించి విషాద సారంగధర నాటకమును వ్రాసి
మార్గదర్శకులైరి. కథలో శోకరసము ప్రధానమైనను
ముగింపు సంతోష యుక్తముగా నుండవలెనను భావము
జనుల మనస్సులో నిప్పుడంతగా లేదు. స్వాభావికముగ
నెట్టి ముగింపు కథలో నుండవలయునో దానిని వారభిల
షించు చున్నారు.

నాటకములలో సామాన్యముగ రాజుల ప్రేమ, రాజుల యుద్ధములు మున్నగువానిని జిత్రింతురు. దీనికి గారణము రాజందఱి కంటె గొప్పవాడు, ఆదర్శపాత్రయుఁడు అని భావింపఁ బడుటయని తోఁచు చున్నది. నాటకములందలి విషయము గొప్పదై యుండవలయు నని యొప్పుకొనినను రాజులే నాయకులుగా నుండవలసిన యావశ్యకత లేదు. సాధారణుఁడగు గృహస్థుఁడైనను మహాదర్శములు గలవాడైనచోఁ గథా నాయకుఁడుగా నుండవచ్చును. నిజమైన ధైర్య సాహసములు, నీతి పరాయణత్వము మున్నగు సద్గుణములు రాజులందెట్లో సాధారణ వ్యక్తుల యందును నుండవచ్చును. అందుచే సామాన్య గృహస్థులను ముఖ్య పాత్రములుగాఁ జిత్రించినఁ దప్పులేదు. ఆధునిక నాటక కర్తలలోఁ జాల ప్రసిద్ధినంది యుండు ఇబ్సన్ (Ibsen) మహాకవి రచియించిన నాటకములలో నతని సాంఘికనాటకములే యాతని కెక్కువ ప్రాశస్త్యముఁ దెచ్చినవి. వీనిలోనెల్ల సామాన్య గృహస్థులే నాయకులు. ఈ నాటకములలో ఇబ్సన్ కవి సంఘ సంస్కరణమే ముఖ్యోద్దేశముగ నుంచుకొని హృదయ భేదకములైన సన్నివేశముల నద్భుతరీతిని జిత్రించి యున్నాడు. ఛందస్సునకు బదులు గద్యము నుపయోగించి యున్నాడు. కథా సంవిధానమునందును విమర్శన బుద్ధిని బుట్టించుటలోను నితని నాటకము లగ్రి

స్థానము వహించును. ఇట్టి నాటకములు మనలో నప జనిన సత్యమునకు దూరముకాదు.

ఇఁక నాటక ప్రదర్శనమును గుఱించి యొక మాట. ఈ కుబేరపతనమను నాటకము బ్రయోగించుటకు రెండు గంటల కంటె నెక్కువపట్టదని తలంచెద. ప్రస్తుతకాలము నందు దీర్ఘ నాటకముల నవలోకించుటకు ప్రేక్షకులకుఁ దీరిక యుండదనుట అందరికిని తెలిసిన విషయమే. పాశ్చాత్య దేశములలో నిప్పుడు నాటక ప్రదర్శనములు — ముఖ్యముగా సాంఘిక నాటక ప్రదర్శనములు — ఒక గంట లేక యొకటిన్నర గంటకంటె నెక్కువగా దీసికొనరని తెలియవచ్చుచున్నది. 1931 వ సంవత్సరమున జరిగిన ఆంధ్రనాటక కళా పరిషత్సభ యందు, కవిశేఖరులును నటపుంగవులును నగు శ్రీ హరీంద్రనాథచట్టోపాధ్యాయులు నుడివినట్లు సామాన్య జీవులను గుఱించిన బీదలను గుఱించిన సాంఘిక నాటకములను, చిన్నవిగను నడకువగను వ్రాసి యత్యల్ప వ్యయముతోఁ బ్రదర్శింప నమకట్టినగాని నాటకకళ వృద్ధి నొందదు.

---

# పాత్ర సూచి

దేవేంద్రుడు (దిక్పాలకులు, రంభాద్యప్సరసలు మున్నగువారితోఁ గూడిన సభయందు)

| | | |
|---|---|---|
| నారదులు | ... | |
| సుగుణవతి | ... | కథానాయకి |
| చంద్రవదన | ... | సుగుణవతి తల్లి |
| కమల | ... | సుగుణవతి చెలికత్తె |
| మన్మథుఁడు | ... | |
| మనోహరుఁడు | ... | మన్మథుని మారుపేరు |
| కుబేరుఁడు | ... | |
| ధనదత్తుడు | ... | కుబేరుని మారుపేరు |
| సిద్ధుఁడు | ... | కుబేరుని మారువేసము |
| పుష్పగంధి, పద్మావతి | ... | వేశ్యలు |
| శంకరభట్లు | ... | భీమేశ్వరుని అర్చకుఁడు |
| రామయ్య, సోమయ్య | ... | పౌరులు |
| శ్యామాశాస్త్రి, సుబ్బాశాస్త్రి | ... | వైదిక బ్రాహ్మణులు |
| కామయ్య | ... | శ్యామాశాస్త్రి మేనల్లుడు |
| భీమయ్య | ... | కామయ్య సంగడీడు |
| సావిత్రమ్మ | ... | శ్యామాశాస్త్రి భార్య |
| గౌరి, కిట్టా | ... | సావిత్రమ్మ బిడ్డలు |

# కుబేర పతనము

## నాంది.

ఉ. శ్రీ రమణీ మనోహరుఁడు
శీతకటాక్షము లీనువాఁడు బృం
దారక సేవ్యమాన పద
తామరసంబులనొప్పు పూజ్యుఁడుర్
భారత యుద్ధరంగమునఁ
బాపుల వీచమడంచు నట్టి వి
స్ఫార ప్రభావయుక్తులగు
పార్థులఁ బ్రోచెడు శౌరి మ్రొక్కెదన్.

[ప్రవేశము : సూత్రధారుఁడు]

సూత్రధారుఁడు:—(సభ నవలోకించుచు) సకల కళా ప్రవీణులైన నీసభాస్థారుల కానంద దాయక మగు నాటక మొకటి నిందు బ్రదర్శింపఁ దలంచి యున్నాఁడను. అయిన నీ ఘనకార్యమునందు గడ తేరగలనో లేనో యనుసందియము గలుగు చున్నది. నా ప్రియురాలిని బిలిచి యాలోచించెదగాక. నటీ, ప్రేయసీ, ఇటురమ్మా.

[ ప్రవేశము : నటి ]

నటి:—ఆర్యపుత్రా, పిలిచితిరేల ?

సూత్ర:—ఇచ్చటం జేరియుండు సభాసదుల కానంద ప్రదమగు నాటక మొకదానిని బ్రదర్శింప సమకట్టినాడను. ఎట్టి నాటకము మనకు విజయము సేకూర్చ గలదో చెప్పుము.

నటి:—ప్రాణాధికా ! నాటకముల కేమి, ఎన్ని లేవు ? అయిన సంఘదురాచారముల నుద్ఘాటించి నీతిని గఱపు నాటకము లరుదు. అట్టి నాటకములలో నొకదానిని బ్రదర్శించినచో ఈ విద్వజ్జనుల మెప్పొంబడయ వచ్చును.

సూత్ర:—నా మనస్సున కొకటి స్ఫురించుచున్నది. "కుబేరపతనము" అను నాటకరాజము నీ నుడివిన యభిప్రాయమున కెంతయుం దగి యున్నది.

నటి:—దాని నెవ్వరు రచియించిరి ?

సూత్ర:—తే. గీ. శుభ్రపీఠి వంశసుధాబ్ధిసోముం డార్య
జనవిధేయుండు గుణశాలి వినయనిధియు
నరసమాంబకు రామార్యునకుం దనూజు
డైన నంజుండరాయండే దీనికర్త.

నటి:—కాలయాపనము సేయక దానినే ప్రదర్శింతము. నాకర్తవ్యమును గూర్చి సెలవిండు.

సూత్రి:—నాటకారంభమున ఋతువర్ణన మావశ్యకము
గదా. చూడు మీవసంత సమయమున,

చ. తరులు లతాచయంబు ప్రమదంబున
గంజిగురాకుఁ జీరలన్
మరునకు మంగళారతులు మక్కువ
మీఱగ నెత్తుచుండఁగాఁ
బరభృతభృంగ కేకి శుకపంక్తులు రమ్యతఁ
బాడుచుండగా
సరసతయొల్కవీచె సుమసౌరభ శీతల
మందవాయువుల్.

నటి:—మనోరమణా! ఇదె చూడుము,

చ. ఒనరఁగ నబ్జవైరి కరముజ్వల
కాంతులఁ జల్లుచుండగా
మనసిజుఁడంత యేచి కుసుమప్రదరంబు
ల వింటఁజేర్చి యా
వనుల మనంబుపైఁ దనప్రభావము
జూపగ వారు నొచ్చి, హా!
కనికరముంచి మమ్ము ప్రియకాంతలఁ
జేర్పఁగ వేఁడువారొగిన్
పురలక్ష్మికి సమానముగ నుండవలయునని కాఁబోలు
వనలక్ష్మి విరాజిల్లుచున్నది,

సూత్ర:—పురలక్ష్మియా వనలక్ష్మియా నీకు మనో రంజకము ?

నటి:—పురలక్ష్మిమీదనే నా కభిమాన మెక్కువ.

సూత్ర:—నీయభిప్రాయమునందు నే నేకీభవింపను. వన లక్ష్మి దైవనిర్మితము; స్వాభావికము. పుర లక్ష్మియన్ననో మనుష్యనిర్మితము; కృత్రిమము. పురలక్ష్మి సౌందర్యమంతయు ధనప్రయసిద్ధము. ధనముండిన మాత్రమున నైసర్గిక సౌందర్యముఁ గొని తెచ్చునా ? వట్టి తళుకుబెళుకులె గాక !

నటి:—మీ మాటలయందలి యంతరార్థము నాకుఁ దెలిసినది. నేను చీరలు సొమ్ములు నడుగుదునని కాఁబోలు సహజ సౌందర్యమును మీరింతగఁ గొనియాడుచున్నారు.

సూత్ర:—ప్రియా ! నీ కెప్పుడును అలంకారముల చింతయే. స్త్రీలకందఱకు రతీదేవులుగా నుండ వలెనను కోరికయే.

నటి:—మీకు మాత్రము మన్మథునివలె నుండు కోరిక లేదా ?

సూత్ర:—జ్ఞప్తికిఁ దెచ్చితివి. ఇంక మనమిందు తడయ రాదు. మన్మథుఁ డీవంకకే వచ్చుచున్నాఁడు.

నటి:- అతని సన్నాహము ( గాంచిన దివిజవల్లభుని సభకుఁ బోవుచున్నట్లున్నది.

సూత్రి:-మన మిచ్చటనే యున్నచో నాతని పుష్ప బాణములకు గురియగుదుము. వెళ్ళుదము రమ్మా.

నటి:-చిత్తము. మీయాజ్ఞానువర్తి నయ్యెదను.

(ఇరువురు నిష్క్రమింతురు.)

(ఇది ప్రస్తావన.)

# కుబేర పతనము

ప్రథమాంకము :          ప్రథమ రంగము.

[ సభా స్థానమునందు దేవేంద్రుఁడు సింహాసనాసీనుఁడై యుండ, దిక్పాలకులు నారదులు మున్నగువారు యథోచితాసనంబుల గూర్చుండి యుందురు. ఊర్వశీ రంభాద్యప్సర స్త్రీలోక పరిక్ర నాట్యముసేయు చుందురు. మన్మథుఁ డప్పుడు ప్రవేశించి యుచితాసనంబున గూరుచుండును. రంభాద్యప్సరస లాతని రూపరేఖాదులను జూచి వెరగంది, నాట్యమొకింత చాలించి, యతనినే తేరిపాఱఁ జూచుచుండి, మరల నాట్యముసేయు చుందురు. వారి చూపు లతనిపైననే యుండును ]

దేవేంద్రుఁడు:–( అప్సరాంగనల వంకఁ దిరిగి ) ఏమి? మన్మథుని రూపముఁ జూచి మీరు దిగ్భ్రమ చెంది నట్లున్నది!

రంభ:—దేవేంద్రా, అతనుఁడు నేడు సతనుఁడై గోచరించుట మాకు వింతఁ గొల్పినది.

దేవేంద్రుఁడు:—అతని రూప విభ్రమములఁ జూచి ముగ్ధలై తిరని తలంచితిని.

నారదుఁడు:—దేవేంద్రా! వేశ్యల కేటి రూప విభ్రమములు?

మన్మథుఁడు:-( నారదునిఁ గోపముతోఁ జూచుచు ) ఏమంటిరి ?

నార:-వారికి కావలసినది ధనము.

కుబేరుఁడు:-(మీసలు తీడుచు) అవును, అవును.

దేవేంద్రుఁడు:-అదేమి, నారదా ? రంభ నలకూబరుని వలచి యుండలేదా ? అతని రూపమునకు భ్రమసి గదా వలచినది.

రంభ:-(లజ్జ నభినయించును.)

నార:-పిచ్చి ! సురపతీ, చక్కని వారెందఱు లేరు ? ధనపతి కొమారుఁడని నలకూబరుని రంభ వలచిన దంతయే.

రంభ:-(చుఱుకు జూపులఁ జూచును.)

దేవేంద్రుఁడు:-అట్లయినచో ధనపతియగు కుబేరునే యేలవరించలేదు ?

నార:-ధనపతుల కొమారుల కున్నయౌదార్యము వారి తండ్రులకుండదు. అందునను, కుబేరుఁడు...

కుబే:--(కళవళపడును).

దేవేం:-ఉండనీ, కాని, దేవమునీ, ఈసమస్య తేలుట యెట్లు ?

నార:-సురపతీ, మన్మథకుబేరులే ఒక వేశ్యనుగోరనీ. ఆమె యెవ్వరిని వరించునో చూతము.

దేవేం:—నీయాలోచన చక్కఁగా నున్నది. అయిన నీ పరీక్ష భూలోకమునన్నైన బాగుగ నుండును.

రంభ:—(మరొక్కతెకు కనుసన్న జేసి యూరకుండును).

ఊర్వశి:—(మాటాడక మీఁదు జూచుచుండును).

మంజుఘోష:—(చీరచెరఁగును బులుకు చుండును)

చిత్రరేఖ:—(కాలివేళ్ళతో నేలవ్రాయుచుండును)

మేనక:—(కేవఁగి తేకుఁసు చీల్చుచు తల వాంచియుండును)

మన్మ:—(లేచి) క. అమరేంద్ర! వినుము సెప్పెద
సమముగ పడఁతులకు రూపసంపద వలయుఁ
క్రమముగ ధనదానముచే
భ్రమనొందరు నిక్కమెఱుఁగు
భామిను లెందుఁ.

దేవేం:—అవును. మన్మథా, నీమాటలకు ఈ రంభాద్యప్సరసల చర్యయే తార్కాణముగనున్నది.

కుబే:—(కోపముతో లేచి) సురనాథా! మన్మథుఁడు రూపమున మిన్నయగుఁగాక. అయిన నాతని యభిప్రాయ మొక సిద్ధాంతమగునా? అతని మాటలే నిజమని నమ్మితివా? భామినులకుఁ బ్రేమాశ్రయమైనది ధనముకాని రూపముకాదు; గుణమంతకును కాదు. ధనముండిన చక్కఁ

ధనము తనకుఁదానే పారి గంతులు వేసికొని వచ్చును. విశుద్ధగుణరూప సంపద తనుప్రభల తోను, సకలకళాప్రావీణ్యముతోను నుండు వాఁడు దరిద్రుఁడయ్యేనేని యాతని నెవ్వరును జేరనియ్యరు. ధనహీనుఁడును శవమును నొక్కటే యనిన తప్పుకాదు. కాఁబట్టి

చ. అనిమిష సార్వభౌమ!
కుసుమాస్త్రుని మాటలు నిక్కమౌనె? మా
నినులకు భూషణాదులను
**నిండు**గ నిచ్చిన నన్య మెద్దియుఁ
మనమునఁ గోరువారలె?
ధనంబునకే కొనగోలు విల్వ హె
చ్చని బుధకోటిసెప్ప వినవా?
యనుమాన మదేల వాసవా?

కనకాంబరములొసంగిన, నంగనల కంటికెట్టి వాఁడైనను సుందరమూర్తిగ నగపడును. సరసత లేనివాఁడు, జడుఁడు, కురూపి, రోగి, వీఁడు వాఁ డననేల? ఎట్టివాఁడైనను డబ్బు గలవాఁడైనచో నంగనలకుఁ బ్రియతముఁడై వారిచే వింత వింతలుగ వర్ణింపఁబడి సేవింపఁబడు చుండును. ఇంతేల? రూపమునందును విద్యలయందును మిన్నయయిన వారెందఱు ధనికుల నాశ్రయించి

జీవించుచుండలేదు ! "ధనమూల మిదం? జగత్"
అను లోకోక్తిని వినవే ?

మన్మ:—(రోషారుణిత నేత్రుఁడై) సురేంద్రా! కుబేరుని మాటలించుకయు విశ్వాస నీయములుకావు. రూపమును ధనమియ్య గలదా? వట్టి కల్ల. రూప మొక్కటియుండిన లోకమే వశ్యమగును. జలజముఖులకు రూపరి దొరకిన ధనమును గలలోనైనఁ దలంప నొల్లరు. రూపరితోఁ బాటు సత్పురుషుఁడు కూడ నయ్యేనేని వానిని వదలి ధనవంతుని తమయెత్తు రూకలు బోసినను భామినులొల్లరు. కుబేరు నంతటి వానిని సహితము వారు రోయుదురు. ఇది ముమ్మాటికిని నిజము.

కుబే:—(కోపోద్దీపితుఁడై) మదనా ! ఏ మంటివి? భామినులు నన్నుఁగూడ రోయుదు రంటివా ? అందునకేనా ధనికుని కవీశ్వరులు కర్ణుఁడని పొగడుట ? మానినులు మన్మథుఁడని ప్రస్తుతించుట ? చుట్టములు కానివారుగూడఁ జుట్టాలమని చెప్పుకొని గట్టిగఁ జుట్టుకొనుట ? నీ వాక్చాతుర్యమేమన వచ్చును. "కోటి విద్యలు కూటి కొఱకే". వేద పురాణాదులు, భాష్య వేదాంత పద్ధతులు, కావ్యనాట కాలంకారాది

శాస్త్రములు, కవిత్వగాన నాట్యాదులు, ఇంద్ర
జాల మహేంద్రజాలములు, ఇవియవి యననేల?
సకలకళలు విత్తంబుకొఱ కేకదా యభ్యసించునది.

మన్మ:—కుబేరా! నీవాడు మాటలన్నియు నాకుఁ
గ్రొత్త సంగతులుగఁ గన్పట్టుచున్నవి. ధన
మంతటి నీచవస్తు విలయం దెద్దియును లేదు.
పరోపకారబుద్ధిని ద్రొలఁగించి లోభగుణమును
బుట్టించును. ప్రాణమిత్రుని, తోడఁబుట్టిన
వారిని, తల్లిదండ్రులను సహితము పగవారిగఁ
జేయును. సత్యా సత్యములను దారుమారు
గావించును. కాబట్టి, సర్వపాపములకును ధనమే
మూలము. ఇంతియకాక ధనము నీటిపై నుండు
బుద్బుదమువలె క్షణికము. అందునకే కదా
ప్రాజ్ఞులెవ్వరును దానినాశింపరు. ఇట్టి ధనము
కొఱకు నీవెంత విఱ్ఱవీగు చున్నావు?

కుబే:—ఓరీ, అనంగా! చక్కని వారిలో మిగుల
చక్కని వాఁడవని నీ వుబ్బిపోవు చున్నట్లున్నది?
నీరూపము మాత్రము శాశ్వతమని యెంచితివా?
అదియు క్షణభంగురమే! ధనమైనను దాచి
యుంచవచ్చును. రూప మదియంతకదియే మాసి
పోవును. ఈవాదాడంబర మెందుకు? ఇంతకు
ముందు నారదుఁడు సెలవిచ్చినట్లు దక్షవాటి

పురంబున వేశ్యవాటిక కిఁ బరుగున బోయి మన పరిభావంబులను బ్రకటింతము. ఓడిపోయినవారు దేవలోకచ్యుతికిఁ బాల్పడవలయును. (ఇంద్రుని వంకఁ జూచుచు) దివిజనాథా ! ఇది నీకొప్పిదమా ?

**దేవేం:**— మీ పంతము చాల బాగున్నది. నే నొప్పితి. నేటికి సభ చాలింతము.

(అని లేచి వెడలి పోవును. తక్కిన వారందఱతనిని వెంబడింతురు. మదన కుబేరులు క్రోధావేశచిత్తులై యొకరి నొకరు జూచుచు నిష్క్రమింతురు.)

**రంభ:**—(పోవుచు) ఊర్వశీ ! దక్షవాటిక వేశ్యలు ధనదుని లంచములకు మోసపోయినచో మనకుఁ గూడ అపకీర్తి తప్పదు. ఇది యెట్లు తేలునో చూతము.

(అనుచు రంభాద్యప్సరసలు నిష్క్రమింతురు.)

(యవనిక జారును.)

## ప్రథమాంకము : ద్వితీయరంగము.

(ద్రాక్షారామమునందు భీమేశ్వరుని దేవాలయములో వారాంగనలనాట్యము జరుగుచుండును. జనులు వచ్చుచుఁ బోవుచు నుందురు. దేవాలయమున కీవలి భాగమున నిద్దరు వ్యక్తులు, రామయ్య సోమయ్య, అనువారు కూర్చుండి యిట్లు సంభాషింతురు)

రామయ్య:—సోమయ్యా, చూచితివా, లోపల దేవకన్యల నాట్యాలు ?

సోమయ్య:—ఏమి చూచేది లేవయ్యా. జనులు క్రిక్కిరిసి యుండుటఁ గాంచిన నేల యీనినదో యన్నట్లున్నది! నాకూపిరి యాడక ఈవలికి వచ్చివేసితిని.

రామ:—వారాంగన లుండుచోట బెల్లమునకు చీమలు చేరునట్లు పురుషులందఱును జేరుదురు. కొందఱు నోరు తెఱచుకొని మైమఱచి చూచుచున్నారు. వారినోట మక్షికములు దూరినను సరకుగొనరు.

సోమ:—పోనీ లేవయ్యా, మనమిందలి పరిశుద్ధవాయువును బీల్చుచు నిందేయుందము. (ఈ సమయమున మన్మథుఁడు దేవాలయమును సమీపించును.)

రామయ్యా, అదిగో, చూడుము. ఎవ్వఁడో గొప్పవ్యక్తి యొకం డీదిక్కున గానము వినుటకై వచ్చుచున్నాఁడు. అతఁడెంత చక్కని వాఁడు! నిజముగ నొప్పులకుప్పయే!

రామ:—ఔను, సోమయ్యా. ఇతఁ డపూర్వ తేజోవంతుఁడు!

సోమ:—జీవకోటిలో నతిసుందరాకారము గలది మానవాకారమనిన, నతిశయోక్తి కానేరదు. దానికిఁ దోడుగ సహజసౌందర్యముకూడ నుండెనేని ఇఁక వేరుగ జెప్పవలయునా! భూషణాదు లెందుకు!! ఓహో! తెలిసెను. ఇతఁడు మనుష్య మాత్రుఁడుకాఁడు. మన్మథుఁడే మానవాకారముతో భూలోకమున కేతెంచి యుండ నోపు!!!

(మన్మథుఁడు లోపలికిఁబోయి నాట్యమును జూచుచు గూరుచుండును. రామయ్య సోమయ్యను వెంబడించి సమీపమున గూర్చుందురు.)

రామ:—సోమయ్యా, అతని సహజసౌందర్యము ముందఱ ఈ వారాంగనల కృత్రిమ సౌందర్యము దివిటీల ముందఱ దీపము వెలిగించిన లాగున్నది.

సోమ:—అయిన నిందఱు వారాంగనలలో నొక్కతె మాత్రము రతివలెనే స్వీయ సౌందర్యముతోఁ బ్రకాశించు చున్నది. అది యెవ్వరంటివా!

చంద్రివదన కూతురగు సుగుణవతి. ఆ యువిద సుశిక్షిత. రూపమునం దెట్లో గానసాట్యాది కళల యందును అద్వితీయగ నున్నది. అది యెట్లీ యపరమన్మథుని సౌందర్యామృతమును దన కన్నుఁజేరల జుఱ్ఱుచున్నదో చూడుము.

రామ:—ఒక్క సుగుణవతియే గాదు. సభా సభ్యులంద అను ఇట్లే చేయుచున్నారు.

(ఇట్లు కొంతసేపయిన పిదప నాట్యము చాలింతురు. సుగుణవతి విశ్రమించుకొను చుండును. కమలయును నామె చెలి కత్తె ప్రక్కఁ గూర్చుండి యుండును. అప్పుడు సుగుణవతి కమల నుద్దేశించి)

సుగు:—కమలా! అదిగో! చూడవే; అచ్చటగూర్చుండు వాఁడెంతచక్కనివాఁడు! ఆముఖ వికాసము, ఆరాజసము, ఆయంగ సౌష్ఠవము, నే నెందును గాంచి యుండలేదు. మనము గ్రంథములందు జదివియుండు నిషధవిభుని మాడ్కని, అర్జునుని చందంబునను, మన్మథుని పోలికను ఉన్నాఁడ నిన తప్పుకాదు. అతఁడు నాకంటఁబడిన దాదిగా నామనస్సు పరిపరి విధములఁ బోవుచున్నది.

కమల:—ఔనమ్మా; ఇట్టి లావణ్య మూర్తిని నేనెందును జూచి యుండలేదు.

(లోపల ధ్వని)

సుగుణవతీ! సుగుణవతీ! ఏల యింకను రాకయున్నావు. ప్రొద్దుచాల అయినది. వేగిర రమ్మా.

(కమల సుగుణవతులు పైకిలేచి వెడలుటకు సిద్ధమౌదురు)

సుగు:—కమలా! బిర బిర రావే, పోవుదము. చాల ప్రొద్దైనది. అమ్మ రమ్మని తొందరఁ బెట్టు చున్నది.

(అనుచు వారిద్దరు వడిగ వెడలి పోవుదురు.)

(యవనిక జారును.)

---

ప్రథమాంకము : తృతీయరంగము

(చంద్రవదన సౌధము. అందంతఃపురమునందొక మంచము పై సుగుణవతి పరుండి యుండును.)

(ప్రవేశము : కమల)

కమల:—ఏమక్కా, సుగుణవతీ, ఇట్లే యేకాంతమం దున్నావు? నీ మనసును కలంచిన దేది చెప్పుము. నిన్నటి నుండియు నీవు బొత్తిగ మారిపోయినావు. నీకేదియుఁ గానఁబట్టదు. లెమ్మా

గీ. “నీ వివేకమహిమ నీరాజసంబును
ఎందుఁబోయె నిప్పు డిందు వదన

చేరి మాకు బుద్ధి సెప్పితి విన్నాళ్ళు
నీకుఁ దెలుప వశమె నీరజాక్షి."

సుగు:—నాకేమో సంకట మగుచున్నది.

కమ:—అక్కా, చింతింపకుము. నీకు కావలసినది నేను తెచ్చి యిచ్చెదను.

(అని కస్తూరు తుడిచి కురులు దిద్ది యూరడించును.)

సుగు:—(లేచి కూర్చుండి హారములను సవరించుచు) నిజముగా నాకోరిక దీర్పఁగలవా?

కమల:—నీ కనుమాన మెందుకు? నీ కోసము పులినోట నాతలఁ బెట్టవలసి వచ్చినను, కాల సర్పమునోట కేలుంచమన్నను వెనుదీయను. ఊరక మాట లాడి ప్రయోజనము లేదు. కార్యము నందు నన్ను బరీక్షించి చూడుము. నన్నందఱివలె భావింపవలదు.

సుగు:—కమలా! నీవు నెఱజాణవు. చెప్పెద వినుము. నాడు భీమేశ్వర దేవళమునం దతనిఁ జూచిన దాదిగా – ఎతని ననుకొంటివి?—అతనుని—

కమల:—(అంతలో)"అతనుఁడు" అనఁగా "మన్మథుఁడు". అయిన మన్మథుని దోడ్కొని రమ్మనుచున్నావా యేమి?

సుగు:—అదికాదు, కమలా, నీవ్వూరక హాస్యముచేయ కుము. అతనిని జూచిన దాదిగా నే నతనునికిఁ జిక్కితిని. నీవు పోయి యా సుందరాకారుని దోడ్కొనివచ్చిన నీ యుపకారమును నేను నా యావజ్జీవమును మరువను. నీవునాహితైషిణి వేని ఇప్పుడే యతనిఁ దోడ్కొనిరమ్మా.

కమల:—నీ యభీష్టసిద్ధికిఁ బాటుపడుటకు నేను వెను దీయను. కాని, ఒకమాట చెప్పెద వినుము. నీవన్ననో, ఈ యూరనుండు సానులకెల్లఁ బెద్ద. సౌందర్యమున రతీదేవికి సమానురాలవు. ఐశ్వ ర్యమునందు కుబేరునిగూడ నిరసింపఁగల దానవు. ఇట్లుండియు, పేరు, కులము, శీలము, అంతస్థు, ఏదియును దెలియని యెక్కడివానినో యొకనిని మోహించి యిందుంచుకొనిన మన యమ్మ యూరకుండునా? లోకులు నవ్వరా?

సుగు:—సామాన్యముగ సౌందర్యము, సత్కులమును సచ్ఛీలము ననుసరించియే యుండును. కావున నతఁడు కులశీలములుగల మహానుభావుఁడై యుం డునని యేనెంచెదను.

కమల:—అక్కా, నీవు చింతింపకుము. నేనిదె మించు వలె పోయి యెందుండినను నతనిని దోడ్కొని వచ్చెద (నిష్క్రమించును)

సుగు:—(స్వగతము)

చ. "వచ్చునో రాడో యిచ్చటికి
వచ్చి ముదంబున నన్నుఁజూచి లో
మెచ్చునో మెచ్చఁడో యతఁడు
మెచ్చిన రమ్మని చేరదీయునో, "
యిచ్చఁదలంచి నాదయిన
యీప్సితసిద్ధికిఁ దాఁ గడంగునో
పెచ్చుగ నా మనంబిపుడు
భీతిఁ గలంగెడు నక్కటక్కటా !

లేదు, లేదు. భీతికిఁ జోటులేదు. అతఁడుగూడ నాపై ప్రేమపూరితములగు వీక్షణములను బ్రస రించినట్లు నాకు జ్ఞాపకమున్నది. అయిన నన్నేల నిరాకరించును. పాలముంచినను నీళ్ళముంచినను నీవే యని శ్రీ భీమేశ్వరునిపై భారమువైచి యుండెదగాక.

(యవనిక జారును.)

---

ప్రథమాంకము : చతుర్థరంగము.

[ భీమేశ్వర దేవాలయమునం దొకభాగమున మన్మథుఁడు దైవధ్యానము సేయుచు కూరుచుండి యుండును. ]

(ప్రవేశము : కమల)

కమల:—(మన్మథుని దూరమునుండి గుర్తించి) ఆహా! ఎంత చక్కనివాఁ డితఁడు! ఏ స్త్రీ యీతని వరింపకుండఁ గలదు! నేనుకూడ స్త్రీయే కదా. ఈతని జూచిన అబలలెట్లు నిశ్చల మనస్కలై యుండనోపుదురు! సరి, బాగున్నది. నా మన స్సీతని నంటవిడిచిన నా ప్రియురాలి కార్య మెట్లు కొనసాఁగఁగలదు? కాన నేనిపుడు వివేకము దెచ్చుకొని మెలంగవలయును.

(అనుచు ముందునకరిగి మన్మథుని యెదుట నిలిచి నమస్కరించి ధైర్యముతో నిట్లనును.)

మీరు యాత్రికులవలెఁ గన్పట్టు చున్నారు. ఎందుండి వచ్చితిరి? భీమేశ్వరుని దర్శనార్థమై యిం దేతెంచియున్నారు కాఁబోలు.

మన్మ:- అవును ; నేను ఉదయపురమునుండి వచ్చితిని.

కమల:—తమ వంశనామధేయముల నడుగవచ్చునా?

మన్మ:—నేను రాజపుత్ర వంశీయుఁడను.

కమల:— ఇఁక మీనామధేయముగూడ జెప్పి నాచెవులు పవిత్రము గావింపుఁడు.

మన్మ:—నన్ను మనోహరుఁ డందురు.

కమల:—(తనలో) పేరునకుఁదగినట్టు యున్నావు పో! (ప్రకాశముగ) మీరు మహనీయులవలెఁ గన్పట్టు చున్నారు. మా యింటికి విచ్చేసి మమ్ము కృతార్థులఁజేయ వేడుచున్నాను.

మనోహరుఁడు:—మంచిది, నీవెవరవు? నీ పేరేమి?

కమల:—(చిరునగు మోముతో సిగ్గు నభినయించుచు) నన్ను "కమల" అందురు. నే నీయూర నుండు సానులకెల్లఁ బెద్దయగు సుగుణవతి యను వేశ్యామణి యనుంగు చెలికత్తెను. సుగుణవతి సౌందర్య మింతింత యని చెప్ప నలవికాదు. సుగుణములకుఁ బుట్టి నిల్లు. సూక్ష్మముగ వర్ణించెద, వినుఁడు.

సీ. కాతరుల్ తనదగు కనుల కడ్డంబైన
    ననురాగ రసము మోమునను జిందు
తనమూర్తి ధూర్తులు కనుగవం దార్చుచో
    ననుసిగ్గు ముసుఁగును బొనరవైచు
తత్త్వార్థములను బోధనసేయఁ గడఁగుచో
    వీనుఁజేరల నెంతొ యానుచుండు

మందులు మాయలు మంత్రతంత్రములు నాఁ
  బ్రధ్వంసమగు తన రక్ష వెట్టు
సజ్జనార్తిని నింతేని సైపలేక
తనదు సాహాయ్య సంపద నొసరఁజేయు ;
ఇంక నద్దేహ సౌష్ఠవంబెన్నఁ దరమె
నామె మది వోలె నద్దియు నమరియుండు.

మా సుగుణవతి సంగీత సాహిత్య విద్యాధురీణ. ఇదియునుంగాక అది యింకను నవయౌవ నారంభ దశ యందున్నది. దాని మేని కోమలమైన వింత మెఱుంగు కన్నుల మిరమిట్లు గొల్పుననిన నతిశ యోక్తి కానేరదు. కాన మీరు కరుణతో మా యింటికి పూలు గంధము విడెము గైకొన రావలయును.

మనో:—చాల ముదమందితిని. నేను మీ యింటికి వచ్చుట కేయభ్యంతరమును లేదు కాని, (అను మానించుచు) కారణము చెప్పుటకు నాకించుక సిగ్గగు చున్నది.

కమల:—సిగ్గేల ? నాతోఁ జెప్పనగును.

మనో:—నాయొద్ద ఒక చిన్న కాసైనను లేదు. అందుచే మీ సుగుణవతి యొద్దకు నన్ను గొని పోయిన లాభమేమి ?

కమల:—సుగుణావతి మీనుండి లేశమైనను ప్రీవ్య మాశింపదు.

మనో:—అది కల్ల. వారాంగనలు ధనములేనిదే వరింతురా? ఒకవేళ ఇప్పుడు మాత్రము నన్నుఁజేరదీసినను నావల శ్రీమంతుఁడెవఁడైన వచ్చిన వానిని మోహించి నిర్ధనుఁడనగు నన్ను వెడలఁగొట్టును.

కమల:—మనసులు కలియుచోట ధనము ప్రాముఖ్యము వహించునా?

మనో:—చెయిఁ జూపి యుపలక్షణ మనిపించుకొనుటకు నాకిష్టము లేదు. కాన సుగుణావతియొద్ద కరిగి నా యుదంతంబంతయు దానితోఁ జెప్పుము. అప్పటికిని నన్నది రమ్మనిన నేను వచ్చెదను.

కమల:—అట్లే కానిండు. పోయివచ్చెద.

(నమస్కరించి నిష్క్రమించును.)

మనో:—(స్వగతము) భీమేశ్వర వరప్రసాదముచే నా పని యర్ధ మయినది. సుగుణావతి పేరునకుఁ దగినట్లు సుగుణవతియే యైనచో నాకార్యసిద్ధి యగుటలో సందియములేదు. కుబేరునికిఁ దప్పక పరాభవము సంభవించును. అంత్యఫల మెట్లుండునో చూచెదగాక. (యవనిక జారును.)

ప్రథమాంకము :        పంచమరంగము

[చంద్రవదన సౌధము. అంతఃపురమునందు మంచముపై సుగుణవతి పరుండి యుండును.]

సుగుణవతి:—(తనలో) అదిగో! కాలి చప్పుడు వినవచ్చు చున్నది. కమలయే కాఁబోలు.

(కమల ప్రవేశించును)

కమలా! పోయిన పని యేమాయె? కాయో, పండో?

కమల:—అక్కా! ఏమి యాతని సౌందర్యము! అంత లేనిదే నీవతనిని వరించితివా? ఆతని మనోహర మూర్తి నామేనుఁ బులకరింపఁ జేసెను. నిష్క-ళంక సంపూర్ణ చంద్రబింబమును బోలు నగు నెమ్మొగము, ఆకర్ణాంతములైన నేత్రములు, సుధాకర కళలం ద్రవించు శశికాంతము బోలిన చెక్కుటద్దములు, ఆజానుబాహువులు, విశాల లలాట వక్షస్థలములు, తళుకొత్తు ఠీవి, తేనె లొలుకు మాటలు —

సుగుణ:—చాలు, చాలు, నీవర్ణన లట్లుండనీ; పోయిన పని యేమాయెనో చెప్పక కాలయాపనము సేయు చున్నావు. ఏమనె నతఁడు? వచ్చెద ననెనా?

కమల:—నేనాతని పేరు, యూరు, కులము నంతయు నడిగితిని. అందునకతఁడు తన పేరు మనోహరుఁడనియు, ఊరు ఉదయపురమనియు, కులము క్షత్రియకులమనియు చెప్పి, నా పేరు, ఉదంతం బంతయు నడుగ, నేను నాఁపేరుఁజెప్పి, నీచెలికత్తె నని వ్రాక్రుచ్చి, నీరూపలావణ్యములను, యౌవన సంపత్తిని, ప్రజ్ఞాప్రతిభలను, సంగీతసాహిత్య విద్యాకౌశలమును, సుగుణములును, వేయినోళ్ళ వర్ణించి, సగౌరవముగ నింటికి రండని యాహ్వానించితిని. ధనములేని కారణముచే నతఁడు రానన్నెను.

సుగు:—(నిట్టూర్పుతో) నీవు జాణవని నమ్మియుంటిని. అతనిఁ దోడ్కొని రావైతివి. "సకల పదార్థంబులు మాయింటఁ గలవు; మీరేమియు నీయవలదు." అని నేఁ జెప్పినట్లుచెప్పి శీఘ్రముగఁ దోడ్కొని రమ్ము. (కమల వెడలఁ బోవును అంతలో) ఇదో! మరచితిని, కుబేరు నంతటి ధనవంతునైనను నిరాకరించి మిమ్మునే నమ్మియుండెదను. అని నామాటగ నుడువుము.

కమల:—కాని నీవేమియు చింత సేయవలదు. అతనిని బిలుచుకొనివచ్చు భారము నాపై నుండనీ.

(అని నిష్క్రమించును. సుగుణవతి మంచముపై ముసుఁగుఁ బెట్టుకొని పరుండును.)

[ ప్రవేశము : చంద్రవదన ]

చంద్రవదన:—ఏల, సుగుణా! నీవెప్పటి యట్లు చురు
కుగా లేవు? నీకు జబ్బేమైనఁ జేసినదా?

(అనుచుఁ బరుండి యుండు సుగుణవతిమీఁదఁ దనచేయి పెట్టును.]

సుగు:—(లేచి కూరుచుండి) ఏమియు లేదు. కొంచెము
తలనొప్పిగా నున్నది, అంతే.

చంద్ర:—దృష్టి దోషముచే నట్లయినది. ఎఱ్ఱనీళ్ళు
దిగదీసి వేసెద. అంతయు సరిపోవును.

[అని లోనికరిగి ఎఱ్ఱనీళ్ళు తట్టలోఁదెచ్చి దిగఁదీసి లోనికిఁ
గొంపోవును.]

సుగు:—(తనలో) మాయమ్మ కిది యొకపిచ్చి. ఈయెఱ్ఱ
నీటితో నాకువచ్చియుండు రుగ్మత గుణమగునా?
కమల యేలొకో యింకను రాలేదు. పోయి
ఒక గంటకుపైన అయినది. (అనుచు నాలోచ
నతో మరల బరుండును.)

[ ప్రవేశము: చంద్రవదన ]

చంద్ర:—సుగుణా! తలనొప్పియంతయు వాసియగును.
కొంచెము పాలుకాఁచి యిచ్చెదను. త్రాగుదువు
గాక, రమ్మా.

(అనిలేచి నిష్క్రమించును.) (సుగుణవతి లేచి వెంబడించును.)

[భీమేశ్వర దేవాలయమునందు మనోహరుఁడొక ప్రక్క కూరుచుండి యుండును.]

(ప్రవేశము : కమల)

కమల:- (మనోహరుని యెదుట నిలిచి, నమస్కరించి, వినయముతో) మనోహరవర్యా! మీరు చెప్పిన మాటలు సుగుణవతికిఁ జెప్పితిని. "సర్వ సంపదయు మాయింటఁగలదు. మీరేమియు నీయవలదు, ఎంతటి ధనవంతుఁడైనను నిరాకరించి మిమ్మునే నమ్మి మీయర్ధాంగివలె నుండెద" అని చెప్పుమని సుగుణవతి చెప్పి పంచినది. దయయుంచి యిప్పుడే రండు.

మనో:—వచ్చెద. వారాంగనలు తొలుదొల్త తమ వాక్చాతుర్యమును జూపి పురుషులు తమకు వశ్యులైన పిదప వారినుండి డబ్బును సంగ్రహింతురు. అయిన నీవు సుగుణవతి నెంతో శ్లాఘించుచున్నావు కాన, నేను దానినింక పరీక్షించెద గాక.

**కమల:—సంతోషము. ఆలస్యము చేయకుడు. మీకే యం**

తయుఁ దెల్లమగును. ముంజేతి కంకణమున కద్దమేల ?

మనో:—పోదము పద.

(ఇరువురు నిష్క్రమింతురు)

(యవనిక జారును)

---

# కుబేర పతనము

## ద్వితీయాంకము : ప్రథమ రంగము.

[చంద్రవదన సౌధము. మధ్యాంగణము నందొక రత్నపీఠిక యుండును.]

(ప్రవేశము : కమలా మనోహరులు)

కమల:—(మనోహరు నుద్దేశించి) ఆర్యా! ఈ రత్నపీఠిక మీఁదఁ గూరుచుండుము. నేను లోనికరిగి సుగుణవతికి మీరాకను దెల్పెదను. (నిష్క్రమించును.)

మనో:- (రత్నపీఠికపైఁ గొంతసేపు కూరుచుండి మరల లేచి) ఏమి యీసౌధ రామణీయకము! ఇందలి యపూర్వ చిత్రము లెంత వినోదకరములు! ఒకవైపునుండి వీనిని జూచి యానందించెదగాక.

( అనుచు చిత్రములను వర్ణించును. )

"సీ. పాయక కమలసంభవ కూఁతుఁ జెరపట్టె
నెలమిమై వెనువెంట నేగు విధము;
జంభాసురారియు సంభ్రమంబున వచ్చి
గౌతము నిల్లాలిఁ గవయు తెఱఁగు;

తన తపోవిధిమాని ఘన పరాశరమౌని
చెలఁగి యోజనగంధిఁ జేరురీతి;
చందురుండును సురాచార్యుని సతిఁజూచి
యరసి మోహించిన యట్టిరీతి;
అసమ నయనుండు దారువనాంతరమున
మునుల యిల్లాండ్రకెడరు చేసినవిధంబు
గోపికలఁ గృష్ణుఁ డలయించు కొన్నరీతి
యిందు గోడల నిండఁ జిత్రించినారు"

(కమల సుగుణవతితోఁ బ్రవేశించుచు. మనోహరుఁడు ప్రథమమున వారికంటికి గోచరింపఁడు)

సుగు:—(కమలతో) నిక్కవమా? వచ్చి యున్నారా? లేక హాస్యముచేయు చున్నావా?

కమల:—అబ్బా! నేనీవిషయములో హాస్యము చేయుదునా! అదిగో కన్నులారఁ జూడుము. ఆ రత్న పీఠికయందు గూరుచుండి యున్నారు.

(రత్న పీఠికమీఁద నాసీనుఁడై యుండు మనోహరుని ముందర నిలుతురు.

సుగు:—(లజ్జ నభినయించి, మనోహరునితో) స్వామీ! నాపై దయచూపి మీరింతదూరము విచ్చేసినందు కేనెంతయుఁ గృతజ్ఞురాలను. మీరాక నేఁజేసిన పూర్వ పుణ్యఫలమే కాని వేరుకాదు.

మనో:- నీదర్శనభాగ్య మబ్బినందున నేనుకూడ పుణ్యము చేసియుండవలెను.

సుగు:- మీరు మాయింటనే యుండ వేడుదానను.

మనో: చాల సంతోషము. నీకోరిక చొప్పున నేనిచటనే కొన్నిరోజులుండెద.

సుగు: కొన్ని రోజులనకుఁడు. ఎల్లకాలము మీరిందే యుండవలయునని నేనువేడుదానను. మిమ్మును నేను నాప్రాణపదముగా భావించి మీపాదసేవఁ జేయ నువ్విళ్ళూరుచున్నాను

మనో:—వారాంగనలందఱు నిట్లే తొలుదొల్త చెప్పుసది. జలగ రక్తమును, గానుగ చెఱకు రసమును బీల్చుతెఱఁగున పురుషుని యందలి సారమంతయు లాగి ఆవల నతనిఁ దృణీకరింతురు.

సుగు:—(నిరుత్సాహియై) మీరాడు మాటలు నాచెవులకు ములుకులవలె నున్నవి. నేను వెలయాండ్ర కులమునఁ బుట్టినదాననైనను నాకు వారి తలంపులు లేవు. మీరు నన్ను వేరుగ భావింపవలదు; మీ పాదములయాన ధనేశ్వరుఁడే వచ్చినను నేనతనిని దృణీకరించి మిమ్మునే నా యావజ్జీవమును నమ్మియుండెదను.

మనో:-అట్లైనఁ జూచెదఁగాక.

సుగు:—కొంచెము ఫలాహారమును స్వీకరింతురుగాని రండు.

(ఇద్దరు నిష్క్రమింతురు.)

(యవనిక జారును.)

---

## ద్వితీయాంకము : ద్వితీయరంగము

[చంద్రవదన సౌధము. అందొక భాగమునందు చంద్రవదన కమలలు ప్రవేశించి యీ తెరంగున సంభాషింతురు. మనోహరుఁడు కుడ్యచిత్రములఁ బరిశీలించు చుండును ]

కమల:—అమ్మా! మన సుగుణవతి కీడుజోడగు సూపరి యొకండు లభించి యున్నాఁడు. అతఁడన్ని విధముల నామెకుఁ దగిన వాఁడేకాని బీదవాఁడఁట. అతనినుండి యొక చిన్నకాసైనను రాదు.

చంద్ర:—ఆ! ఏ మంటివి? కాసులేని భికారి నా నా ముద్దులపట్టి సంపాదించు కొనుట! ఈ వెఱ్ఱిని నే నింతలోనే విడిపింతును. వార వనితలు విత్తములేని విటులకు వశ్యులగుచుండిన కడు

పెట్లు నిండును? వేల కొలంది ద్రవ్యమునిచ్చి మనయింటి కడపఁ ద్రొక్క శ్రీమంతు లెందఱో దొమ్ములాడుచుండ నెవనినో నిర్భాగ్యుని సుగుణవతి మోహించినదనిన లోకమువారు నవ్వరా? నేను కానిత్తునా?

(ప్రవేశము : సుగుణవతి)

సుగు:—అమ్మా! సర్వ సుగుణ సంపన్నుండును, రూపమున మన్మథునికి సమానుండును నగు మనోహరుఁడను నతఁ డేతెంచి యున్నాఁడు. నీవతనిని బలుకరింపుము. అట్టి సుందరాకారుఁడు మన యింటి కేతెంచి యుండుట మనభాగ్యము కదా!

చంద్ర:-భాగ్యమో! దౌర్భాగ్యమో! చూచెదగాక.

సుగు:—అమ్మా! గట్టిగ నఱవ వలదే; అతఁ డిక్కడనే యున్నాఁడు.

చంద్ర:-అతనిని నేనే పలుకరించెద. (మనోహరుని సమీపించి) ఏమండీ! మీరెవ్వరు? మీపేరు, ఊరు, కులము మున్నగునవి తెలిపెదరా?

మనో:—నేను క్షత్రియవంశ సంజాతుండను. నన్ను మనోహరుఁడందురు.

చంద్ర:-మీయూరు?

మనో:—నేను ఉదయపురమునుండి వచ్చుచున్నాను.

చంద్ర:—మా సుగుణవతి పేరంతదూర దేశములందు కూడఁ బ్రఖ్యాతికి వచ్చినదా ?

మనో:—అందునకు సందేహమేమి ? సుగుణయుక్తులగు వ్యక్తులకీర్తి సుగంధిక పుష్ప సౌరభముల మాడ్కి దిక్కులకు వ్యాపించును.

చంద్ర:—మీరు రాజవంశీయులంటిరి గదా ?

మనో:—అవును.

చంద్ర:—(వెనుకకుఁ దిరిగి కొంతదవ్వరిగి, తనలో) అట్లయిన నీతనియొద్ద పైకమున్నది., కమలమాటలు సంశయాస్పదములు. (మరల దిరిగివచ్చి మనోహరునుద్దేశించి) మీ రాక నాకుఁ జాల సంతోషము గలుగఁజేసినది. నాబిడ్డ, "సుగుణ" యెంతో పుణ్యము చేసినది, మీబోటి వారి చేపట్టుటకు.

(అని నిష్క్రమించును)

(యవనిక జారును.)

## ద్వితీయాంకము : తృతీయరంగము

**[సుగుణవతి శయ్యాగృహము. అందు మనోహరుఁడు మంచముపైఁ గూర్చుండి యుండును. సుగుణవతి చెంత నిలువఁబడి యుండును.]**

సుగు:-(మనోహరు నుద్దేశించి) నామనస్సును హరించి నట్లు మీరింకెవ్వరెవ్వరి మనస్సును హరించితిరి?

మనో:-నేనెవ్వరి మనస్సును హరించలేదు. నీవే నన్ను రమ్మంటివి గాన విధిలేక వచ్చితిని.

సుగు:-అపరిచితులమైనను ప్రథమ సందర్శనము నందే యవ్యాజప్రేమ యుద్భవిల్లుటకు పూర్వజన్మ సంబంధపు వాసనలేవియైన నుండునా?

మనో:-ఇందున నీయభిప్రాయ మేమి?

సుగు:-నా యభిప్రాయము మీదానిపై నాధారపడి యుండును. అంతే కదా?

మనో:-ఏల? నీమనోభిప్రాయ ముండ కూడదా? దానినే సమర్థింప కూడదా? అందులో నీవు విద్యావతివి కూడను!

సుగు:-స్త్రీలకంతటి స్వాతంత్ర్యమెక్కడనున్నది? పురుషుల యభిప్రాయములను చూచి, తప్పకుండ అనుసరింపవలసినదేకదా? లేక పోయిన వారి

జీవనము దుర్భర మగును. అభిప్రాయమును వెలిబుచ్చుటలో స్వాతంత్ర్యము వారికి లేదు. ఆర్థిక స్వాతంత్ర్య మంతకును లేదు. ఒకటి కొకటి పరస్పర సంబంధములు. ఆడుది యనఁగ మగవానిచేతి కీలుబొమ్మయని పెక్కండ్రి యభిప్రాయము.

మనో:—నేనట్లు తలంచను. స్త్రీలకుకూడ కొంతవఱకు స్వతంత్రము నిచ్చిన తప్పుకాదు. దాస్యచిత్తవృత్తి పురుషులకేగాక స్త్రీలకుగూడ హానికరము. దాస్యచిత్తవృత్తికి మారుగ సదసద్విచారబుద్ధి యుండిన నెంతబాగుండును. దేశోన్నతికి నదియ మూలము. అది యట్లుండని. పూర్వజన్మ వాసనల విషయమై ముచ్చటించితివే; తత్సంబంధమై నీ యభిప్రాయ మేమి?

సుగు:—పూర్వజన్మ వాసనలున్నవని యొప్పుకొను పక్షమున జీవుని పునర్జన్మమునందు నమ్మక ముంచవలయును.

మనో:—అది నీవు నమ్మెదవా?

సుగు:—మన మార్షమతస్థులము. పరమాత్మను జీవాత్మను, బునర్జన్మమును నమ్మువారము కదా. అదియునంగాక జైన బౌద్ధ ధర్మములు కూడ

బునర్జన్మమునందు విశ్వసించు చున్నవి. కాం-బట్టి పునర్జన్మమునందు నాకు గట్టినమ్మకమున్నది. ఈ పునర్జన్మము నుండి తప్పించుకొనుట మంచిదని ప్రాజ్ఞులు సెప్పుట వినియుంటిని.

మనో:—పునర్జన్మమునుండి తప్పించుకొను మార్గమెద్ది? నీజ్ఞానార్జనము గాంచిన, నీకిట్టి ప్రశ్న లతిసులభములుగా నున్నట్లున్నవి!

సుగు:—ఇట్టిప్రశ్నలకు త్తరము జెప్పుట కేనెంతటిదానను. అయినను నాకుఁ దోచినది చెప్పెద. పునర్జన్మమునుండి తప్పించుకొను ముఖ్యమార్గము వాంఛలను వదలివేయుట. మఱియు భక్తివలనను పరమేశ్వరుని కృపచే ముక్తిని బడయవచ్చునందురు; నిజమేనా?

మనో:—నీవు చెప్పునది నిజమే కాని యాశ యనునది యుంట మంచిదని నాతలంపు. కోరికలే లేని-చో మానవజీవనము నిస్సారముగాదా? నాగరకత యంతయు పరిశుద్ధములైన వాంఛల సంఖ్యనెక్కువ చేయుటలో నున్నదని కొందఱందురు. నేనును నట్లేతలంచెద. ఇందున నీయభిప్రాయమేమి?

సుగు:—అవశ్యములైన వాంఛలను దీర్పవలసినది కర్త

వ్యమే, అయిన, నిప్పటి మన నాగరకతలో నన
వసరములైన వాంఛ లెన్నియో పుట్టుకొని
యున్నవి. వాని నన్నియును దృప్తిపరచు
ప్రయత్నమున మానవుఁడు కడ తేరక అసంతృప్తి
యను పెనుభూతమునకుఁ బాలగు చున్నాఁడు.
మహాత్ము లందఱు వాంఛల నడచిపెట్టుమని
యుపదేశించుట ఇందునకే కాఁబోలు. దీనికి
మీ రేమందురు?

మనో:—నీమాటలు ముమ్మాటికిని నిజము. విషయ
సంగ్రహణమునకు నీతో సంభాషించు చుండిన
చాలును.

సుగు:—ఇఁక ఈ తత్వార్థములు చాలును. మీకు
పుష్పములపై నాస మెందుకదా. ఈ నవవిక
సిత సువాసన పుష్పములను స్వీకరింపుడు. ఈ
సుగంధ పరిమళమును గైకొనుఁడు.

(పూలు గంధము నంది యిచ్చును.)

మనో:—(నగుమోముతో వానిని స్వీకరించుచు) చాలును
చాలును. నీ యుపచారముల కంటె నీజ్ఞాన
వైశాల్యము నాకమందానందముగలుగఁజేసినది.
నీవు కేవలమొక వారాంగనవలె నాకంటి కగ
పడవు. నీ సుగుణములు, వినయ నయములు,

చిత్రవైఖరి, నడవడి, అభిప్రాయములు, అన్ని యుఁజూచిన నీ వొక యాదర్శ స్త్రీ రత్నమని నమ్ముచున్నాను. భారతమాతకు నీవు తిలక ప్రాయము.

**సుగు:**—మీరు నన్నాంక పొగడ వలదు. నే నేమహా త్కార్య మొనరించితిని, మీరు నన్నింతగా గొనియాడుటకు. మీ మాట లత్యంత విశ్వాస పూర్వకము లైనవేకాని వేరుకావు. వానికి నే నెంతయుఁ గృతజ్ఞురాలను.

**మనో:**—నీకంఠ మతిమనోహరమని నే నెరుంగుదు. ఒక పాటపాడుము. నీగాన సుధారసమును గ్రోల నువ్విళ్ళూరు చున్నాను.

**సుగు:**—అయిన పాడెదను.

(త్యాగరాయ కృతులనుండి)

(కళింగము : రూపకము)

"నిను వినా నామదెందు నిల్వదే శ్రీ హరి హరి
కనులకునీ సొగ సెంతో కమ్మియున్నదీ గనుక
నీదుకథలు వీనులందు నిండియున్నదీ రామా
శ్రీదనీ నామము నోటవెలయు చున్నదీ గనుక ॥నిను
నేను ఎచట జూచినను నీవైయున్నది ॥రామ॥
భానువంశతిలకా నీదు భక్తుడంచు పేరు గనుక ॥నిను

కపటమౌ మాటలెల్ల కమ్మనమ్మెదీరామ
నాతపము యొక్క-
ఫలమునీవె సకలలోక సన్నుత ॥నిను॥

ఏనో:— నీయింపగు ధ్వని మానవ హృదయము లేమేల! రాళ్ళనుకూడ కరిగించును. గానము ధర్మార్థ కామ మోక్షదము. దాని రసానుభవము లేనివారు పుచ్ఛవిషాణ హీనులగు పశుతుల్యులని యందురు. గానమునందు రక్తిలేనివాఁడు రాజద్రోహ దేశద్రోహములు సేయుచు లోలోనఁ గుట్రలు పన్నువాఁడుగ నుండునని యొక గొప్ప కవీశ్వరుఁడు నుడివి యున్నాఁడు. లలిత కళలలోనెల్ల గాన మగ్రస్థానము వహించును గదా!

నుగు:—మీ ప్రజ్ఞాప్రతిభ లసమానములు. పురుష రూపము దాల్చిన భారతియే మైయుండనోపు

మనో:—ఆమాట నీకు చెల్లును. చాల ప్రొద్దయినది. ఈ సంభాషణ యిప్పటికి చాలింతము.

(యవనిక జారును)

# కుబేర పతనము

తృతీయాంకము : ప్రథమరంగము.

[దక్షవాటి పురమునకుఁ బోవుత్రోవలో కుబేరుఁడు సిద్ధవేష ధారియై పోవుచుండును ఒక బ్రాహ్మణుఁ డెదురుగ వచ్చుచుండును]

కుబేరుఁడు:—(స్వగతము) ఏమి చోద్యమోకాని నేనీ కార్యము నారంభించిన దాదిగా దుశ్శకునములే కలుగుచున్నవి. చాలక, ఒంటి బ్రాహ్మణుఁడు కూడ యెదురగు చున్నాఁడు. ఏమైనను కాని, నేను వెనుకంజ వేయను. అది ధీరుల లక్షణము కాదు. "ప్రియత్నీ ఫలీ" ప్రయత్నించిన వానికి ఫలసిద్ధియగును. ఊరకుండిన ఫలమబ్బునా?

(అనుచు త్రోవనడచును.)

## తృతీయాంకము : ద్వితీయరంగము.

[ భీమేశ్వర దేవాలయములో దేవునియెదుట సిద్ధుఁడు నిలువఁబడి యుండును. తెర యెత్తబడును. ]

సిద్ధుఁడు:- (చేతులు మొగిడ్చి) భీమేశ్వరా ! సకల లోకారాధ్యా !

ఉత్సాహ. " సామగానలోల గజనిశాట
దుర్మదాంతకా
వ్యోమకేశ చంద్రమౌళి
యురగహార శంకరా
కామితార్థ ఫలద చారు
కార్ద్రవేయహార సు
త్రామ వినుత రజత శిఖరి
ధామ భీమ లింగమా.

(దేవుని పూజారుల నుద్దేశించి) స్వామీ ! పూజార్లువారు ! మీ నామధేయ మేమండి ?

పూజారి; -నన్ను " శంకరభట్టు " అందురు. మీ నామధేయ మేమండి ?

సిద్ధుఁడు:—నన్ను " ధనదత్తు " అని పిలుతురు. భీమేశ్వరుని సేవఁజేయ చాల దూరదేశము నుండి

వచ్చియున్నాను. ఈనూరు సువర్ణ నాణ్యము లను గైకొని స్వామికి అర్పింపుఁడు.

శంకరభట్టు:—(నాణెములను జూచి విస్మయమంది) ఈ బంగారు నాణ్యములు కన్నుల మిరుమిట్లు గొల్పు చున్నవి. మీరు సార్థకనామధేయులే సుమండీ! మీరుచేసిన సేవచే స్వామికి చాల తృప్తియయి నది. మీవంటి భక్తులుండగనే కదా దేవుని నిత్యకైంకర్యములు సాంగముగ జరుగుచుండుట. ఈమంగళహారతి తీర్థప్రసాదములను స్వీకరింపుడు.

[అని వాని నిచ్చును. సిద్ధుఁడు భక్తి వినయములతోఁ గైకొనును.]

ధనదత్తుఁడు:—మాబోటి తృణమాత్రులు దేవుని కేమి చేయగలము? (అని స్వామికి సాష్టాంగ దండ ప్రణామం బాచరించి, లేచి చేతులు మొగిడ్చి) శంభోశంకర! భీమేశ్వరా! నేను చేపట్టియుండు కార్యములోఁ దేగడ పొందునట్లు చేయుమని దీనముగ వేడుచున్నాను. నీసేవకుని గాపాడ వలయును.

[అని ముఖమంటపము సమీపమున ధ్యానము సేయుచు గూరుచుండును.]

[ప్రవేశము; పుష్పగంధి, పద్మావతి అను నిద్దరు వేశ్యలు]

**పద్మావతి:**—పుష్పగంధీ! చూచితివేమే యీ సిద్ధుని!

ఇతఁడు చాల మహిమ గలవానివలెఁ గన్పట్టు చున్నాఁడు. ఇతని పరిచయము నించుక చేసి-కొందము, రా.

పుష్పగంధి:—అవునే! ఇట్టివా రమానుష కార్యముల నొనరింతురని నేను విని యుంటిని. మన కోరిక లీడేరుటకై మంత్రి మూలికాదులేవైన యున్న వేమో యడుగుదము.

పద్మావతి:—(ముందరిగి సిద్ధుని యెదుట నిలచి) సిద్ధవర్యా! మీ రే యే దేశంబులు పావనంబు గావించి యిం దేతెంచి యున్నారు?

సిద్ధుఁడు:—నేను తిరుగని దేశమే లేదు. మహా పుణ్యస్థలముల నన్నియును జూచి తీర్థస్నానంబులు గావించి దేవుని సేవ యొనరించి యున్నాను. భీమేశ్వరుని దర్శనార్థమై యిచ్చటి కరుదెంచితిని.

పుష్పగంధి:—మీబోంటి మాహాత్ముల కసాధ్యమైన పని యే లేదు. నేనొకటి విన్నవించెద. దానికి సమాధానము సెప్ప వేడుదానను.

సిద్ధుఁడు:—నాతోఁచిన వఱకు చెప్పెద, అడుగుము.

పుష్ప:—మావీధి కొక చక్కనివాఁడు వచ్చి యున్నాఁడు. అతని పేరు మనోహరుఁడట. అతఁడు మా యింటికి వచ్చుట సంభవించునా?

సిద్ధుఁడు:—అతఁ డెవ రింట నున్నాఁడు?

పుష్పగంధి:—సుగుణవతి యింటిలో.

సిద్ధుఁడు:—సుగుణవతి సుగుణవతియే యైనచోఁ గష్ట సాధ్యము.

పద్మా:—సిద్ధవర్యా! నా ప్రియుఁడేల నాపైఁ జాల యనిష్టమును గనఁబఱచు చున్నాఁడు.

సిద్ధుఁడు:—అతని మనస్సునింకొకతె హరించినది.

పద్మా:—అదెవ్వతె?

సిద్ధుఁడు:—నీప్రక్క యింటి వేశ్యాంగన.

పుష్పగంధి:—(పద్మావతి నుద్దేశించి) అవునే, పద్మా! నేను వానిని మూఁడు దినముల క్రిందట నీప్రక్క యింటి మగనసేనతో మాటలాడు చుండుటఁ గాంచితిని.

సిద్ధుఁడు:—(వారిద్దఱ నుద్దేశించి) మీకు విటజను లెందుకు, ధనము కొఱకే కదా?

పద్మా, పుష్ప:—అవును. అయినను కులశీల రూపాదులును జూతుము. ధనము అన్నిటి కంటె ముఖ్యము.

సిద్ధు:—అట్లయినచో నేను మీకు కావలసినన్ని చీరలు సొమ్ములు నిచ్చెదను.

పద్మా, పుష్ప:—అట్లయిన నవన్నియు మీ యొద్ద నున్నవా?

సిద్ధుడు:—ఊఁ.

పద్మా:—ఏవి? చూపింపుఁడు?

సిద్ధుఁడు:—(చీరలు సొమ్ములను దీసిచూపి) ఇవిగో! ఇవన్నియు నిచ్చెదను; కావలెనా?

పద్మా:—ఊరక యిచ్చిన వస్తువుటకు నాకేమి పిచ్చియా?

సిద్ధుఁడు:—ఊరకయే యిచ్చెద. తీసికొనుము.

పద్మా:—(ఆశ్చర్యానందములతో) అట్లైన తెండు. (అని వానిని గైకొని) మీరు దైవసమానులు; మీరేమితలచిన నది యగునుకదా! నాపై విశ్వాసముంచి మాయింటికి వచ్చి పవిత్రము గావింపుఁడు.

సిద్ధుఁడు:—సుగుణవతి యిల్లు మీయింటికి సమీపమేనా?

పుష్ప:—(అంతలో) నేనేమి పాపము చేసితిని. నాకును చీరలు సొమ్ములు నీయరాదా?

సిద్ధుఁడు:—నీకును యిచ్చెద. (అని ఆమెకును గొన్ని చీరలు సొమ్ముల నిచ్చును.)

పుష్ప:—అదేమి! పద్మావతికి యిచ్చిన వన్నియు నాకీయలేదే?

సిద్ధుఁడు:—పద్మావతికి యిచ్చిన వానికంటెను నీకునెక్కువగానే యిచ్చియున్నాను. అయిన వేరు మాదిరి; అంతే.

పుష్ప—మీరు కామధేనువు!

పద్మా—మీరు కల్పవృక్షము?

పుష్ప:—మీకరుణతో మాయింటికిని వచ్చెదరా?

సిద్ధుఁడు:—సుగుణవతి గృహము మీ యింటికిని దగ్గరనేనా?

పుష్ప:—చాల దగ్గర. పద్మావతి యింటి కంటె మా యింటికి సమీపము, మీరు తప్పక రావలయును ఏమో మాట మాత్రమున కాహ్వానించితి నను కొనకండి.

సిద్ధుఁడు:—మంచిది, ఆవల వచ్చెద.

పద్మా:—నేను మొదలు పిలచితిని. మీరు తొలుదొల్త మాగృహము పునీతముఁజేసి పిదప నెక్కడనైనఁ బొండు

పుష్ప:—(అంతలో) మొదలు మాయింటికి.

పద్మా:—మాయింటికి మొదలు.

సిద్ధుఁడు:—ఇప్పు డెవ్వరింటికిని రాను. నాకు తీరికయయినపుడు చూచెదగాక.

పద్మా:—మీకు తీరిక యయినపుడే రండు. వేశ్యవాటికలో పూర్వాభిముఖమై యుండు యిండ్ల వరుసలో ఐదవ యిల్లుమాది.

పుష్ప:—దాని ప్రక్కిల్లు ప్రక్కేమాది, తప్పక వచ్చెదరా?

సిద్ధుఁడు:—కాని చూతము. నాకు విరామమున్నపుడు వచ్చెద. మంచిది మీరిక పోయిరండు.

పద్మావతి పుష్పగంధులు:—మేము పోయి వచ్చెదము. మమ్మును మఱవకుఁడు.

సిద్ధుఁడు:—మంచిది. పోయిరండు. (అని దీవించును.)

(పద్మావతి పుష్పగంధులు కొంతదూరముపోయి యిట్లు సంభాషింతురు.)

పద్మా:—ఏమే, పుష్పా! ఈ ముదుసలిగొడ్డు నాహ్వానించిన దెందు కనుకొంటివి? చీరలు సొమ్ముల కొఱకేగాని వేరుకాదు.

పుష్ప:—నేనుకూడ అందునకే రమ్మనినది. లేక పోయిన వాని గడ్డముజూచి భ్రమసితినని యెంచితివా?

(ఇద్దరు నిష్క్రమింతురు.)

(యవనిక జారును)

## తృతీయాంకము :   తృతీయరంగము.

[దక్షవాటి పురమునం దొక బ్రాహ్మణ వీధి. సుబ్బాశాస్త్రి శ్యామాశాస్త్రి యను నిద్దరు వైదిక బ్రాహ్మణులు ప్రవేశింతురు.]

సుబ్బాశాస్త్రి:—ఏమండీ, శ్యామాశాస్త్రిగారూ! రండి, పోదము. అందఱు పనికిరాని వాళ్ళందరు ఘనమైన సంభావనలు గొనివచ్చుచుండ మనమేల యూరకుండ వలయును?

శ్యామాశాస్త్రి:—ఎవ్వరండీ? ఎక్కడండీ? ఇచ్చువా రెవ్వరు?

సుబ్బా:—ఏ మండోయ్! ఊరంతా ఈసుద్దితో మారు మ్రోగుచున్న దే! మీకు దెలియ దటండి?

శ్యామా:—తెలియదండి. తెలిసి యుండిన నే నిచ్చట నుందునా?

సుబ్బా:—అట్లైన జెప్పెద వినుఁడు. భీమేశ్వర దేవాలయమున నొక యపూర్వ సిద్ధుఁ డేతెంచియున్నాఁడట. అతని మహిమ యేమందును! అడిగిన వారికి లేదనక ధనము, శాలుజోళ్ళు, ఆఁడువారికి చీరలు సొమ్ములు, అంతయు నిచ్చుచున్నాఁడఁట,

శ్యామా:–ఏమైన పండిత పరీక్షకలదా? లేక యూరక ముఖం జూపితే చాలునా?

సుబ్బా:–ఏపరీక్షయును లేదు. మీకెక్కడలేని వైదిక చాదస్తం బాధిస్తూంటుందే. లోన పాండిత్యము కుంటువడినను పైనమాత్రం సంపూర్ణ పాండిత్య మున్నట్లు నటించి ధైర్యముగాని పని చేయవలయును. అట్లుగాక అడుగడుగునకును భీతిల్లుచుండిన మిమ్ము నడుగంట జేతురు.

శ్యామ:–శాస్త్రిగారు, నేనట్లు కొంచానికి భయపడువాఁడు గానండి. మొన్నసభలో నాకించుక పరాభవ మయినందుకు వెనుదీయు చున్నాను. లేకపోతే నేనా భయపడువాఁడను! కాళిదాసునంతటి వానితో సైతము వాదమునకు వెనుదీయను. అదియట్లుండనీ. సంభావన లంటిరే; ఎప్పుడుపోయినను యిత్తురా? లేక నియమితకాలమేదైన నున్నదా?

సుబ్బా:–ఎప్పుడు పోయి యడిగినను ఇత్తురఁట.

శ్యామా:–అట్లైనచో నామేనల్లుఁడున్నాఁడే, కామయ్య; వాని కేసంపాదనయు లేక యూరక యింట గూర్చున్నాఁడు సుమండి. వానిని కూడ దో-డ్కొని వచ్చెద. బ్రాహ్మణుల కుద్యోగము

లెట్లు దొరకునండి ? వైదికవృత్తి నాశ్రయింప కుండిన కడు పేలాగండి నిండుతుంది ?

సుబ్బా:—అగత్యము కానీయండీ ; కామయ్యను బిలుచుకొని రండి. నేనును మా యింటివారిని దోడ్కొని వచ్చెద.

శ్యామా:—అట్లయినచో నేనును మాయింటి ఆడువాళ్ళు బిడ్డల నందఱిని బిలుచుకొని, యింటికి తాళము వేసికొని వచ్చెదను.

సుబ్బా:—త్వరగా రావలెను.

శ్యామా:—ఇదో ! కనుమూసి తెఱచునంతలో వచ్చి వేసెద.

(ఇద్దరు నిష్క్రమింతురు.)

(యవనిక జారును.)

## తృతీయాంకము :        చతుర్థ రంగము

[ శ్యామాశాస్త్రి గృహము. అతనిభార్య సావిత్రిమ్మ యింటి పనులలో మగ్నురాలై యుండును. ఆమె పిల్లలు గౌరి, కిట్టా అనువా రాడుచుందురు.]

(ప్రవేశము : శ్యామాశాస్త్రి.)

శ్యామా:-(భార్య నుద్దేశించి) ఏమి, వేగిర లేవు మంటు న్నాను. భీమేశ్వర దేవళము నందు ఆఁడవాళ్ళకు మగవాళ్ళకు అందరికిని భూరిదానముల నిచ్చు చున్నారఁట. నీకుఁ దెలియదా యేమి? నీ వెక్కడనో మంకు సాంబ్రాణివి! ఊరనుండు స్త్రీ లందఱు విరివిగ చీరలు సొమ్ములు తెచ్చుకొను చున్నారఁట. మనమూ పోవుదము. సుబ్బా శాస్త్రిగారు నాతోఁ జెప్పారిప్పుడు; కామయ్య యేడీ?

సావిత్రిమ్మ:—కామయ్య గదిలో నున్నాఁడు. కాని భూరి దానముల నిచ్చేవా రెవ్వరు?

శ్యామా:—ఎవరో సిద్ధులేతెంచి యున్నారఁట. వారఁట యిచ్చునది.

సావి:—సిద్ధులు! సాధ్యులు! ఎవ్వ రెవ్వరు మహాత్ము లు న్నారో యీ ప్రపంచమున!

శ్యామా:—కానీ; నీ పురాణం విప్పకు, వేగిర లేవ మంటున్నాను.

సావి:—ఇదో; లేచాను. 'గౌరీ' 'కిట్టూ' (అని పిల్లలను సంబోధించి) బిర బిర రండు. భీమేశ్వర దేవళ మున దక్షిణలు, తింటి యంతయు నిచ్చెదరట. చొక్కా తొడుగుకోరా, కిట్టూ!

గౌరి:—అమ్మా! నేనూ వచ్చేనూ...(అని యేడ్చును)

సావి:—నిన్నూ పిలుచుక పోతాను. దేనికిని యేడుపేనా?

(అని గద్దించి పావడ కట్టును.)

శ్యామా:—కామయ్యను పిలుచుకొని వస్తాను. మీరు సిద్ధముకాండి.

(అని నిష్క్రమించును.)

(యవనిక జారును)

---

## తృతీయాంకము : పంచమ రంగము.

[ శ్యామాశాస్త్రి యింటిలో నొకగది. అందు కామయ్య అతని స్నేహితుఁడైన భీమయ్య ఇద్దరును కాణీల నుంచి చీట్లా డుచుందురు. ]

(ప్రవేశము : శ్యామాశాస్త్రి)

శ్యామాశాస్త్రి:–(కామయ్య నుద్దేశించి) ఏమిరా ఇది? చీట్లాడ్తావటా్రి? ఇదేమిరా? కాణీలుకూడానా! డబ్బుంచి యాడడమా! చాల బాగుంది!

(అంతలో భీమయ్య మెల్లగ వెడలిపోవును. కామయ్య కాణీల నేరుకొని చీట్లన్నిటిని సంగ్రహించును)

కామయ్య:– లేదు, మామగారు! జేబులో నుండిన కాణీలు దిగువ జారిపడినవి; అంతే.

శ్యామా:–ఏమిటా్రి యిది యన్యాయము! రక్షక భటులు చూచారంటే నీగతి నాగతి యేమగునో! కాని వేగిర లెమ్ము. భీమేశ్వర దేవళములో సంభావన లిత్తురట, పోవుదమురా.

కామయ్య:–ఇదో, వచ్చితిని. మీరు ముందరుగుఁడు.

శ్యామా:–జాగు సేయకుము, వేగిరరా.

(అనుచు నిష్క్రమింతురు)

(యవనిక జారును)

తృతీయాంకము :          షష్ఠరంగము

[శ్యామాశాస్త్రి గృహమునందొక భాగము. సావిత్రమ్మ బిడ్డలతో సిద్ధముగ నిలుచబడి యుండును.]

(ప్రవేశము : శ్యామాశాస్త్రి.)

శ్యామా:—(భార్యతో) చూచావా! కామయ్య్య చేయుచుండిన పని! చీట్లాడు చుండినాడు!! కాణీలు కూడా పెట్టి!!! ఏ పనియును లేకపోతే చీట్లాడేపని పుట్టుకొనును గదా. అది సహజమే.

సావిత్రమ్మ:—అదేమో, ఒకొకప్పుడు ఇల్లే యెగిరిపోయేటట్టు బిగ్గరగా నరస్తుండినారు. ఆ భీమయ్య ఒకఁడు, సాపాటురాముఁడు, వీని జతకు. మనకేమి లెండి, "ముందుంది ముసళ్ళ పండుగ" అన్నట్టు ముందు జీవనోపాయము లేక కష్టముల పాలైనపుడు అంతయుఁ దెల్లమగును. దేవళమునకు బయలుదేరుదము రండు.

(ప్రవేశము : కామయ్య.)

శ్యామా:—(కామయ్య నుద్దేశించి) ఏమిరా! అరుపులెందుకురా ఆటలో?

(అని చిరుమురి మోముతో వెడల నుద్యమించును అంతలో

(ప్రవేశము : సుబ్బాశాస్త్రి)

సుబ్బా:—ఏమండీ శ్యామాశాస్త్రిగారు! ఇంత ఆలస్య మెందుకు! మే మంపలము కాచి కాచి మా కాళ్ళు సోలి పోయినవి. మీ పుణ్యానికి వేగిర రండుసుమా, మీ చాద స్తము నొకింత గట్టిపెట్టి.

శ్యామా:- క్షమించండి. ఈ బిడ్డలు పాపలు సాగించు కొని వచ్చుటలోఁ గొంచె మాలస్య మయినది.

కిట్టా:—(సుబ్బాశాస్త్రితో) లేదండి. తాతగారు. మా నుండి ఆలస్యము కాలేదు. కాని, కామయ్యా, భీమయ్యాతో......(తండ్రియగు శ్యామాశాస్త్రి వంక దిరిగి) చెప్పేస్తునా? నాన్నగారూ, చెప్పేస్తునా?

శ్యామా:—(కొడుకుతో) నోరు మూయురా. నీ వధిక ప్రసంగివి. పిల్లవాణి కీ మాటలెందుకురా?

సుబ్బా:—ఏమి; చిన్నలు తానే ఆడుచుండినాఁడు. నాకేమి తెలియక పోలేదులే, అబ్బాయి!

శ్యామా:—శాస్త్రిగారు! గట్టిగ నకండి. రక్షక భటులు వింటే కష్టములకు గురియగుదుము. ఆమాట అంతటితో వదలివేయండి. దేవళము నకు పోవుదము, చాల పొద్దయిన దంటిరే.

సుబ్బా:—ఏమిలెండి. ఎప్పుడు పోయి యడిగినా సంభావన లిత్తురఁట. అయిన నేమి; "శుభస్య శీఘ్రం" కదా. వేగిర రండు పోవుదము.

(అనుచు నందఱు వెడల సిద్ధమగుదురు.)

(యవనిక జారును.)

# కుబేరపతనము

చతుర్థాంకము : ప్రథమరంగము.

[చంద్రవదన మేడ. అందొక భాగమున చంద్రవదన కమలలు గూరుచుండి మాట్లాడు చుందురు.]

కమల:—(చంద్రవదన నుద్దేశించి) అమ్మా! మీరు వినలేదా ధనదత్తుని సమాచారము? అతఁడు భీమేశ్వర దేవాలయము నందున్నాడఁట. వచ్చిన దాదిగా నడిగినవారికి వలసినదెల్ల నిచ్చి పంపు చున్నాడఁట! ఆతని గొప్ప యౌదార్యము వలన మనయూర నుండు బీదవాండ్రందఱు శ్రీమంతులుగను, శ్రీమంతు లందఱు మరింత శ్రీమంతులుగను నగుచున్నారఁట! మన వీథి నుండు పుష్పగంధి పద్మావతులు మోయలేక, మోయ లేక, మోసికొని వచ్చుచుండిరఁట, చీరలు సొమ్ములను! మనమును బోవుదము, మన సుగుణ వతిని దోడ్కొని మనోహరుఁడు వచ్చిన దాదిగా సుగుణవతికి నాతో మాట్లాడుటకు సహితము తీరిక లేనట్లున్నది.

చ. "సుదతిరో! సిద్ధుఁడెంత ధన
　　శోభితుఁడో యటు పోయి చూడుమా,
యిదె మనవాడ సుందరుల
　　కెల్ల విశుద్ధపుస్వర్ణ వస్తువుల్
పదకము లాదిగాఁ గలుగు
　　భాసురరత్న విభూషణాదులిం
పొదవగనిచ్చుఁజేరి విన
　　యోన్నతి నందఱు మెప్పు సూపఁగన్"

చంద్రి:—(ఆశ్చర్యానందములను ప్రకటించుచు) అవునా? నిజమేనా? అట్లయినచో మనమునుపోయి యేల దీసికొని రారాదు? సుగుణవతి కీవిషయము చెప్పితివా?

కమల:—ఇంకను లేదు.

చంద్రి:—క. "అతి ముదమున మన బిడ్డను
　　　యతి **తిలకుండింత చూచ** నచ్చినచో నం
　　　చిత భూషణాదు లొసఁగును
　　　అతఁడును మన్నించుమిగులనందఱలోనన్."

అయ్యో! నాకాళ్ళుచ్చట నిలువవే! నేనిదే సుగుణను దోడ్కొని పోయెద; సిద్ధుని యెదుట దానిని నిలిపి అందరికంటె నెక్కువగా కనకాంబరముల నడిగి తెచ్చెద. సుగుణయేదీ?

కమల:—అది లోనున్నది — గదిలో మనోహరునితో

చంద్రి:—నేను పోయి పిలిచెద.

[అనుచు వడిగనడచి ముందటికి పడును. ఆవల పైకిలేచి చీర సవరించుకొని పోవును.]

(యవనిక జారును)

---

## చతుర్థాంకము : ద్వితీయరంగము

[చంద్రవదన సౌధమునకు జేరిన ఆరామము. సుగుణవతి పుస్తకము చేతఁబూని చదువుచు స్ఫటికపీఠముపై గూరుచుండి యుండును.]

[ప్రవేశము : చంద్రవదన]

చంద్రి:—సుగుణ! నాముద్దులగుమ్మా! నీకొక యపూర్వ సమాచారము దెలుప వచ్చితి. భీమేశ్వర దేవాలయమున నొక సిద్ధుఁడే తెంచి యున్నాడఁట. అతఁడడిగిన వారికి చీరలు సొమ్ములు నిచ్చునఁట. అందఱుపోయి తెచ్చుకొనుచున్నారు. మనమును పోవుదమురా, రా.

సుగు:—సిద్ధునకైశ్వర్య మెక్కడనుండి వచ్చును ? ఊర

నుండు వారికెల్ల చీరలు సొమ్ములు విరివిగనిచ్చు
నంతటిశక్తి యెట్లు సంపాదించెనో! ఏమి
చోద్యము!

చంద్రి:-- ఎట్లైన మనకెందు కాచింత? పోయి తెచ్చు
కొను పనిమనది.

సుగు:—నీవు చెప్పినదేమో సరియే. చీరలు సొమ్ముల
నూరక యిచ్చెదమనిన పోయి తెచ్చుకొన వల
యునని నాకును ఆశయే. అయిన నతఁడు
మాంత్రికుఁడు గింత్రికుఁడు కాఁడుకదా?

చంద్రి:—మాంత్రికుఁడైన మనకేమి?

సుగు:—మాంత్రికుఁడు నిర్మించిన వస్తువులు మనము
ముట్టరాదు.

చంద్రి:—(చిడుముడి మోముతో) అట్లైన నీకే లేవులే.
నీమనోహరుని మోముఁ జూచుచు నింట గూరు
చుండిన సర్వస్వమును నంతరిక్షము నుండి దిగి
వచ్చును కాఁబోలు! నీవేదో యొక వింత మృగ
ము, వస్తువా, లేదా?

సుగు:—ఆసిద్ధుఁడొక మాంత్రికుఁడని నాకనుమానము.
నేనురాను. సొమ్ములు చీరలు నాకుండెడివే
చాలును.

చంద్రి:—అయిన నూ[illegible] తమకుఁ దామె యవి వచ్చు నపుడు మనమేల సంగ్రహింపరాదు? సిరిరా మోకా లొడ్డుదురా, యెవ్వరైన?

సుగు:—నన్ను తొందరఁ బెట్టకుము. నేను రాను. వాఁడు భాగ్యమునిచ్చిన నీవే చూరగొనుము.

చంద్ర:—నాకెందుకే భాగ్యము? నేను ముసలిదాననై పోతిని. నీకోసమే నేనింతగాఁ జెప్పునది. నామాటవినుము. తల్లియగు నేను నీకు కీడెంచుదునా? నీవు వైభవముతో బ్రతికి బాళుచుండిన నేను చూచి సంతసించెద. నామాట వినుము. (అని కురులు తిద్ది బుజ్జగించును.)

సుగు:—(జుగుప్సను గనబఱచుచు) ఏటి బ్రతికి బాళడము! లంజబ్రతుకు!! తలఁచుకొనిన నామేను గగుర్పాటొందుచున్నది.

చంద్రి:—ఔరా! తరాంతరముల నుండి నడచి వచ్చిన మన కులవృత్తి విషయమున నీకు జుగుప్సయా? అయిన బాగున్నది! నీబోఁటివారు వృద్ధికి వత్తురు!

[అని ఎక్కసెక్కముతో గిరుక్రిన తిరిగి వెడలిపోవును.]

(యవనిక జారును.)

## చతుర్థాంకము :        తృతీయరంగము

[స్థలము: భీమేశ్వరదేవాలయము. సిద్ధవేషధారియగు కుబేరుఁడు దక్షవాటిపురజనులకు ధనకనక భూషణాంబరాదులను పంచుచుండును. జనులు తండోపతండములుగ వచ్చుచు బోవుచు నుందురు.]

[ప్రవేశము : చంద్రవదన కమలలు]

చంద్ర:—(సిద్ధునికి సాష్టాంగ నమస్కార మొనరించిలేచి చేతుల మొగిడ్చి) సిద్ధవర్యా! మా యూరి కెందఱెందరో వచ్చిరి; కాని మీకు సాటి వచ్చు వారెవ్వరును లేరు. దక్షవాటి పురము మీ పాదధూళిచే నేడు పవిత్రమాయెను. ఈ తేజస్సు, ఈఠీవి, ఈవైభవము, ఈయౌదార్యము, అడిగినదియిచ్చు వింతమహిమ, మరెవ్వరియందును మేమిదివఱకుఁ జూడలేదు! ఇఁక ముందుజూడఁ బోము!! భవద్దర్శనంబుచే మే మందఱము పావనులమైతిమి. మీరు మాపాలిఁటి భీమేశ్వరుఁ డేయనిన నతిశయోక్తి కానేరదు.

సీ. "నీలకంఠము మాని నిశితశూలములేక
    జగతి కేతెంచిన శంభుఁ డొక్కొ;
శంఖ చక్రముల హస్తంబులం బట్టక
    విధి భూమి విహరించు విష్ణువొక్కొ;

తనకుండు నాలుగాననములు త్యజియించి
యీరీతినున్న వాణీశుఁ డొక్కొ-
దేవలోకము వీడి దేహచిహ్నములేని
యిలకు నేతెంచిన యిందుౖఁడొక్కొ-;
యిట్టి యైశ్వర్యమహిమయు నిట్టి విభవ
మిట్టి యౌదార్యగరిమంబు లిట్టిరూపు
ఇట్టి తేజంబు నరులకు నేలగలుగు
మనల రక్షింపవచ్చిన మాయగాక."

స్వామీ! మీ సేవచేయ నే నువ్విళ్ళూరు
చున్నాను. కాన, నాపై దయయుంచి,

క. "విచ్చేయుము మాయింటికి
చెచ్చరనీవేళ భిక్ష సేయఁగ వలయుఁ
మెచ్చఁగ శిష్యులు మీరును
సచ్చరితానంద విభవ సౌజన్యనిధీ!"

ధనత్తుఁడు:-సామాన్యముగ నేనెవరింటికిని భిక్షకుఁబోను. అయిన నీవతిభక్తి తాత్పర్యములతోఁ బిలుచు చున్నావు గాన వచ్చెద. నీవెవ్వరు?

చంద్ర:—నే నీ భీమేశ్వరుని సన్నిధినుండు సానిజనుల కెల్లఁ బెద్దను. నన్ను "చంద్రవదన" అని పిలుతురు. నాకొక ముద్దులొలుకు కూఁతు రున్నది. దానిని "సుగుణవతి" అని పిలుతుము. రూప

మునం దెట్టో బుద్ధియందును దానికి సరివచ్చు వా రెవ్వరును లేరు. సంగీత సాహిత్య నాట్యాది కళలలో సుశిక్షిత యయినది. చక్కని చుక్క. నేను వర్ణింపఁ జాలని దాని రూపము. అయినను సూక్ష్మముగాఁ జెప్పెద వినుఁడు.

సీ. పూర్ణచంద్రునిఁ బోలు ముద్దు మొగంబును
సిందూరమునుఁ బోలు సిగ్గుచూపు;
కర్ణాంతవిశ్రాంత కమల నేత్రంబులు
సమ్మోహనంబైన శక్తిచూపు;
ముసిముసి నగవుతోఁ బొనర మాటాడుచు
లలితమైపొల్చు పల్వరుసచూపు;
మృదువు దీర్ఘమును నౌ మేచక కచములఁ
బివిధరీతినిగట్టి వింతచూపు;
గీ. దాని రుచిర రూపతను విలాసములను
నోటిమాటగాను నుడువజాల,
కాన మీరేవచ్చి కనులారఁజూడుఁడు
రమ్ము, సిద్ధవర్య, రమణికడకు.

ధనదత్తుడు:- అట్లైన దప్పక వచ్చెద. నీవు ముందరుగుము.

చంద్ర:- చిత్తము. నేను ధన్యురాల నైతిని.

ధన:- ఇదో, ఈ నవరత్నఖచిత ఆభరణాంబరములను, పుష్ప తాంబూలములను, సుగంధ ద్రవ్యములను గొనిపోయి మాసుగుణవతికి నేను పంచితి నని చెప్పి యిమ్ము.

చంద్ర:- (వాని నత్యానంద భక్తి విశ్వాసములతో గైకొని) మీ యానతి చొప్పున సుగుణవతికి నివన్నియు నందఁజేసెద; మీరు పంపితిరని చెప్పెద. అదియే యిచ్చట రానుండెను. కాని యేదో కొంచె మనివార్య కార్యముచే రాలేదు.

ధన:- నేనే వచ్చుచున్నానే; ఇంకేమి.

చంద్ర:- మంచిది; చాల సంతోషము. నాకు సెల వొసంగెదరా? నేపోయివచ్చెద (అని సాష్టాంగ నమస్కారము జేయును. సిద్ధుఁడు దీవించును.) మా కమల నిందేయుండుమని నియమించి యున్నాను. అది మీకు త్రోవ చూపించును. (కమలతో) ఇందేయుండి వారిని దోడ్కొనిరమ్ము.

కమల:- అట్లే చేసెద.

(చంద్రవదన నిష్క్రమించును.) (యవనిక జారును.)

---

## చతుర్థాంకము : చతుర్థరంగము.

[ చంద్రివదన సౌధమునం దొకగదిలో సుగుణవతి కుర్చీపై గూరుచుండి పుస్తకముచేతఁ బూని చదువు చుండును. ]

[ ప్రివేశము : చంద్రివదన-సిద్ధుఁడిచ్చిన ఆభరణాదులతో ]

చంద్రి:—సుగుణ ! ఇవిగో ! చూడుము ! సిద్ధుఁడు నీకై ఈభూషణాంబర ఫలతాంబూల సుగంధ ద్రివ్యాదుల నంపియున్నాఁడు. మన యింటి కతనిని భిక్షుకాహ్వానించితిని. అందున కతఁడం గీకరించి యున్నాఁడు. అతఁడింటికి వచ్చినపు డైన సరిగ నడచుకొనవలయును జుమా. ఈ భూషణాఁబరము లెంత యమూల్యములు !

సుగు:—అతఁడొక కపటసిద్ధుఁడని నాకేదో భీతి గలుగు చున్నది ; రమ్మనకుండిన బాగుండెడిది. ఈ యాభరణాదులు నాకక్కఱలేదు.

చంద్రి:—నీకు వెఱ్ఱి తలకెక్కినట్లున్నది.

సుగు:—జోగులకిట్టి యమూల్య రత్నాభరణాదు లెచ్చటి నుండి వచ్చును, మాంత్రికుఁడు కాకుండిన ?

చంద:—నీవు పిల్లికి జ్వరమువచ్చు మాటల నాడు చున్నావు. నీలో ప్రిపంచ జ్ఞానమనునది శూన్యము. వచ్చినవి గ్రిక్కుమని లాగుకొనక అడ్డు

గద్దునకు నా సౌధ భీతిల్లు చుందురా, యెవ్వరైన?
సీతతో తప్పకుండుటకు నాకు ప్రాప్తము లేదమ్మ;
సిద్ధుల కొరకుం గావలసిన పరికరముల నొదిగించు
కొనవలయును.

(అని నిష్క్రమించును)

(యవనిక జారును)

---

## చతుర్థాంకము : పంచమరంగము

[స్థలము: చంద్రవదన సౌధము. ఆమె గృహము నలంకరించి పరికరములతో సిద్ధునిరాక కెదురుం జూచు చుండును]

చంద్రి:-(తనలో) ఏమోకాని! సిద్ధుండింకను రాలేదు. సత్వరము వచ్చెద ననెనే. ఆడిన మాటకుం దప్పండుకదా

(అని ఆలోచించు చుండును)

(ప్రవేశము : కమల)

కమల:- అమ్మా! సిద్ధులువచ్చిరి. శిష్యులెవరును రాలేదు. వారొక్కరే వచ్చిరి.

(చంద్రవదన వెండిచెంబులో నీళ్ళనుంచుకొని వీధి వాకిటవచ్చి నిలువంబడును. కమల జతలో నుండును)

(ప్రవేశము : సిద్ధుఁడు)

చంద్ర:—(సిద్ధునికి నమస్కారముజేసి యాతని పాదములు కడిగి) సిద్ధవర్యా! మీ పాదధూళిచే మాయిల్లు పవిత్రమాయె. దయ చేయుఁడు. ఈ రత్నపీఠిక నలంకరింపుఁడు. (అని పీఠికను జూపును. సిద్ధుఁడాసీనుఁడౌను. కమల నుద్దేశించి) కమలా! సిద్ధులకు నమస్కారము జేయుము. సుగుణవతిని రమ్మనుము.

(కమల, సిద్ధులకు సాష్టాంగ దండ ప్రణామంబాచరించును. సిద్ధుఁడు దీవించును.)

(కమల నిష్క్రమించును.)

(సిద్ధునితో) మీకు చాల మార్గాయాస మైనది కాఁబోలు.

సిద్ధుఁడు:—సుగుణవతియొక్కయు నీయొక్కయు పరిచయ మొనరించుకొను బ్రయత్నమున నెంతిమార్గాయాసమైనను సార్థకమే యగును.

చంద్ర:—సుగుణవతిని మీసేవకై నియమింతునా?

సిద్ధుఁడు:—కావచ్చును.

చంద్ర:-(చిరునగు మోముతో) సుభద్రార్జునుల కథ మరియొక టిందు జరుగఁబోవునా యేమి?

సిద్ధుఁడు: -రసికాగ్రేసరురాలవగు నీకు నేను మాటలు విచ్చి చెప్పవలయునా ?

చంద్రి: -గ్రహించితి, గ్రహించితి ; మా యింటికి మీరల్లుఁడుగా వచ్చితి రనండి. నేకోరినది కూడ నదియే. (నవ్వుచు) అయిన నర్జునునివలె పిల్ల నపహరించుకొని మాత్రము పోవకండి! వెతకఁ బోయినతీఁగ కాళ్ళకు దగులుకొన్నట్టు నేనభిలషించిన దతిసులభముగ నీడేరినది. ఇది యంతయు నాభీమేశ్వరుని మాయ. వట్టి మాటలలోఁ గాలయాపనము సేయుచున్నాను. మీరించుక ఫలహారమును గైకొనుఁడు. (కమల నుద్దేశించి) కమలా ! కమలా !

(ప్రవేశము : కమల)

కమల:—(చంద్రవదన చెవిలో) సుగుణవతి రానన్నెను.

చంద్రి:—(మెల్లగ) కాని, నేను దానిని సరిదిద్దెదను. నీవుపోయి సిద్ధులకు ఫలాహారమును గొనిరమ్ము.

(కమల నిష్క్రమించును.)

సిద్ధుఁడు:—(చంద్రవదనతో) నీశ్రద్ధా భక్తులే నాకడుపు నింపి వేసినవి.

చంద్రవదన:—వలసినచో,

గీ. పసిమిగల యిప్ప పువ్వుల రసముఁదీసి
ఖండ శర్కరతోఁగూడి వండి మిగుల

మేటి కర్పూర రజితముల్ మిళితమైన
మంచి రుచిరాసవంబుఁ దెప్పించుదాన.

సిద్ధుఁడు:—వలదు, వలదు ; నాకు సారాయమేమియు
వలదు ; కాని.

క. "జగతిగల విద్యలన్నియు
నగణితముగ నేర్చెనంచు ననురాగముతోఁ
బొగడితి వెక్కుడి కేగను
సుగుణవతిని దెమ్మ నేను చూడగవలయున్."

చంద్రి:—అది లోనున్నది. ఇదె, తోడ్కొని వచ్చెద.
(అని యత్యాతురతతో నిష్క్రమించును.)

సిద్ధుఁడు:—(తనలో) ఈ ముసలిది విటరంపములలో నగ్ర
తాంబూలమున కర్హురాలు. దీని వలలోఁ
దగుల్కొనిన వానికి దేవుఁడే దిక్కు!

(యవనిక జారును.)

# కుబేర పతనము

## పంచమాంకము : ప్రథమరంగము.

[స్థలము : చంద్రవదన సౌధములో సుగుణవతి యంతః పురము. అందు సుగుణవతి కమలతో మాట్లాడుచుండును.]

(ప్రవేశము : చంద్రవదన)

చంద్ర:—సుగుణవతీ! సుగుణా! ఏలనమ్మా యింకను రాలేదు? కమల పిలువలేదా అప్పుడే?

సుగు:—పిలిచెగాని నేనే రానైతి.

చంద్ర:—నీవు నాముద్దుల పట్టివిగాదూ! బిరాన రావమ్మా. సిద్ధులు నిన్నుఁ జూడ నిచ్చగించు చున్నారు.

సుగు:—నీ కీవిషయమునం దవిధేయతను జూపవలసివచ్చి నందులకై నన్ను క్షమింపుము. నేను రాను. వేగిరమ భిక్షచేసి సిద్ధుని బంపివేయుము.

చంద్ర:—సరివారిలో నగుబాట్లకు గురిచేయు చున్నావే. సిద్ధుఁడు నిన్ను సేవకై గోరియున్నాఁడు. అతని మాటఁ ద్రోసివేయ జనదు. వారి యాజ్ఞను

శిరసావహించి నడచుకొనిన మనకు శ్రేయస్కరము.

ఉ. "నాయికపూని యీవయసు
నగ్గడియింపక విత్తమబ్బు, నీ
ప్రాయము రూప సంపదయు
భవ్య సమున్నత దేహకాంతులుఁ
బోయినమీఁద వేఁడినను
బోకయుఁ బుట్టదు వారకాంతకుఁ
వేయును జెప్ప నేటికిక
వేగమె సిద్ధునిఁ జూడు భామినీ."

సుగు:—ఓహో! సిద్ధుని యుద్దేశమును నీయభిమతమును నాకిప్పుడు తెలిసెను.

చంద్ర:—తెలిసిన నష్టమేమి? నీ కీమొఱకుఁదనము సరికాదు. వారకాంతల యిండ్లలోఁ దల్లులే యంతకును బెద్దలు. కాన నా కవిధేయతను గనబఱచుట నీతి విరుద్ధమే కాక లోక విరుద్ధముకూడను. వినుము,

క. నేరుపుతో నాగాదను
వారెవ్వరు లేరు వారవనితల కెల్లన్
ధారుణిఁ దల్లులె కర్తలు
వారింపను బుద్ధిసెప్ప వారిజనేత్రా."

ఆ మనోహరుఁడనే వానిని జేర్చితివి. ఒక్కకాసైన వానినుండి రాలేదు. చక్కదనమును మోహించిన లాభమేమి? ధనములేని సౌందర్యమెందునకు? కాల్చనా? వాఁడింక రానీ......

(అంతలో, మనోహరుఁడు ప్రవేశించును.)

మనో:—(సుగుణవతితో) సుగుణ! ఆవచ్చియుండు వారెవ్వరు? ఈ విజృంభణ మంతయు నేమి?

చంద్ర:—ఎవ్వరైన నీకేమి? మాయింటికి పదిమంది వచ్చుచుఁ బోవుచు నుందురు. నీ కెందు కీ యధిక ప్రసంగము?

సుగు:—అతఁడొక సిద్ధపుంగవుండట! మా యింటికి భిక్షకాహ్వానింపఁబడి యున్నాఁడు. అతని మహిమ యేమన వచ్చును! ఏ మడిగిన దాని నిచ్చునట. అతని పేరు ధనదత్తుఁడట. సార్థక నామధేయుఁడే కదా! అతని సేవకై మాయమ్మ నన్ను నియమించినది. అది మీకు సమ్మతమేనా?

మనో:—నామాటలో నీవుందువా? నేను వలదనిన...

చంద్ర:—(కన్నులెఱ్ఱజేసికొని భీకరాకృతితో మనోహరునితో) నీవా నాయింటికిఁ బెద్ద. నీమాటలోనా నాబిడ్డ యుండునది?

"ఉ. పల్లవకోటిచే సకల
వస్తువులన్ గొని తెచ్చి పెట్టి యి
ల్లెల్లను బోషించు బిడ్డను మ
రెక్కడ వెళ్ళగనీక కూడి రం
జిల్లగ మాయఁజేసి వల
పించితి బాలిక బిల్వ వచ్చినన్
మల్లు లవెన్ని జేసెదవు
మానమె యిట్టిది నీకు సెప్పుమా ?"

మనో:- సుగుణవతి యిష్టము చొప్పున నాచరించనీ.

చంద్రి:—సుగుణవతి తనకు తానే పెద్దయా ? నే నుండు వఱకు అదెట్లు కానిత్తును ? నా యిష్టము చొప్పున నది నడచుకొనవలయునే కాని, స్వేచ్ఛా వర్తిని యగుట కాని యితరుల మాటలో నుండుట కాని కలలోనివార్త. (భీకరాకృతితో)

ఉ. "మందులు మాయలున్ జెనఁటి
మంత్రములున్ దగగూర్చి భూమిలో
నెందఱ నెందఱన్ భ్రమల
నేర్పడ బెట్టితి వారు చాల కీ
సుందరి వెట్టిగొల్పి యిటుఁ
జూరగఁ దింటివి, యీవిలేదు ; ఈ
పొందులు గట్టిపెట్టి వెడ
పోకలుమాని తొలంగు వేగిరన్."

వేగిరపొమ్ము. లేనియెడ సర్వ చంద్రి ప్రయోగ మగును.

సుగు:—(నిరుత్సాహియై తల్లితో) అమ్మా! చెడ్డమాటల నాడవలదు. నేను వేడినందునకై యతఁడు మనయింటికే తెంచెనేగాని తానే రాలేదు. ఇంటికి రమ్మని పిలచి యవమానించుట పాడియా? (మనోహరునితో) మీరు నాతల్లి మాటలను సరకు గొనకుఁడు.

మనో:—(సుగుణవతితో) నేను మొదలే చెప్పలేదా? ఇట్లు సంభవించునని. నీమాటలను నమ్మివచ్చినందునకై నా కీదుస్థితి ప్రాప్తమయినది.

సుగు:—(మనోహరునితో) క్షమింపుడు. మాయమ్మ దుర్భాషలాడిన నేనేమి సేతు? నాలో నేమైన మార్పున్నదా? నేను మొదటి వలెనే మిమ్మునే నమ్మి యున్నాను. సిద్ధుని సేవకై పోనంటిని. అయినను మాయమ్మ బలాత్కరించు చున్నది. (చెవిలో) మీరు తత్కాలమునకు భీమేశ్వర దేవాలయమునకుఁ బొండు.

చంద్రి:—(మనోహరునితో) ఏల యింకను బోవకున్నావు? పరకలు చేటలు తేవలె కాబోలు.

మనో:—సుగుణ! నేను పోయివచ్చెద.

చంద్ర:—ఆ! ఏమంటివి? పోయి, వచ్చెద నంటివా? అట్లే తొలంగి పోకుండ.

మనో:- (సుగుణవతితో) నేను శ్రీ భీమేశ్వరునైనను గొల్చి నాజన్మ సాఫల్య మొనరించు కొనెదను

చంద్ర:-(మనోహరు నుద్దేశించి) భీమేశ్వరుని యొద్దకు బోవుటకు మారుగ యమేశ్వరుని యొద్దకుఁ బోయిన బాగుండును. భీమేశ్వరుని యొద్దకే బోన నిశ్చయించుకొను నెడల నా ముక్కంటి వేల్పును తన ఫాల నేత్రముతోఁ జూడుమని వేడుము.

(అని సుగుణవతి చెయ్యిపట్టుకొని లాగును. మనో హరుఁడు హతాశుఁడై వెడలి పోవును.)

(యవనిక జారును)

## పంచమాంకము: ద్వితీయరంగము

[చంద్రవదన సౌధమునం దొక భాగమున సిద్ధుఁడు ధ్యాన పరుఁడై కూరుచుండి యుండును.]

(ప్రవేశము : చంద్రవదన సుగుణవతి చెయ్యిపట్టుకొని)

చంద్ర:—(సిద్ధు నుద్దేశించి) స్వామీ! ఇదే, సుగుణవతి వచ్చినది. మీ సేవకై దానిని నియమించి యిందు వదలు చున్నాను. (సుగుణవతితో) సుగుణ! సిద్ధులకు నమస్కరింపుము.

సుగు:—అట్లే యొనరించెద.

(నమస్కరించును ; అప్పుడు)

సిద్ధుఁడు:—(ధ్యానవిసర్జన జేసి) భీమేశ్వరా! నారాయణా అభీష్ట వరప్రాప్తిరస్తు. (అని దీవించును. సుగుణవతిలేచి యొకప్రక్క నిలువఁబడి యుండును.) సుగుణవతి! యతులమైన మాకు నగరవాసమున కంటె వనవాసమే సుఖకరమని తోచుచున్నది. నారాయణ! నారాయణ!

సుగు:—(స్వగతము) వీని బూటాటకము గాంచిన నా యనుమానము స్థిరమగు చున్నది.

చంద్ర:—(సుగుణవతితో) సుగుణ! సిద్ధులకు శ్రద్ధా భక్తులతో శుశ్రూష చేయుము. ప్రతి ఫల మింతలోనే కలుగును.

సుగు:—(చంద్రవదనతో) అమ్మా! నీయిష్టము చొప్పున సిద్ధులసేవ చేయుదును. వారికి గావలసిన సాహాయ్యము చేయుట కేయభ్యంతరమునులేదు. ఫల పుష్పాదులను దెచ్చి యిత్తును. ఇవే కదా నేను చేయవలసిన పనులు?

చంద్ర:—(సుగుణావతితో) అంతే; అయిన నింకేమైన సిద్ధులు చేయుమనిన సహాకరింపుము. నేనా కార్యము లివియేయని జాబితా వేయుటకు సాధ్యమా? నే చెప్పునది తెలిసెనా? తగిన రీతిని నడచరింపుము.

సుగు:—తగిన రీతియనగ నెద్ది?

చంద్ర:—సిద్ధు లేపనిచెప్పిన సంసిద్ధమై యుండుట.

సుగు:—సభ్యరీతిని చేయుటకు నేను వెనుదీయను.

సిద్ధుడు:—సుగుణ! అంతగా కష్టమైన పనులేవియు నుండవు. నీవు భయమొందవలసిన పనిలేదు.

చంద్ర:—చూచితివా, సుగుణా! సిద్ధులెంత దయాళు హృదయులు! నీకేల భయము? నేనికపోయి వంటపను లెంతవఱకైనవో చూచెద. కమల కిట్టి పనులలో ననుభవము తక్కువ.

(అని నిష్క్రమించును)

(సిద్ధుఁడు సుగుణవతు లిద్దరే యుందురు. సుగుణవతి దూర ముగ తలవంచుకొని నిలువబడి యుండును)

సిద్ధుఁడు:—సుగుణ! ఏల యూరక నిలిచితివి?

సుగుణ:—నన్నేమి చేయమంటారు?

సిద్ధుఁడు:—నీవు నాకేకాంత సేవ—ఆ—ఏకాంత సుఖ మును నీయఁ దలంచి నట్లున్నది. నీనుండి తగిన సేవయే గైకొనెద.

సుగు:—(ముఖము గంటువేసికొని) తాము సిద్ధులుకదా! ఏమి మాట్లాడినను సరియె కాఁబోలు!

సిద్ధుఁడు:—మేము ప్రపంచిక విషయముల కపరిచితు లము గాన మా మాటలలో బ్రమాదములుండ వచ్చును. కోపింపకుము. సుగుణ! నీవు నెఱ జాణ వనుసమాచారము మఱచితిని. ఇంత మాత్రమునకుఁ గోపమా?

సుగు:—మీ మాటల ధోరణి గాంచిన మీవాక్కు లుద్దేశ పూర్వకములే యై యుండునోపు.

సిద్ధుఁడు:—నామాటలొకవేళ యుద్దేశ పూర్వకములని యొప్పుకొన్నను నవి నాశీలమున కించుక లోటు దెచ్చునేకాని నీశీలమున కెట్టి భంగమును దేవు కదా.

సుగు:—మీమాట లందలి యంతరార్థము తెలిసెను. నేను వారాంగనాకులజ యని మీ రిచ్చకు వచ్చి నట్టు నావిషయమై నుడువ వచ్చును కాఁబోలు! మీ రిక హాస్యము లాడకుఁడు.

సిద్ధు:- హాస్యము కాదు; నిజమే.

సుగు:—అట్లయిన "ఏకాంత సుఖము" "తగిన సేవ" మున్నగుమాట లుద్దేశ పూర్వకములైన వాక్కు లేనా?

(అని దూరముగ పోయి తలవాంచి చుఱచుఱఁ జూచుచు నిలుచఁబడును.)

సిద్ధుఁడు:—సుగుణ! నీ నవవయోలావణ్య విలాస సంశోభితమైన యొయ్యారమును గనఁబఱచుచున్నావు కాఁబోలు! నీకు సిగ్గాయేమి? ఏల దవ్వరిగితివి? నీ నిలువెత్తు రత్నఖచిత భూషణముల నిత్తును. కన్నుల మిఱుమిట్లు గొలుపు పట్టుచీరల నిత్తును. నీ ప్రేమకటాక్షములు నాపైఁ బ్రసరింపుము.

(అని చేతులుసాచికొని సుగుణవతిని సమీపించును. ఆమె వెనుకకుఁ బోవుచుండును.)

సుగుణ:—(స్వగతము) అయ్యో! దేవుఁడా! నాకెట్టి దుఃస్థితిఁ దెచ్చి పెట్టితివి! భీమేశ్వరా! నన్నీ దురాత్ముని బారినుండి కాపాడుము. (ప్రకాశముగ) సిద్ధులయ్యా మీ రిట్టి పనులకుఁ దిగుట

తగదు. నేను వేశ్యాంగనయని స్వేచ్ఛగ వర్తిం
చు చున్నారు కాఁబోలు. నాకు వేశ్యల చిత్త
వృత్తిలేదు. నేనొక పురుషశ్రేష్ఠుని వరించి
యాతని నాపెనిమిటివలె భావించుకొని యు
న్నాను. నాకు ధనమునకంటె పవిత్ర జీవనము
ముఖ్యము. నన్ను నిర్బంధింపకుము. మీ
చెడు త్రోవలను వదలుఁడు. లేనిచో మాతల్లికి
సమాచారమంతయు నెఱింగింప వలసి వచ్చును.

సిద్ధుఁడు:—(తటస్థుఁడై) ఎఱింగింపుము. మీతల్లి సమ్మతి గానియే నేనాచరించుచున్నాను. మఱచితిని. నీ వెవ్వనినో ప్రేమించితి నంటివే, అతఁడెవ్వఁడు?

సుగు:—మనోహరుఁడను రాజపుత్రుఁడు.

సిద్ధుఁడు:—చాల ధనికుఁడు కాఁబోలు !

సుగు:—ధనికుఁడు కాకపోయినను కుల శీలసౌందర్యములతో నొప్పుచున్నాఁడు. మలినమైన జీవనమును గడపుచు ధనములో నోలలాడుట కంటె, పరిశుద్ధమైన జీవనమును గడుపుచు గుడిసెలో గంజిని త్రాగి మనుటమేలు.

సిద్ధుఁడు:—ఈ శ్రీరంగనీతులు నేను వినక పోలేదులే! వారవనితలు ధనమున్నవారిని తప్ప ఇతరులను వరింపరు. రూపముఁ జూచి వెఱగంది తాత్కాల

మున కించుక మోసపోయినను అనతికాలము
ననే వారు మేల్కాని తమవలపును ధనికునిపై
బోనిత్తురు. ఇది యథార్థము. ఇంతియ గాక
స్త్రీల మనస్సెప్పుడును చంచలమే! అందులో
దేవదాసీల మనస్సులన వేఱుగఁ జెప్పవలయునా!
వినుము,

గీ. "ఒకరియొద్దనుండి, యొక్కని వెలుపల
గన్ను సన్న జేసి, కడురయమునఁ
గవయ నొకని, మోహకార్యంబు లొక్కని
యెడల నిలుపుకొందు రింతులెల్ల"

సుగు:—(ఉగ్రమూర్తియై) ఓరీ! మూర్ఖా! ఏల పేలె
దవు? "ఇంతులెల్ల" అని స్త్రీ వర్గము నంతయు
దూషించుచున్నావా?

సిద్ధుఁడు:—అవును; నీవాడుమాటలోఁగూడ నించుక
సత్యమున్నది. క్షమింపుము. స్త్రీజాతి కంత
యుఁ గాకపోయినను మీ నటువజాతివారి కది
సరిగా నొప్పును.

సుగు:—స్త్రీ ప్రపంచము విషయమై యిట్టి నీచ భావము
లుండఁ బట్టియే కదా భారతీయ లీస్థితిలో నుం
డుట. వినుము, ఏ దేశము నందు స్త్రీలను గౌరవ
బుద్ధితోఁ జూడరో యాదేశ మనాగరక దేశమని
చెప్ప వచ్చును.

సిద్ధుఁడు:—నాగరకతానాగరకతల విషయమై నీకుండు అభిప్రాయములు విపరీతములు. బేలా! చెప్పెద వినుము. దేవుఁడు స్త్రీని నిర్మాణము జేసియుండుట పురుషుని విలాసము కొఱకు.

సుగు: అది యెన్నటికిని కాదు.

సిద్ధుఁడు:—కాకపోయిన మంచిది; నాపైనీకేల కోపము? గుణరూపము లందు నీకు సాటివచ్చు వారెవ్వరు? ఏమో ప్రమాదవశమున నీతో వాదులాడితిని; క్షమింపుము. నే నాడిన మాటలన్నియును మఱచి పొమ్ము. నేను నీ దాసుఁడను. నాపై వల పూనుము.

(అని దైన్యముతో మోకరించి వేడుకొనును)

సుగు: ఓరీ! నరాధమా! నీకు యుక్తాయుక్త తారతమ్యజ్ఞాన మణుమాత్రమును లేదు. నీ చర్య యంతయు మాతల్లి కెఱింగించెద.

(అని కోపముతో వెడలి పోవును.)

(యవనిక జారును)

## పంచమాంకము : తృతీయరంగము.

[స్థలము : చంద్రవదన సౌధములో నొకగది. చంద్రవదన కమలలు మాటలాడు చుందురు.]

(ప్రవేశము : సుగుణవతి)

సుగు:—అమ్మా! సేవకని సిద్ధునియొద్ద నీవు నన్నొంటరిగా వదలి వచ్చితివి. అందునకై అతఁడు నన్ను గుఱించి యసభ్యములైన మాటల నాడెను.

చంద్రి:—ఏమనె నతఁడు?

సుగు:—నన్నతఁడు "ఏకాంత సుఖమునిమ్మ". "నీ నుండి తగిన సేవయే గైకొనెద" అనెను. అతఁడు కాముకుని చిత్తవృత్తిని గనబఱచుచు నామానభంగము చేయ నుంకించెను. అందుపై నాబుద్ధియంతయు నుపయోగించి, యాతని పని నింద్యమైనదని యెంతచెప్పినను బూడిదలో హోమము చేసి నట్లాయె. తుదకు నాశీల రక్షణార్థమై నేను పరుగిడి రావలసి వచ్చెను. నేను మొదలే చెప్పలేదా అతఁడొక కపటసిద్ధుఁడని? సత్వరముగ నతనిని మన యింటనుండి బంపివేయుము.

చంద్రి:—సిద్ధుఁడు కాముకుఁడైన నష్టమేమి? నీవాతనికి ప్రేమ పాత్రురాలైనచో నీరొట్టెజారి నేతిలోఁ బడి నట్లగును! పోవుదముర.

(అని చెయ్యిపట్టి రమ్మనుచుండును.)

(ప్రవేశము : పుష్పగంధి)

పుష్పగంధి:—చంద్రవదన, నమస్కారము కుశలమా?

చంద్ర:—రమ్మి; పుష్పగంధి! కూరుచుండుము. ఏమి అపరూపముగ వచ్చితివి?

పుష్ప:—ఏమి లేదు. భీమేశ్వరుని దేవాలయమునకు వచ్చియుండిన సిద్ధులు మీయింటికి భిక్షకాహ్వా నింపఁ బడియున్నారని వింటిని. వారి దర్శన మునకై వచ్చితిని.

చంద్ర:—(పుష్పగంధితో) మొన్న నీకును పద్మావతికిని కొల్లగ కనకాంబరముల నిచ్చెనట. మరల నడిగి గొంపోవలయునని వచ్చితివా యేమి?

పుష్ప:—లేదమ్మా. మరల మరల నడుగుటకు నాకే సిగ్గ గు చున్నది. వారిని దర్శించెద; ఇచ్చిన గొం పోదును. వారి మహిమ నెంత పొగడినను చాలదు!

చంద్ర:—సిద్ధులు ధ్యానమునం దున్నారు. వా రిప్పు డెవ్వరిని జూడరు. మా సుగుణ మాత్రము వారుండు గదిఁ బ్రవేశింప వచ్చును. ఏలయన, దానిని వారు తమ సేవకై కోరి యున్నారు. సుగుణవతి చాల పుణ్యము చేసినది కదా! అట్టి మహాత్ముల సేవ యొనరించుటకు!

పుష్ప:—(సుగుణవతి నుద్దేశించి) సుగుణవతి! నీనోములు పండెను పో! నీకింకేమి కొదువ!

సుగు:—(పుష్పగంధితో) నీవాడు మాటలేమో సరియే కాని, అతఁడు కపట సిద్ధుఁడైనచో?

పుష్ప:—కపటసిద్ధుఁడైన మనకింకను ననుకూలమే కదా; మనవలలో వేసికొన వచ్చును.

చంద్రి:—(పుష్పగంధి నుద్దేశించి) అదియే నేనుకూడ నొత్తి యొత్తి చెప్పుచుండుట. నామాట యనిన దానికి వెగటు. సిద్ధునిసేవఁ జేయనొల్లనను చున్నది. నీవైన బుద్ధిచెప్పుము.

సుగు:—(పుష్పగంధితో) పుష్పగంధీ! నీకు లోగుట్టు తెలియదు. చెప్పెద వినుము. నేను మనోహరుఁడను సుగుణ సంపన్నుఁడైన రాజపుత్రుని వరించి యాతని నాభర్తవలె భావించుకొని యున్నాను. అట్లుండునపుడు సిద్ధుఁడు నన్నుఁ గోరుట తటస్థించినది. నేనెట్లిందున కియ్య కొందు?

పుష్పగంధి:—(సుగుణవతి నుద్దేశించి) అయ్యో! పిచ్చి పుల్లమ్మా! వారాంగనలమైన మనకు, ఒకని మీఁదనే మనస్సా? పైకమువచ్చు మార్గము చూడవలయును. నేడు మనోహరుఁడు; రేపు

ధనదత్తుఁడు, మరునాఁడింకొకఁడు. ఆ మరునాఁడు మరియొకఁడు. ఇంతయే. నాకు పని యున్నదమ్మ. నేను పోయి వచ్చెద. (చంద్రవదనవంకతిరిగి) చంద్రవదనా! నేను పోయివచ్చెద.

చంద్ర:- మంచిది. పోయిరమ్ము.

(పుష్పగంధి నిష్క్రమించును.)

(సుగుణతో) సిద్ధు లేమరుకొనెదరో నీచర్యను గాంచి; పోయి చూచెదఁగాక.

(అని నిష్క్రమించును.)

కమల:—(సుగుణతో) సుగుణా! సిద్ధుఁడు నిన్నేమిచేసెనే?

సుగుణ:—నన్నతఁడు గవయు నుంకించెను. నే నంతలోఁ బరుగిడి వచ్చి వేసితిని.

కమల:—సిద్ధుని మాట వినరాదా? మన కేమి యెవ్వరైనను ఒకటే. సిద్ధుఁడే బాగుకదా మనోహరుని కంటె. మనోహరుఁడేమియు నియ్యఁడు. సిద్ధుఁ డన్ననో యడిగిన దాని నిచ్చును.

సుగు:—నీకు తెలియదు, కమలా. భాగ్యము ముఖ్యము కాదు. పరిశుద్ధమైన జీవనము ముఖ్యము. నా యంతరాత్మ పడుపు వృత్తి నీచమైనదని బోధించు చున్నది. స్త్రీ లందఱు మంచి శీలముగల వారైనచో దేశము వృద్ధికి వచ్చును.

కమల:—నీమాటలు నాకర్థమగుట లేదు. గొప్పగ మాట్లాడుచున్నావే! ఊరక అమ్మ చెప్పినట్లు వినక.

(అని కోపముతో నిష్క్రమించును.)

సుగు:—(స్వగతము) అయ్యో! దేవుడా! నన్నెట్టి చిక్కులో నుంచితివి! పుట్టినది లంజకులము; మనోవృత్తి యంతయు సాంసారిక లక్షణ యుక్తమై యున్నది. ఒకటి కొకటి యెట్లు పొత్తుకుదురును. నాచుట్టున నుండు వారందఱు నన్నె గర్హించెదరేకాని పడుపువృత్తి హేయమైనదని ఒక్కరికైనను స్ఫురింపలేదే! నాకు తోడునీడై యుండిన కమలకూడ శత్రుపక్షము చేరెను. నేనే తెరంగున నాశీలమును గాపాడు కొందును? ఇప్పుడు నే నీవేశ్యావృత్తిని ఖండించినగాని, నామాన ముండదు. నా యావద్బలము నుపయోగించి మానరక్షణ గావించుకొనుట కర్తవ్యమని నా యంతరాత్మ బోధించు చున్నది. నేను నాయంతరాత్మచేయు సద్బోధ ననుష్ఠింప వలయునేకాని, వీరు వారుకాని, తల్లిదండ్రులు కాని, - అయ్యో నాకు తండ్రి యెవ్వరై యుండునది యెవరికిఁ దెలియు! - స్నేహితులుకాని, చుట్టములుకాని చెప్పిన చొప్పున శిరసావహించి

నడచుకొనిన దాస్య చిత్తవృత్తి నవలంబించి
నట్లగును. అది తగునా? తగదు; తగదు. ము
మ్మాటికిని తగదు. ఈ దౌర్భాగ్యమైన భారత
భూమిలోఁ దక్కుమ రేదేశమునందును దేవదాసి
కులమొకటి వేఱుగ లేదు. మనసంఘమునం దిది
యొక గొప్ప కళంకమని యెవ్వరును దలంప
రేమొ! ఈ కళంకమును నిర్మూల మొనరింప
నాబోఁటివారు-కొందరైనను-ప్రతిన వట్టినగాని
యది పోదు. నేను ముందంజ వేసెదగాక. ఆ!
ఆ! కేవలమొక యబలనైన నే నేమి? వెయ్యా
రేండ్లనుండి నడచివచ్చిన దేవదాసికుల నిర్మూల
మన నేమి! ఇది సాధ్యమా? సాధ్యము కాదు.
లోకాభిప్రాయముకూడ నదియు...ఏల సాధ్య
ము కాకూడదు? వృద్ధులను వారి పురాతనాభి
ప్రాయములతో వదలివేసి యువజను లందఱు
దేశోద్ధరణమే ముఖ్యాశయముగ నుంచుకొని,
యిట్టి సంఘ దురాచారములను మూలోత్పాటన
మొనరింప కంకణము గట్టుకొని పనిజేసిన నెట్టి
కష్టకార్యమైనను సులభసాధ్యము కాదా? సహస్ర
దుష్టుల నడుమ నొక శిష్ట యుండుట సంభవించిన
నా సన్మార్గగామి తాను సత్పథమును వదలకుం
డుటయేగాక దుర్మార్గులను సహితము తన త్రో

వకే తిప్పుకొనుటకుఁ బ్రియత్నింప వలయునని యు, నా ప్రియత్నములో నొకవేళ ప్రాణములు గోల్పోవలసి వచ్చినను సంతోషముగ ప్రాణ ముల నర్పింపవలయు ననియు ప్రపంచ చరిత్ర లోని కొందఱి మహాత్ముల జీవితముల నుండి సువ్యక్తమగు చున్నది. ఈ మహనీయుల యా దర్శమును నేనిప్పు డనుసరించెదగాక. బంధు వర్గము బహిష్కరించనీ; స్నేహితులు విడనా డనీ; జన సామాన్యము తూలనాడనీ, ప్రాణము లనుకూడ గ్గ కొననీ; నా ప్రతిజ్ఞను నేను వద లను. శ్రీ భీమేశ్వరుఁడు నాకు సాహాయ్య మొన రించుగాత. ఓ! భీమేశ్వరా! నన్ని విషమ సమ యమునందు గాపాడవా?

(అని కంట తడిపెట్టుకొని నిష్క్రమించును.)

(యవనిక జారును.)

## పంచమాంకము : చతుర్థ రంగము

[సుగుణవతి శయ్యాగృహము నందామె మంచముపై బరుండి యుండును.]

(ప్రవేశము : చంద్రవదన సిద్ధులు)

చంద్రవదన:—(సిద్ధునితో) అది నిదురఁబోవు చున్నది. మీరిచ్చటనే యుండి మీ కార్యమును గొనసాగించుకొనుఁడు. నేను పోయివచ్చెద.

(నిష్క్రమించును.)

సిద్ధుఁడు:—సుగుణ ! లెమ్మా.

(దానిపైఁ జేయి యుంచును.)

సుగు:—(గ్రక్కున మంచముడిగ్గి యొక ప్రక్క నిలిచి) సంయమీంద్రులేలొకో యీ నిశా సమయమున నొంటరిగ నేను నిద్రించుగది కేతెంచి యున్నారు. "ఏకాంత సేవను" జ్ఞప్తికిఁ దెచ్చుకొని పరుగిడి వచ్చిరి కాబోఁలు !

సిద్ధు:—నీకు తెలియని దేమున్నది ? ఆ !........, నేను కళోపాసకుండను. నీ సౌందర్యాతిశయములను జూచిన దాదిగా నీపై నాకొక వింతప్రేమ యంకురించినది. నీవు చాల మధురముగ పాడుదువని వింటిని. ఒక్క పాట పాడుమా—విందము—అభినయముతో, రసోద్రేకము గలుగునట్లు.

సుగు:- ఈ మధ్యరాత్రములో నా నీకళోపాసన? ఏకాంత మున నిద్రించుచుండు స్త్రీ శయ్యాగృహములో!

సిద్ధు:- కళారాధనకు నియమిత కాలములుగాని స్త్రీ పురుష భేదములుగాని లేవు. ఎప్పుడు మనస్సునకు స్ఫురించిన నప్పుడే. కళలకు—ముఖ్యముగా శృంగార కళలకు—బుట్టినిల్లయిన మీబోంట్లు వేశ్యలు ధన్యలు!

సుగు:- నాట్యగానాది కళలపై మాకెక్కు. డభిమాన ముండిన మా కులమునకును వానికిని ముడివేయ నగునా? మీకు జ్ఞానము ముదిరి నట్లున్నది! కళల నెవ్వరైనను నభ్యసింప వచ్చునుగదా.

సిద్ధు:- మీవృత్తి కవి సహకరించు ననుటలో నెట్టి సందేహమును లేదు. నీకా యనుభవ మింకను లేదేమో!

సుగు:- నాకులేదు. నీ కనుభవ వేద్యమై యుండవచ్చును.

సిద్ధు:- నేనును విటవృత్తికి నూతనాగంతుకు డనే. మీతల్లి నడుగ వలయును.

సుగు:- మాతల్లి ధన పిశాచగ్రస్థయై ఒడలు నమ్ము కొనుటకిచ్చగించినను, నీ వామెకంటె నుత్త ముఁడు కాకపోయితివి కదాయని విచారింపవలసి యున్నది. మాయమ్మ తెలియని మూఢురాలు

అబల. నీవన్ననో, సర్వమును తెలిసిన సిద్ధపుంగ
వుఁడవే! నీ బాళింతకు వచ్చెనా! తుదకు.

సిద్ధు:-నీకెవరో దురభిప్రాయములు తల కెక్కించి యు
న్నారు. వయఃపరిపాకమున నీకంతయుఁ దెల్ల
మగును. వేశ్యావృత్తి, వేశ్యాకులము, సంఘ
మునకు బునాది రాయివంటివి. వేశ్యలు నశించిన
నాట్యగానాది కళలుకూడ నశించును.

సుగు:-ఏమి విచిత్రతత్వములు! కళలమాట వేఱు,
వేశ్యావృత్తిమాట వేఱు. ఒకటి మన్నింపదఁగి
నది, ఇంకొకటి బహిష్కరింపఁ దగినది. ఒకటి
యాధ్యాత్మిక తత్వాయుక్తమైనది, ఇంకొకటి పశు
వ్యాపారవర్గములో చేరినది. కాన రెంటిని జం
టగా భావింపవలదు. మీకు వయస్సు వచ్చినది
సార్థకమాయెను!

సిద్ధు:-నీమాటలు నాకు బోధపడవు. గాన సాహి
త్యాది కలళను సంసారికు లభ్యసింప వచ్చును-
ప్రదర్శింపవచ్చును, కూడను. అయిన నభినయ
ములతోఁ గూడిన నాట్యాదుల నుత్తమ కులజలు,
సాంసారికులునేర్చి, నేర్చినను పదిమందిలోఁ బ్రద
ర్శింపను సాధ్యమా?

సుగు:-ఏల సాధ్యములేదు! మున్ను నాట్యము దేవత

లకు సహితత మభిమానకళగా నుండలేదా? దేవతలలో నీశ్వరుఁడు, పార్వతి, శ్రీకృష్ణుఁడు, లక్ష్మి మున్నగు వారును, రాజ కన్యకలలో నుష, ఉత్తర, మాళవిక మున్నగువారును నాట్యాది కళలలో బరిపూర్ణులై యుండిరనియు, వానిలో నానందమగ్నులగు చుండిరనియు దెలియవచ్చుట లేదా? దేవదాసీ జనలోకవేళ ఈ కళల నభ్యసించి ప్రదర్శించినను వారు వ్యభిచరింపక యుండవచ్చును. అట్లు భావించు వారిలో నేనొకతె.

సిద్ధు:- దేవదాసీలకు వ్యభిచారము కులవృత్తికాన అదెట్లు చులకనగా చూడనగును. ఇంకను నీకు ప్రపంచ జ్ఞాన మలవడ లేదు. క్రమేణ తెలియును. అయ్యో! చేలా!

(అని ఫక్కున నవ్వును.)

సుగు:- వేశ్యావృత్తి హేయమైనదని నా యంతరాత్మ బోధించుచున్నది. అంతఃపరిశీలనము నొకించుక గావించుకొమ్ము, నీకును తెలియును.

సిద్ధు:- ఓహో! "అంతరాత్మ" "అంతఃపరిశీలనము"- గొప్ప గొప్ప మాటల నాడుచున్నావే! ఎవ్వరు నేర్పిరి ఈమాటలు నీకు?

సుగు:- మీరు "కళోపాసన "కళారాధన" మున్నగు పెద్ద పెద్ద మాటలు వేయుచున్నారే? ఈ మాట

లే నిఘంటువు నుండి సంగ్రహించితి రండీ, మీరు? కేవలము పశు సౌఖ్యముమీద లక్ష్యము నుంచుకొని తర్కించుచున్నారే కాని, పశువుల నుండి ప్రత్యేకించు మానవ స్వభావమైన అంతరాత్మ సద్బోధను గలిగి యుండుట, తదాచరణాకాంక్ష, మున్నగునవి నాకును నుండవచ్చునని మీ మనస్సునకు రాలేదు కాఁబోలు! కొంచెము యోచింపుడు.

సిద్ధు:—(స్వగతము) ఎట్లు పలుకరించినను త్రోవకు రాకయున్నది. (ప్రకాశముగ) విదుషీమణీ! ప్రపంచమునందు తల్లికంటె హెచ్చైన వారెవ్వరును లేరు. మాతృవాక్య పరిపాలన మొనరింతువా లేదా? నిన్నుకని, పెంచి, పెద్దచేసిన నీ శ్రేయోభిలాషిణియైన నీతల్లిని తృణీకరింప వలదు. నీచర్య నీతియుక్తమైనదేమో యించుక యోచింపుము.

సుగు:—చాలును. నీ నీతు లొకింత గట్టిపెట్టుము. నీ వేషమేమి? నీమాటలేమి? ఎందఱెందఱి నిట్లు మోసగించి యున్నావో! కళలట! కళోపాసకుఁడట! అంతయు బూటాటకమే!

సిద్ధు:—కళల మాటలట్లుండనీ. నీతో నేనెందుకు వాదులాడ వలయును. ఆమాటల నందే వదలి

వేయుము. ఎట్లైన చేసి నన్ను నీవానినిగా జేసి కొనుము. కటాక్షింపుము.

(అని సుగుణవతిని సమీపించి చేయిపట్టుకొనఁ బోవును. సుగుణవతి తప్పించుకొని తలుపు తీసికొని వీధి గుమ్మమునఁబడి పరుగిడి పోవును.

సిద్ధు:—(బిగ్గరగా) సుగుణవతీ! సుగుణా! ఆగుమాగుము. మీాయమ్మ పిలుచుచున్నది.

(సుగుణవతి యదృశ్యమగును)

(సిద్ధుఁడు తనలో) అయ్యో! నేనేల నాఁడింద్రుని సభకుఁ బోయితి? పోయితిఁబో మన్మథునితో నేల పందెము వేసికొంటిని? వేసికొంటినిబో, ఈయువిద యేల నాకు విరసము జూపవలయును? చూపెఁబో, నేనేల నాబాహుబలమునైన నుపయోగించి సాధింపనైతి? ఆ! అట్లు చేయుట తగదు. పశుబలము నుపయోగించి గెలిచినను సోలినట్లేకదా! ఇచట విలపించిన ఫలమేమి? చంద్రవదన సాహాయ్యము నపేక్షించి కార్యసాధన ప్రయత్నమునకు బూనుకొనెద గాక. అబ్బా! కుబేరునికి దేవలోకచ్యుతియా! ఎంతటి నగుబాట్లకు గురియగుదునో కదా!

(నిట్టూర్పుతో నిష్క్రమించును.)    (యవనిక జారును.)

## పంచమాంకము: పంచమరంగము

[భీమేశ్వర దేవాలయమున దేవుని యెదుట నిలిచి మనో హారుఁడీరీతి విలపించుచుండును.]

మనో:—భీమేశ్వరా! తుదకు నాకుఁ బరాభవమే తెచ్చి పెట్టితివా?

ఉ. "ఎన్నడుపోని యింద్రసభ
కేటికిఁబోయితి పోయి యంతలో
నున్నత బుద్ధిమై గలసి
యుండగ నేరక వచ్చి యూరకే
కిన్నరనాథుతోఁడ గమ
కించితి యేల ప్రతిజ్ఞ చాలు నిం
కెన్నికమీఱ నాకమున
కేగుటగాదు దలంచి చూచినన్."

ఓ భీమేశ్వర! నిన్నైన్నను గొల్చి నీసాన్నిధ్య మును బడయుదునుగాక.

సీ. "విషమ లక్ష్యంబులై వినువీధి జరియించు
త్రిపురంబులను సంహరించి నావు;
భువనభీషణ మహాద్భుత విషానలము
భక్షించి లోకముల రక్షించినావు;
భయదోగ్రతరమైన లయకాల మృత్యువు
నెరయుగూపడగించి నిలచినావు;

విధి విరించ్యాదులు వెతకి కానగలేని
తత్త్వమై పొడవున తనరినావు;
సురలు నసురలు సంయమీశ్వరులు జేరి
కొలువ నన్నియు నీవయై వెలసినావు;
సూక్ష్మ శ్రీదక్షవాటీశ్వరుండు హరుడు
శాశ్వతోన్నతమూర్తి భీమేశ్వరుండు."

(ప్రవేశము: సుగుణవతి, భయ సంభ్రమములతో)

సుగు:—ప్రాణేశ్వరా! భీమేశ్వరుని కృపచే మాయమ్మ పన్నిన మాయాజాలము నుండియు, సిద్ధుని బారి నుండియు నేడు తప్పించుకొని రాగలిగితిని. సిద్ధుడు వేషధారియైన విటవర్గమునకు జేరినవాడే. తన ధన ప్రదర్శనముచే నన్ను వశముచేసికొన బ్రయత్నించెను.

మనో:—ధనమువచ్చుచోట చెవులు జోలె వేయుదువని భావించి యుంటిని. అదియునుంగాక, మీ యమ్మ భీకరాకృతిఁ జూచిన నెట్టి వానికిని గుండె లావలించును. అందుచే నీయాశ వదలుకొని యుంటిని.

సుగు:—నేను వేశ్యకులజనైనను జన్మనాఁటి నుండి యా వృత్తిపై నాకు జుగుప్సయే. మిమ్మునుఁ దక్క యితరులను నేను కన్నెత్తియైన జూడను. నా సత్ప్రవర్తన కీభీమేశ్వరుఁడే సాక్షి.

మనో:—వేశ్యలందఱు నిస్పృహమునే యవలంబించిన మన భారతమాతయందు కళంకములలో నొక్కటి రూపు మాసిపోవును. మన కలయికకుఁ గారణ కర్తయైన శ్రీమహేశ్వరుని స్తుతింతుము గాక.

(ఇద్దఱు నేకకంఠముతో)

శ్లో. "వందే శంభు ముమాపతిం సురగురుం
వందే జగత్కారణం
వందే పన్నగ భూషణం మృగధరం
వందే పశూనాంపతిం
వందే సూర్యశశాంక వహ్నినయనం
వందే ముకుంద ప్రియం
వందే భక్తజనాశ్రయంచ వరదం
వందే శివం శంకరం"

(ప్రవేశము: చంద్రసేన సిద్ధులు)

చంద్ర:—(ఉగ్రాకృతితో సుగుణావతి నుద్దేశించి) ఓసీ! దుర్మార్గురాలా! నీసాహస మేమన వచ్చును! ఒక్కతెయే యీరాత్రివేళ ఇల్లు వదలి వచ్చుటకు నీకెంత ధైర్యము! నీకెంత స్వతంత్రము! నానుండి తప్పించుకొని నీ మనోహరునితోఁ బారిపోవ నెంచుచున్నావు కాబోలు. అది నేను కానిత్తు ననుకొంటివా? నా ప్రాణములుపోయిన

పోని; నిన్ను నేను వదలను. మనోహరునితో నిన్నుఁ జేర నియ్యను.

(అని సుగుణవతి చెయ్యిపట్టుకొని లాగుచుండును. సుగుణవతి శోకించుచుండును.)

**సుగు:**—అయ్యో! భీమేశ్వరా! ఈరక్కసి బారి నుండి నన్నుఁ గాపాడవా?

(అని బిగ్గరగా నఱచును అప్పుడు భీమేశ్వరుఁడు ప్రత్యక్షమై)

**భీమేశ్వరుఁడు:**—(ప్రజ్వలత్కాంతితో) సుగుణవతి! నీ నిశ్చల పవిత్రమైన ప్రేమను జూచి నేను మెచ్చితిని. నీవు నీ మనోహరుని బరిణయమై సుఖముగ వర్ధిల్లుము.

(అని దీవించి యంతర్ధాన మగును. చంద్రవదన దిగ్భ్రమ చెంది సుగుణవతి చెయ్యివదలి, చేతులు మొగిడ్చి భయభక్తులఁ గనబఱచుచు నిలుచబడి యుండును. కుబేర మనోహరులును కరకమలములను జేర్చి నిలువఁ బడుదురు.

**చంద్ర:**—(సుగుణవతి నుద్దేశించి) సుగుణ! నీమూలమున శ్రీ భీమనాథుని ప్రత్యక్ష దర్శనభాగ్యము నేడు నాకబ్బెను. నాతప్పులను మన్నింపుము. నీవు మనోహరుని బెండ్లియాడి సుఖముగ నా యింట నుండుము. లోకమునకు నీవు మార్గదర్శకురాలవయి యుండెదవుగాక.

(శ్రీ భీమేశ్వరునికి దండ ప్రణామం బొనరించి లేచి నిలిచి) ఓ! భీమేశ్వరా! నేను పాపిని. చేయరాని

పనులఁజేసి, యాడరాని మాటలనాడి నీచవృత్తి లో నా బ్రతుకంతయుఁ గడపితిని. ఇఁక మిగిలిన కించిజ్జీవిత భాగమునైన నీసేవలోఁ గడపెదను. పశుప్రవృత్తిని మానుఁడని నాతోడి వారకాంతలకెల్ల బోధించెదను.

సిద్ధుఁడు:—(చంద్రవదన నుద్దేశించి) చంద్రవదనా! నే నిఁకబోయి వచ్చెద. (సుగుణవతి నుద్దేశించి) సుగుణవతి! నీ వబలవయ్యు దైవబలముచే సబలవై వెలయుచున్నావు. నీపంతము నందు జయమందినందునకు నాకు సంతోషము. నన్ను క్షమింపుము. నేను పోయి వచ్చెద.

సుగు:—నిన్ను క్షమించుటకు నేనెవ్వరు? ఆ భీమేశ్వరుని క్షమింపుఁడని వేఁడుము.

సిద్ధుఁడు:—శ్రీ భీమేశ్వరా! నన్ను క్షమింపుము. ధనబలముకంటె నైతికబలమే మిన్నయని నాకిప్పుడనుభవవేద్య మాయెను. (సుగుణవతి నుద్దేశించి) సుగుణవతీ! నీవు సార్థక నామధేయురాలవు. సుఖముగ వర్ధిల్లుము. పోయి వచ్చెద.

(అని నిష్క్రమించును.)

మనోహరుఁడు:—భీమేశ్వరా! నీ విన్ని కార్యములను సిద్ధింపఁ జేసితివి. ఈ భరత వాక్యమునుగూడ సిద్ధింపఁ జేయుము.

వేయుము. ఎల్లైనచేసి నన్ను నీవానినిగా జేసి
కొనుము. కటాక్షింపుము,

(అని సుగుణవతిని సమీపించి చేయిపట్టుకొనఁ బోవును. సుగు
ణవతి తప్పించుకొని తలుపుఁ దీసికొని వీధి గుమ్మమునఁబడి పరు
గిడి పోవును.

సిద్ధు:—(బిగ్గరగా) సుగుణవతీ! సుగుణా! ఆగుమాగుము.
మీాయమ్మ పిలుచుచున్నది.

(సుగుణవతి యదృశ్యమగును )

(సిద్ధుఁడు తనలో) అయ్యో! నేనేల నాఁడింద్రుని సభకుఁ
బోయితి? పోయితింబో మన్మథునితో నేల పం
తము చేసికొంటిని? చేసి కొంటినిబో, ఈయు
విదయేల నాపై విరసము జూపవలయును?
చూపెఁబో, నేనేల నాబాహుబలమునైన నుప
యోగించి సాధింపనైతి? ఆ! అట్లు చేయుట
తగదు. పశుబల ముపయోగించి గెలిచినను
సోలినట్లేకదా! ఇచట విలపించిన ఫలమేమి?
చంద్రవదన సాహాయ్యము నపేక్షించి కార్య
సాధన ప్రయత్నమునకు బూనుకొనెద గాక.
అబ్బా! కుబేరునికి దేవలోకచ్యుతియా! ఎంతటి
నగుబాట్లకు గురియగుదునో కదా!

(నిట్టూర్పుతో నిష్క్రమించును.)		(యవనిక జారును.)

## పంచమాంకము:        పంచమరంగము

[భీమేశ్వర దేవాలయమున దేవుని యెదుట నిలిచి మనో
హరుఁడీరీతి విలపించుచుండును.]

మనో:—భీమేశ్వరా! తుదకు నాకుఁ బరాభవమే తెచ్చి
పెట్టితివా?

ఉ. "ఎన్నఁడుపోని యింద్రసభ
కేటికిఁబోయితి పోయి యంతలో
నున్నత బుద్ధిమై గలసి
యుండగనేరక వచ్చి యూరకే
కిన్నరనాథుతోఁడ గమ
కించితివేల ప్రతిజ్ఞ చాలు నిం
కెన్నికమీఱ నాకమున
కేగుటగాదు దలంచి చూచినన్."

ఓ భీమేశ్వర! నిన్నెన్నఁడును గొల్చి నీసాన్నిధ్య
మును బడయుదునుగాక.

సీ. "విషమ లక్ష్యంబులై వినువీధి జరియించు
త్రిపురంబులను సంహరించి నావు;
భువనభీషణ మహాద్భుత విషానలము
భక్షించి లోకముల రక్షించినావు;
భయదోగ్రతరమైన లయకాల మృత్యువు
నెరయుకూపడగించి నిలచినావు;

విధి విరించ్యాదులు వెతకి కానగలేని
తత్త్వమై పొడవున తనరినావు;
సురలు నసురలు సంయమీశ్వరులు జేరి
కొలువ నన్నియు నీవయై వెలసినావు;
యూథి శ్రీదక్షవాటీశ్వరుండు హరుఁడు
శాశ్వతోన్నతమూర్తి భీమేశ్వరుండు.*

(ప్రవేశము: సుగుణవతి, భయ సంభ్రమములతో)

సుగు:—ప్రాణేశ్వరా! భీమేశ్వరుని కృపచే మాయమ్మ పన్నిన మాయాజాలము నుండియు, సిద్ధుని బారి నుండియు నేడు తప్పించుకొని రాఁగలిగితిని. సిద్ధుఁడు వేషధారియైన విటవర్గమునకు జేరినవాడే. తన ధన ప్రదర్శనముచే నన్ను వశముచేసికొన బ్రయత్నించెను.

మనో:—ధనమువచ్చుచోట చెవులు జోలె వేయుదువని భావించి యుంటిని. అదియునుంగాక, మీ యమ్మ భీకరాకృతిఁ జూచిన నెట్టి వానికిని గుండె లావలించును. అందుచే నీయాశ వదలుకొని యుంటిని.

సుగు:—నేను వేశ్యకులజనైనను జిన్ననాఁటి నుండి యా వృత్తిపై నాకు జుగుప్సయే. మిమ్ముఁదక్క యితరులను నేను కన్నెత్తియైన జూడను. నా సత్ప్రవర్తన కీభీమేశ్వరుఁడే సాక్షి.

మనో:—వేశ్యలంపటులు నీ సహాయమునే యవలంబించిన మన భారతమాతకుండు కళంకములలో నొక్కటి రూపు మాసిపోవును. దాన కలియికకుఁ గారణ కర్తయైన శ్రీభీమేశ్వరుని స్తుతింతుము గాక.

(ఇద్దరు ఏకకంఠముతో)

శ్లో. "వందేశంభు ముమాపతిం సురగురుం
వందే జగత్కారణం
వందే పన్నగ భూషణం మృగధరం
వందేపశూనాంపతిః
వందే సూర్యశశాంక వహ్నినయనం
వందే ముకుంద ప్రియం
వందే భక్తజనాశ్రయంచ వరదం
వందేశివం శంకరం"

(ప్రవేశము: చంద్రికవన సిద్ధులు)

చంద్రి:—(ఉగ్రాకృతితో సుగుణవతి నుద్దేశించి) ఓసీ! దుర్మార్గురాలా! నీసాహస మేమన వచ్చును! ఒక్కతవయే యీరాత్రివేళ ఇల్లు వదలి వచ్చుటకు నీకెంత ధైర్యము! నీకెంత స్వతంత్రము! నానుండి తప్పించుకొని నీ మనోహరునితోఁ బారి పోవ నూహించు చున్నావు కాబోలు. అది నేను కానిత్తు ననుకొంటివా? నా ప్రాణములుపోయిన

పోని ; నిన్ను నేను వదలను. మనోహరునితో నిన్నుఁ జేర నియ్యను.

(అని సుగుణవతి చెయ్యిపట్టుకొని లాగుచుండును. సుగుణవతి శోకించుచుండును.)

సుగు:—అయ్యో ! భీమేశ్వరా ! ఈరక్కసి బారి నుండి నన్నుఁ గాపాడవా ?

(అని బిగ్గరగా నఱచును అప్పుడు భీమేశ్వరుఁడు ప్రత్యక్షమై)

భీమేశ్వరుఁడు:—(ప్రసన్నలతాకాంతితో) సుగుణవతి ! నీ నిశ్చల పవిత్రమైన ప్రేమను జూచి నేను మెచ్చితిని. నీవు నీ మనోహరుని బరిణయమై సుఖముగ వర్ధిల్లుము.

(అని దీవించి యంతర్ధాన మగును. చంద్రవదన దిగ్భ్రమ చెంది సుగుణవతి చెయ్యివదలి, చేతులు మొగిడ్చి భయభక్తులఁ గనబఱచుచు నిలుచబడి యుండును. కుబేర మనోహరులును కరకమలములను జేర్చి నిలువఁ బడుదురు.

చంద్ర:—(సుగుణవతి నుద్దేశించి) సుగుణ ! నీమూలమున శ్రీ భీమనాథుని ప్రత్యక్ష దర్శనభాగ్యము నేడు నాకబ్బెను. నాతప్పులను మన్నింపుము. నీవు మనోహరుని బెండ్లియాడి సుఖముగ నా యింట నుండుము. లోకమునకు నీవు మార్గ దర్శకురాలవయి యుండెదవుగాక.

(శ్రీ భీమేశ్వరునికి దండ ప్రణామం బొనరించి లేచి నిలిచి) ఓ ! భీమేశ్వరా ! నేను పాపిని. చేయరాని

పనులఁజేసి, యూడరాని మాటలనాడి నీచవృత్తి లో నా బ్రతుకంతయుఁ గడపితిని. ఇఁక మిగిలిన కించిజ్జీవిత భాగమునైన నీసేవలోఁ గడపెదను. పడుపువృత్తిని మానుఁడని నాతోడి వారకాంతలకెల్ల బోధించెదను.

సిద్ధుఁడు:—(చంద్రవదన నుద్దేశించి) చంద్రవదనా! నే నిఁకబోయి వచ్చెద. (సుగుణవతి నుద్దేశించి) సుగుణవతి! నీ వబలవయ్యు దైవబలముచే సబలవై వెలయుచున్నావు. నీపంతము నందు జయమందినందునకు నాకు సంతోషము. నన్ను క్షమింపుము. నేను పోయి వచ్చెద.

సుగు:—నిన్ను క్షమించుటకు నేనెవ్వరు? ఆ భీమేశ్వరుని క్షమింపుఁడని వేడుము.

సిద్ధుఁడు:—శ్రీ భీమేశ్వరా! నన్ను క్షమింపుము. ధనబలముకంటె నైతికబలమే మిన్నయని నాకిప్పుడనుభవవేద్య మాయెను. (సుగుణవతి నుద్దేశించి) సుగుణవతీ! నీవు సార్థక నామధేయురాలవు. సుఖముగ వర్ధిల్లుము. పోయి వచ్చెద.

(అని నిష్క్రమించును.)

మనోహరుఁడు:—భీమేశ్వరా! నీ విన్ని కార్యములను సిద్ధింపఁ జేసితివి. ఈ భరత వాక్యమునుగూడ సిద్ధింపఁ జేయుము.

భరత వాక్యము.

గీ. వెలవెలంది వృత్తి యిలలోన హేయంబు
దాని రూపుమాప ధైర్యమూని
పాటు పడుడు మీరు భారత పుత్రులు
దేవుఁ డెపుడు మీకుఁ దేజుఁ గూర్చు.

(సంపూర్ణము.)

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 1 | 12 | సభాస్థారుల | సభ స్తారుల |
| 14 | 15 | సోమయ్యాను | సోమయ్యలును |
| 16 | 13 | ఇళ్లే | ఇళ్లేల |
| 2) | 6 | వరింపకుండ | వరింపకుండనుండ |
| 22 | 10 | మిరమిట్లు | మిఱుమిట్లు |
| 25 | 1 | యూరు | ఊరు |
| 39 | 1 | చిత్రవైఖరి | చిత్రవైఖరి |
| 43 | 4 | మిరమిట్లు | మిఱుమిట్లు |
| 47 | 7 | మీాకరుణతో | మీారుకరుణతో |
| 47 | 6 | యింటికిని దగ్గిర | యింటికి దగ్గఱ |
| 48 | 17 | భ్రమసితి | బ్రమసితి |
| 49 | 6 | వాళ్లందరు | వాళ్లందఱు |
| 46 | 3 | లేని | లేక |
| 66 | 4 | ఖచిత ఆభరణ | ఖచితమైన యాభరణ |
| 70 | 11 | ఫలారమును | ఫలాహారమును |
| 73 | 4 | గడింపక | గడింపఁగ |
| 75 | 8 | నీవు సెప్పు | నీవుఁజెప్పు |
| 79 | 7 | నేనా | సేవా |

Mr. Nanjunda Rao has used poetry in places. A few of the verses decidedly show that the author has a good flow. ...................... .......... ......................

In the employment of prose Mr. Nanjunda Rao has followed the tradition set up by the late Vedam Venkataraya Sastry and has employed colloquialism in places. If, however, the author had avoided making Gods his characters, he might have had more facility for the use of the spoken dialect and he would have been truer to his own expressed desire to depict common life. Even in the case of a character like Sugunavathi, who is cultured and polished, the use of the Grandhic style, though in keeping with the said tradition seems a little too pedantic.

Fairly standardised colloquy would seem to be proper.

**" The Hindu. "**

——o——

# కుబేర పతనము.

—o—

శ్రీయుత హోసూరు నంజుండరావు, బి.ఏ., గారిచే రచింపబడిన యీ 'సాంఘిక' నాటకము మాకు హృదయానంద దాయకముగ నున్నది. సాంఘికమనగా స్వసంఘదూషణ పరాయణత్వమను దుర్భ్రమ నిదిచాలవరకు తొలగించఁగలదు. స్వర్గములో ఇంద్రునిదర్బారు, ద్రాక్షారామములో భీమేశ్వరుని దర్శనము అను రెండుమినహా భౌతికప్రకృతి కతీతములగు సద్భూతము లిందెవ్వియును లేవు. ఇవిమార్చి వేరొండువిధముగ వ్రాసినను కథాపరిణామమున కెట్టిభంగమును వాటిల్లదు. కవిగారి చేతిలో యీసందర్భములు కూడా (భారతీయ భావము ప్రకారము) ఎంతో సహజమై స్వర్గమర్త్యములకు సోపానములవలె నున్నవి. కాని, సాధారణులచేతిలో అసహజమై, విపరీతములవలె మారుట కవకాశమున్నది. నాటకములలో ఇట్టి అద్భుతములకు తావే లేదన్నవాదముతో మేమేకీభవించము. షేక్స్పియరు కాళిదాసాదులలోగూడ ఇట్టిచర్యలు గాననగును. సాహిత్యదృష్ట్యా దానిని ప్రశంసించినవారే కాని అధిక్షేపించిన విమర్శకులు లేరు.

సామాన్య స్త్రీలుతప్ప ఉత్తమయిల్లాండ్రు ధనమునే ఎఱగాగొని మానము నెగురువేసుకొనరని కుబేరపతనమును, సుగుణవతి విజయమును ఎల్లరికిని ధృఢపరచుచున్నవి. మఱియు మానగౌరవము సంసారస్త్రీలకు మాత్రమే సర్వస్వామ్యము గాక కళా ఉపాసనాజీవులై వారకాంత లనబడువారికి గూడ ధ్యేయమైనదనియు, అజ్ఞానులగు వేశ్యమాతల శిక్షణము, పోరాటము ఇంట్లోలేకున్నచో ఎట్టి సుందరియు ఆ జీవనము ఏకపురుష సహవాసముతో ధన్యతగాంచగలదనియు కథ యొక్క ఉపదేశము. మనసంఘము కొందరు స్త్రీలకు జారిణీ జీవనము, కొందరికి విద్యావిహీన దాస్యజీవనము విధించుచున్న దనియు, దీనిని తొలగించవలెనన్న పాశ్చాత్యవనితల మార్గముల దొక్కి సంఘవిప్లవమార్గముల నవలంబించవలెననియు నెవ్వరును నిస్పృహ పొందనక్కరలేదు. భారతసంఘములో స్త్రీలస్థితి మిగుల హీనాతిహీనమనుభావము నిరాధారమనియు, పూర్వమునకు ఇప్పటికిగూడ వైదికగార్హస్థధర్మమునకామెయే ఆటపట్టనియు, ఈధర్మసాధమునుండి కుబేరోపాసనకు (ధనారాధనకు) చిత్తగించి తొలుదొల్త భారతీయ పురుషులును పిమ్మట వారితోబాటు భారతీయస్త్రీలును పడిపోవుటవలననే యిట్టి అజ్ఞానములు, అల్పత్వభావములు, విప్లవభావములు మన నావేశించినవనియు, ఈనిజమైన జ్ఞానము మనకుదయము

కాగానే సుగుణవతివంటివారి చర్యలను సంఘవిప్లవచర్యలుగా గాక, సనాతనధర్మోద్ధరణ చర్యలుగా మనము గ్రహింతుమనియు, శ్రీయుత యన్. కె. వెంకటేశం పంతులుగారు వ్రాసిన సుందరమగు వ్యాఖ్యానము మనచిత్తములకెంతయు ఉత్తేజమును గలిగింపకమానదు. ఇతర సాంఘికనాటకములను వ్రాయబూనువారు ఈ సందేశముల గుర్తించుకొని జాతీయ సంఘగౌరవమునకు భంగముకాని రీతిని తమరచనలు సాగించి ప్రజాప్రశంసలను జూరగొందురుగాక! కవిగారు ప్రత్యేకముగ ఇట్టి నాటకములు వ్రాయునర్హతను స్థిరపరచుకొన్నారనియు వారు మున్ముందు వ్రాయబోవు నాటకములలో యీ బీజము వర్ధిల్లగలరనియు ఆసించుచున్నాము. శైలిగ్రామ్యముకాని గ్రాంధికమును కాక, గ్రాంధికమైన వ్యావహారికమునునై అనుకరణయోగ్యమైనది.

"గృహలక్ష్మి"

**ಕುಬೇರ ಪತನವು:**—ನಾಟಕಕಾರರು: ಶ್ರೀ ಹೊಸೂರು ನಂಜುಂಡಯ್ಯನವರು ಬಿ. ಎ., ಕ್ರೌನ್ ೧/೮ ಪುಟಗಳು ೧೦೩, ಬೆಲೆ ೮ ಆಣೆ ಮಾತ್ರ.

ಕುಬೇರಪತನವು ಎಂಬುದೊಂದು ಐದಂಕದ ನಾಟಕವು ತೆಲುಗು ಭಾಷೆಯಲ್ಲಿ ರಚಿತವಾಗಿರುವುದು. ಈ ನಾಟಕವು ರಾಮಾಯಣ ಭಾರತ, ಭಾಗವತಾದಿ ಪುರಾಣ ಗ್ರಂಥಗಳ ಗುಂಪಿಗಾಗಲಿ ಐತಿಹಾಸಿಕ ಗ್ರಂಥಗಳ ಗುಂಪಿಗಾಗಲಿ ಸೇರಿದ್ದಲ್ಲ. ನಮ್ಮ ದೇಶದ ಸ್ತ್ರೀಸಮೂಹದೊಂದಂಗವಾದ ದೇವದಾಸಿಯರ ದುಷ್ಟದುರಾಚಾರವನ್ನು ಖಂಡಿಸಿ ಈ ಪದ್ಧತಿಯ ಪರಿಣಾಮವಾಗಿ ಸಮಾಜದಲ್ಲಿ ಎತೆಂತಹ' ಅನಾಹುತಗಳು ನಡೆಯುವುದೆಂಬುದನ್ನು ವಾಚಕರ ಮುಂದಿಟ್ಟಿರುವರು. ಪ್ರಾಚೀನಕಾಲದಲ್ಲಿ ದೇವದಾಸಿಯರಿಂದ ನಾಟ್ಯ, ನೃತ್ಯ, ಗೀತ ಕಲೆಗಳು ಹೇಗೆ ಅಭಿವೃದ್ಧಿ ಹೊಂದುತ್ತಿದ್ದವು, ಅವರಿಗೆ ರಾಜಸ್ಥಾನದಲ್ಲಿ ಎಂತಹ ಗೌರವ ಮರ್ಯಾದೆಗಳಿದ್ದವು, ಇಂದವರ ಪರಿಸ್ಥಿತಿಯು ಏನಾಗಿದೆ? ಹೇಗಾಗಿದೆ? ಅವರ ಅಧಃಪತನಕ್ಕೆ ಕಾರಣರಾರು? ಕಾರಣವೇನು? ಎಂಬುದನ್ನು ವಿಶದವಾಗಿ ಚಿತ್ರಿಸಿರುವರು. ನಾಟಕ ಕರ್ತರು ಈ ಕಲಾವಿದರ ಶೀಲವನ್ನೂ ಅವರ ಕುಲದ ಉತ್ತಮ ಧ್ಯೇಯವನ್ನೂ ಪ್ರತಿಪಾದಿಸಿ, ಸಂಗೀತ, ನೃತ್ಯ, ನಾಟ್ಯ ಕಲೆಗಳಲ್ಲಿ ಅದ್ವಿತೀಯ ಪ್ರೌಢಿಮೆಯನ್ನು ಪಡೆದು ಸ್ತ್ರೀ ಧರ್ಮನಿರತಳಾದ "ಸುಗುಣವತಿ" ಯೆಂಬೊಬ್ಬ ಗಣಿಕಾರತ್ನವನ್ನು ನಿರ್ಮಿಸಿ ಅವಳನ್ನೇ ಕಥಾನಾಯಕಿಯನ್ನಾಗಿ ಮಾಡಿರುವರು. ಇವಳನ್ನು ವರಿಸಲು ಬಂದವರಲ್ಲಿ ಕುಬೇರನಂತಹ ಶ್ರೀಮಂತನೊಬ್ಬನು, ಸುಗುಣನಾದ ಸುಂದರನೊಬ್ಬನು. ಇವರಿಬ್ಬರಲ್ಲಿ ಈ ರಮಣಿಯು ಯಾರನ್ನು ವರಿಸುವಳೆಂಬುದರ ವಿಷಯದಲ್ಲಿ ದೇವೇಂದ್ರನ ಸಭೆಯಲ್ಲಿ ಚರ್ಚೆ. ಕುಬೇರ ಮತ್ತು ಮನ್ಮಥನ ಸ್ಪರ್ಧೆಯು ಭೂಲೋಕದಲ್ಲಿ. ಸುಗಣವತಿಯು ಮನ್ಮಥನನ್ನೇ ವರಿಸುವಳು, ಕುಬೇರನು ಸೋಲನ್ನೊಪ್ಪಿಕೊಳ್ಳುವನು.

ಭಾಷೆಯು ಸರಳವಾಗಿಯೂ, ಕಥಾಭಾಗವು ಸ್ವಾರಸ್ಯವಾಗಿಯೂ ಇರುವುದು. ಇದಕ್ಕೆ ರಾಜಮಹೇಂದ್ರವರದ ಗೌರ್ನ

ಮೆಂಟು ಕಾಲೇಜಿನ ಇಂಗ್ಲೀಷು ಅಧ್ಯಾಪಕರಾದ ಶ್ರೀ ಎ್. ಕೆ. ವೆಂಕಟೇಶ ಪಂತುಲು, ಯಂ. ಎ., ಯಲ್. ಟಿ. ಯವರು ಮುನ್ನುಡಿಯನ್ನು ಬರೆದಿರುವರು. ಈ ಗ್ರಂಥಕರ್ತರು ಸಮಾಜ ಸೇವೆಯ ಉದ್ದೇಶದಿಂದ ಈ ಗ್ರಂಥವನ್ನು ರಚಿಸಿರುವರು. ಇವರ ಗ್ರಂಥಕ್ಕೆ ಸಾಕಾದಷ್ಟು ಪ್ರೋತ್ಸಾಹವು ದೊರೆಯಲೆಂದು ಹಾರೈಸುವೆವು.

"ಸರಸ್ವತಿ"

'ಕುಬೇರಪತನವು' ಎಂಬುದೊಂದು ಐದಂಕಗಳನ್ನುಳ್ಳ ಆಂಧ್ರಭಾಷಾ ನಾಟಕ ಗ್ರಂಥವು. ನಮ್ಮಲ್ಲಿ ಕಥೆ, ಕವಿತೆ, ನಾಟಕಾದಿಗಳ ರಚನೆಗೆ ಕಥಾವಸ್ತುಗಳನ್ನು ಒದಗಿಸಿಕೊಡುವ ಭಾರತ ರಾಮಾಯಣಾದಿ ಪುರಾಣಗಳನ್ನು ಆಶ್ರಯಿಸದೆ ಈ ನಾಟಕವು, ಪ್ರಕೃತ್ಯ ಸಮಾಜದಲ್ಲಿರುವ ಒಂದು ದುರಾಚಾರವನ್ನು ಖಂಡಿಸುವ ಮುಖ್ಯೋದ್ದೇಶದಿಂದಲೇ ಬರೆಯಲ್ಪಟ್ಟದೆ. ಸಂಗೀತ, ಸಾಹಿತ್ಯ, ನಾಟ್ಯ ಮುಂತಾದ ಲಲಿತ ಕಲೆಗಳು ವಿಷಯಾಂಧನಾದ ಮಾನವನ ಸ್ವಾರ್ಥತೆಗೆ ಬಲಿಬಿದ್ದು, ದುರುಪಯೋಗಗೊಳಿಸಲ್ಪಡಲು ಸಿದ್ಧವಾದುವು. ಪೂರ್ವಕಾಲದಲ್ಲಿ ಅವುಗಳನ್ನು ಅಭ್ಯಸಿಸಿ ರಕ್ಷಿಸಿಕೊಂಡಿರಬೇಕೆಂದು ಏರ್ಪಟ್ಟ ದೇವದಾಸೀ ಕುಲವನ್ನು ಧೂರ್ತರಾದ ವಿಷಯೀ ಜನರು ಭ್ರಷ್ಟಗೊಳಿಸಿದರು. ಆ ಕುಲದ ಉಚ್ಚ ಧ್ಯೇಯದ ಪತನದೊಂದಿಗೆ, ಆ ಕಲೆಗಳೂ ಮಲಿನಗೊಂಡು ನಾಶವಾದುವು. ಆ ಕುಲದವರಿಗೆ ದಾಸೀನಾಮವು ಸಾರ್ಥಕವೆನ್ನಿಸಿ, ಅವರು, ಸರ್ವಪುರುಷಕುಲದ ನಿರ್ಮಾಲ್ಯವೋ—ಉಚ್ಛಿಷ್ಟವೋ ಎಂಬಂತಹ ಹೀನಸ್ಥಿತಿಗಿಳಿದರು.

ಈ ಹೀನಸ್ಥಿತಿಯನ್ನು ಕಂಡು ಮರುಗಿದ ಈ ನಾಟಕ ಕರ್ತರು, ಮೇಲ್ಕಂಡ ಸಂಗೀತ—ನಾಟ್ಯ ಕಲೆಗಳ ತೌರೂರಾದ ಆ ದೇವದಾಸೀ ಕುಲದವರ ಶೀಲವನ್ನು, ಆ ಕುಲದ ಅಮೌಲ್ಯ ಧ್ಯೇಯವನ್ನೂ ಪ್ರತಿಪಾದಿಸಲು, ಸಂಗೀತ, ಸಾಹಿತ್ಯ, ನಾಟ್ಯಕಲೆಗಳಲ್ಲಿ ಅದ್ವಿತೀಯ ಪ್ರೌಢಿಮೆಯನ್ನು ಪಡೆದು, ಸ್ತ್ರೀ ಧರ್ಮದಲ್ಲಿ ಸುಸಂಸ್ಕೃತಳಾದ ಸುಗುಣವತಿ ಎಂಬ ಒಂದು ವೇಶ್ಯಾರತ್ನವನ್ನು ಸೃಷ್ಟಿಸಿ, ಅವಳನ್ನು ಈ ನಾಟಕದ ನಾಯಕೆಯನ್ನಾಗಿರಿಸಿರುವರು.

ಆ ಸುಂದರೀಮಣಿಯನ್ನು ವರಿಸಲು, ಒಬ್ಬ ಐಶ್ವರ್ಯವಂತನನ್ನೂ ಮತ್ತು ಒಬ್ಬ ಸುಸಂಸ್ಕೃತನಾದ ಸುಂದರ ಪುರುಷನನ್ನೂ ಏರ್ಪ ಡಿಸಿರುವರು. ಐಶ್ವರ್ಯವಂತನೆಂದರೇನು ಸಾಮಾನ್ಯನಲ್ಲ! ಧನಾಧಿ ಪತಿಯಾದ ಕುಬೇರನೇ! ಇನ್ನೊಬ್ಬಾತನು, ಆವನಿಗೆ ಪ್ರತಿಕಕ್ಷಿ ಯಾದ ಮನ್ಮಥನು. ಸುಗುಣವತಿಯು ಪವಿತ್ರ ಪ್ರೇಮಕ್ಕೆ ಲು ಬ್ಧಳಾಗಿ, ದರಿದ್ರನಾದರೂ ಮನ್ಮಥನನ್ನೇ ವರಿಸುವಳೋ, ಅಥವ ಧನಲುಬ್ಧಳಾಗಿ ತನಗೆ ಅಸಮವರನಾದ ಶ್ರೀಮಂತನನ್ನು ವರಿಸು ವಳೋ ಎಂಬುದನ್ನು ನಿರ್ಧರಿಸಲು ದೇವೇಂದ್ರನ ಸಭೆಯಲ್ಲಿ ನಡೆದ ಚರ್ಚೆಯು,—ಕುಬೇರ ಮತ್ತು ಮನ್ಮಥರ ಪರಸ್ಪರ ಸ್ಪರ್ಧೆಯು, ತೀರ್ಮಾನವು ಮಾನವ ಲೋಕದಲ್ಲಿ ಆಗುವುದು. ಸುಗುಣವ ತಿಯು ತನಗೆ ಅನುರೂಪನೂ, ತನ್ನಪ್ರೇಮಕ್ಕೆ ಪಾತ್ರನೂ ಆದ ಮನೋಹರ (ಮನ್ಮಥ)ನನ್ನೇ ವರಿಸುವಳು.—ಸ್ತ್ರೀಯರು ಪ್ರೇಮ- ಸೌಂದರ್ಯಗಳನ್ನು ಲೆಕ್ಕಿಸದೆ ಧನಲುಬ್ಧರಾಗಿ, ವೃದ್ಧನಾದರೂ ಕುರೂಪಿಯಾದರೂ ಧನವಂತನನ್ನೇ ಮೆಚ್ಚಿಕೊಳ್ಳುವರು ಎಂಬ ಲೋಕೋಕ್ತಿಯನ್ನು ಸುಳ್ಳೆನ್ನಿಸುವಳು. ಕುಬೇರನು ದ್ರಾಕ್ಷಾ ಶ್ರಮದಲ್ಲಿ ಸನ್ನಿಹಿತನಾಗಿರುವ ಭೀಮಲಿಂಗೇಶ್ವರಸ್ವಾಮಿ ಸಾನ್ನಿ ಧ್ಯದಲ್ಲಿ ತನ್ನ ಸೋಲನ್ನು ಒಪ್ಪಿಕೊಳ್ಳುವನು.

ನಾಟಕಕಾರರು ಈ ನಾಟಕವನ್ನು ಸಮಾಜ ಸೇವೆಯ ಮ ಹೋದ್ದೇಶದಿಂದ ಪ್ರೇಮಪ್ರೇರಿತರಾಗಿ ಬರೆದಿರುವರು. ಭಾಷೆ ಯು ಸರಳವಾಗಿಯೂ, ರಸವತ್ತಾಗಿಯೂ ಇದ್ದು ಕಥಾಸಂದರ್ಭ ಗಳು ಆಕರ್ಷಕವಾಗಿ ಓದುಗನನ್ನು ಅಂಕದಿಂದ ಅಂಕಕ್ಕೆ ಕುತೂ ಹಲಿಯನ್ನಾಗಿಸಿ ಕರೆದೊಯ್ಯುವಂತಿರುವವು. ಈ ಗ್ರಂಥಕ್ಕೆ ರಾ ಜಮಹೇಂದ್ರನಗರದ ಗೌ|| ಕಾಲೇಜಿನ ಇಂಗ್ಲೀಷ್ ಪ್ರೊಫೆಸರರಾದ ಮ|| ಎ೯. ಕೆ. ವೆಂಕಟೇಶ ಪಂತುಲು, ಎಂ. ಎ.,ಎಲ್. ಟಿ. ಆವರು ಒಂದು ಪ್ರೌಢಮುನ್ನುಡಿಯನ್ನು ಬರೆದಿರುವರು.

ಇಂತಹ ಉತ್ತಮವೂ, ಬೋಧಕವೂ ಆದ ನಾಟಕವನ್ನು ರಚಿಸಿದುದಕ್ಕಾಗಿ, ನಾಟಕಕರ್ತರು ಅಭಿನಂದನೀಯರು.

" ಸುಭೋಧ "

Sri Vijaya Lakshmi Vilas Press, Bangalore City.